

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 354

గురువారం 16-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఈశాన్యంలో విరిసిన జాస్మిన్

డ్రోన్ల ద్వారా ఔషధాలు చేరవేస్తున్న మొదటి మహిళా డ్రోన్ ఆపరేటర్ జాస్మిన్. - 11లో



గాయత్రి-ట్రెసా జోడీ గెలుపు

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రీక్వార్టర్ ఫైనల్లోకి. - 12లో



అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం

అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమని, మెక్‌మోహన్ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. - వివరాలు 6లో▶



లాలూ కుటుంబానికి కోర్టులో ఊరట

భూమికి ఉద్యోగం కుంభకోణంలో నిందితులుగా ఉన్న లాలూ, ఆయన కుటుంబ సభ్యులకు కోర్టు నుంచి ఉపశమనం లభించింది. - వివరాలు 6లో▶



ఇటుక బట్టీలో కూలీల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో ఇటుక బట్టీ నుంచి వెలువడిన విషవాయువులు పీల్చి ఊపిరాడక బట్టీపై నిద్రిస్తున్న ఐదుగురు కార్మికులు మృతి చెందారు. - వివరాలు 6లో▶



మంచుకొండల్లో మహాముప్పు!

భారత్, చైనా పోటాపోటీ నిర్మాణాలతో హిమాలయాల్లో ప్రకృతి విధ్వంసాలు ఏర్పడే ప్రమాదముందని నిపుణులు అంటున్నారు. - వివరాలు 6లో▶

పరీక్షల పంచాయితీ

పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై 'లీకేజీ' ఒత్తిడి

నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు చేయాలంటున్న అభ్యర్థులు, విద్యార్థులు

- చైర్మన్ రాజీనామాకు రాజకీయ పార్టీల డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ విజ్ఞప్తి
- ఇప్పటివరకు ఏడు పరీక్షలు నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ
- కేవలం ఏఈ పరీక్ష పేపర్ మాత్రమే లీకైందంటున్న కమిషన్
- ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ



టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన ఏబీవీపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు - 2లో

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం రోజురోజుకు ముదురుతోంది. పలు పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీకై ఉంటాయనే అనుమానాల నేపథ్యంలో.. కమి షన్ నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేయా లని అభ్యర్థులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఏకంగా కమిషన్ చైర్మన్ రాజీనామా చేయాలంటూ ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

ఇప్పటివరకు ఏడు పరీక్షలు

రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత టీఎస్‌పీఎస్సీ వివిధ ప్రభుత్వ శాఖల్లో 17 వేల ఉద్యోగాల భర్తీకి 26 ప్రకటనలు మిగతా 2వ పేజీలో ▶

ఏఈ పరీక్ష రద్దు

- ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం
- త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 5వ తేదీన నిర్వహించిన అర్హత పరీక్షను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకైనట్లు గుర్తించిన కమిషన్ ఈ నెల 14న బేగంబజార్ మిగతా 2వ పేజీలో ▶

పెన్‌డ్రైవ్‌లో పలు పేపర్లు

కస్టోడియన్ కంప్యూటర్ నుంచి ఫోల్డర్ మొత్తం కాపీ చేసిన ప్రవీణ్

దావత్‌లో గొడవ..

వెలుగులోకి లీక్ బాగోతం

- వివరాలు 2లో▶

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయకుంటే ఆమరణ దీక్ష

- సీబీఐ విచారణకు ఆర్‌ఎస్ ప్రవీణ్ డిమాండ్

- వివరాలు 2లో▶

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి..

- అఖిలపక్ష సమావేశంలో వక్తలు డిమాండ్..

- వివరాలు 2లో▶

పేపర్ లీక్‌పై ఉద్యమించండి

- రాష్ట్ర బీజేపీకి జాతీయ నాయకత్వం ఆదేశం! - 10లో
- లీక్‌పై అధ్యయనానికి సీహెచ్ విఠల్ కన్వీనర్‌గా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

హెచ్-1బి వర్కర్లకు... ఆర్నెల్ల గ్రేస్ పీరియడ్



ఉద్యోగాలు కోల్పోతున్న హెచ్-1బి ఉద్యోగులు రెండు నెలల్లోపే కొత్త కొలువు వెతుక్కోవాలన్న నిబంధనను సడలించి గ్రేస్ పీరియడ్‌ను ఆర్నెల్లకు పెంచాలని అమెరికా అధ్యక్షుని సలహా సంఘం సిఫార్సు చేసింది. దీనికి ఆమోదం లభిస్తే వేలాది భారత టెకీలకు భారీ ఊరట కలగనుంది.

- వివరాలు 6లో▶

నేటి నుంచి భట్టి పాదయాత్ర



'హాథ్‌సే హాథ్‌జోడో యాత్ర'ల్లో భాగంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గురువారం నుంచి పాదయాత్ర చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం బజారహత్నూర పిప్రి గ్రామంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే యాత్ర ప్రారంభించనున్నారు.

- వివరాలు 3లో▶



మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై భారత్ జాగృతి నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కవిత. చిత్రంలో పలు పార్టీల ఎంపీలు, నేతలు

మా పార్టీ అయినా అంతే!

మహిళా రిజర్వేషన్లు కల్పించకపోవడంపై ఎమ్మెల్సీ కవిత

- వివరాలు 3లో▶

నేడు మళ్లీ ఈడీ ముందుకు కవిత..

- ఢిల్లీ లిక్కర్ కేసులో మరోసారి విచారించనున్న అధికారులు

- వివరాలు 3లో▶

'లిక్కర్' కేసులో తీవ్ర చర్యలొద్దు..

- ఈ మేరకు ఈడీని ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్.. తక్షణ విచారణకు నిరాకరణ - 3లో

ఏం జేస్తవో జేస్కో...

మోదీకి, ఈడీకి, బోడీకి భయపడేది లేదు.. దొంగలే భయపడుతరు



- నీతిమంతులెవరో, అవినీతిపరులెవరో ప్రజలే తీర్పిస్తరు
- ప్రజా కోర్టులోనే తేల్చుకుందాం! - 3లో
- కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని జేద్దాం
- పిట్లం సభలో మంత్రి కేటీఆర్

బీజేపీ.. ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుంది!



- ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లుతున్నారు - 10లో
- బీజేపీ సమాధులు తవ్వితే బీఆర్‌ఎస్ పునాదులు వేస్తోంది
- మంచిర్యాల జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు విమర్శలు

అబద్ధాలు అచ్చేసిన రామోజీని సభకు పిలిచి విచారించాలి



- తప్పు కేశవ్‌దో.. రామోజీదో తేలాలి
- సభా హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌ను అవమానించారంటూ ఈనాడు కథనంపై అధికారపక్ష సభ్యుల మండిపాటు.. గవర్నర్‌కు స్వాగతం పలికిన దృశ్యాల వీడియో సభలో ప్రదర్శన - 10లో



బాల వికాస, క్రిస్టియన్ మిషనరీల్లో ఐటీ సోదాలు

- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 బృందాలతో తనిఖీలు
- విదేశాల నుంచి సేకరించిన విరాళాలపై ఆరా
- పలుచోట్ల సొమ్మును దారి మళ్లించినట్టు ఆరోపణలు
- నేడు కూడా దాడులు కొనసాగే అవకాశం!

- వివరాలు 14లో▶



ఇంటర్ పరీక్షలు షురూ

- రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం తొలిరోజు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సజావుగా జరిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో ఈసారి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ నిబంధన కారణంగా పలు జిల్లాల్లో కొందరు విద్యార్థులు పరీక్షలు రాయలేకపోయారు. మొదటి రోజు 95 శాతానికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు.

- వివరాలు 5లో▶

క్లుప్తంగా...

లీకేజీపై సీబీఐ విచారణకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో విచారణ జరపాల్సింది సిట్‌తో కాదని, సీబీఐతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిట్ సీఎం కేసీఆర్ ఇంటి సంస్థ అని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దనరెడ్డికి నైతికత ఉంటే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. కేసీఆర్ ధ్యాస అంతా లిక్కర్ స్కాంపైనే ఉందని, తన కుమార్తె కవితను ఈ కేసు నుంచి ఎలా బయటపడేయాలన్న దాని పైనే ఆలోచన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

పెద్దలు తప్పించుకోవాలని చూస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో పెద్దల హస్తం ఉందని, ఈ పెద్దలు తప్పించుకుని కిందిస్థాయి ఉద్యోగులను బలి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని బుధవారం ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాటంతో వచ్చిన తెలంగాణలో ఉద్యోగాల అమ్మకాలు దారుణమని, రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి ఉద్యోగ నియామకంలో అక్రమాలు జరిగాయని, ఈ పరీక్షలన్నింటిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

తాటిపల్లిలో కలకలం

లీక్ కేసులో ఏ–2 ఈ గ్రామవాసే

మల్యాల (చొప్పదండి): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన అట్ల రాజశేఖర్‌రెడ్డి ఏ–2 నిందితుడిగా ఉండడం గ్రామంలో చర్చనీయాంశమైంది. రాజశేఖర్‌రెడ్డి డిగ్రీ పూర్తిచేశాడు. ఉపాధి కోసం అఫ్గానిస్తాన్ వెళ్లి ఐదేళ్ల పాటు పనిచేశాడు. తిరిగివచ్చి వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. టీఎస్‌పీఎస్సీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఉద్యోగం చేస్తున్నాడు. అతను సౌమ్యుడని కొందరు చెబుతుండగా, నిరుద్యోగులకు అన్యాయం చేసేలా వ్యవహరించాడంటూ మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజశేఖర్‌రెడ్డి తల్లి వసంత గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి అంజిరెడ్డి సుమారు 20 ఏళ్లు గల్ఫ్ వెళ్లి వచ్చి ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నారు.

'ఎమ్మెల్సీ' కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

హుడా కాంప్లెక్స్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి డీఎస్ లోకేశ్‌కుమార్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాగా, ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది.

ఏఈ పరీక్ష రద్దు

▶ మొదటి పేజీ తరువాయి

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ నేపథ్యంలోనే పలు వరుస సమీక్షల్లో సుదీర్ఘ చర్చల అనంతరం పరీక్ష రద్దు చేస్తున్నట్టుగా బుధవారం సాయంత్రం ప్రకటన విడుదల చేసింది. ఈ పరీక్షను మళ్లీ కొత్తగా నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన తేదీ, సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని బోర్డు కార్యదర్శి వెల్లడించారు.

మొత్తం 837 పోస్టులు

వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లోని 837 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ గతేడాది నోటిఫికేషన్ విడుదల చేసింది. 74,478 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏడు జిల్లాల్లోని 162 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 68,257 మంది అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోగా.. పేపర్–1కు 55,189 మంది, పేపర్–2కు 54,917 మంది హాజరయ్యారు.

ఇదండీ సంగతి



ఎక్కడైనా ఏదైనా పనులు చేపట్టాలంటే ముందుగా ఎంత ఖర్చవుతుందని అంచనా (ఎస్టిమేషన్) వేసుకోవాలి...

- → ఆ తర్వాత ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన అనుమతులు తీసుకోవాలి.
- → అటు తర్వాత అంచనాకు అనుగుణంగా టెండర్లను ఆహ్వానించాలి.
- → ఈ మేరకు నిర్దేశిత తేదీతో టెండర్ నోటిఫికేషన్ వేయాలి.
- → దాఖలైన టెండర్లను పరిశీలించి కాంట్రాక్ట్ సంస్థను ఖరారు చేయాలి.
- → అనంతరం వారితో ఒప్పందం కుదుర్చుకోవాలి. అప్పుడు పనులు మొదలెట్టాలి
- → ఆ తర్వాత దశల వారీగా బిల్లులు చెల్లించుకుంటూ పోవాలి.

ఎక్కడైనా.. ఏ ఊళ్లో అయినా ఇదే లెక్క.. అయితే వనపర్తి జిల్లాలోని మంత్రి ఇలాకాలో మాత్రం లెక్క వేరేగా ఉంటుంది.

- → ముందుగానే పనులు చేపడతారు.
- → పనులు పూర్తయ్యే దశలో అంచనాలు రూపొందిస్తారు.
- → ఆ తర్వాత ప్రభుత్వం నుంచి పరిపాలనా అనుమతులు పొందుతారు. పోటీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా టెండర్ ప్రక్రియ ముగిస్తారు.
- → బిల్లులు చేయించి.. డబ్బులు తీసేసుకుంటారు.

ఏమిటీ నమ్మశక్యంగా లేదా.... అయితే ఒక్కసారి ఈ ఫొటో చూడండి..



ఇది వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని మర్రికుంట చెరువు. పైన చెప్పిన నిబంధనలేవీ పాటించకుండానే,టెండర్లు పిలవకుండానే దీన్ని ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడంతోపాటు సుందరీకరణ పనులు కొనసాగించేస్తున్నారు. ఇలా అభివృద్ధి పనుల పేరిట నిబంధనలకు నీళ్లొదిలి.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దోపిడీ పర్వానికి తెరలేపిన తీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

టెండర్లకే టెండర్ పెట్టారు

ముందు అడ్డగోలుగా పనులు..

ఆ తర్వాతే అంచనాలు, అనుమతులు

మొత్తంగా నిబంధనలకు 'నీళ్లు'..!

- చెరువుల సుందరీకరణలో దోపిడీ పర్వం.. పనులు ప్రారంభించిన తర్వాతే అంచనాలు
- తూతూమంత్రంగా టెండర్ ప్రక్రియ
- ఆ మంత్రి ఇలాకాలో అంతే
- ముఖ్య నేత బినామీలే కాంట్రాక్టర్లు
- నిద్ర నటిస్తున్న అధికారులు

నిబంధనల ప్రకారం ఒక్కోవర్క్ రూ.5 లక్షల వరకు అయితే నామినేషన్ పద్ధతిన కేటాయింపులు చేయాలి. అంతకంటే మించి అయితే టెండర్ పద్ధతిన కాంట్రాక్ట్‌లు అప్పగించాలి. కానీ వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన నాలుగు చెరువుల సుందరీకరణకు సంబంధించి ఒక్కో దానికి సుమారు రూ.30 లక్షలకు పైబడి వ్యయమవుతుందని అంచనా. ఈ మేరకు టెండర్ తప్పనిసరి కాగా.. పిలిస్తే పోటీ ఎక్కువ ఉంటుందనే ఉద్దేశంతో గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చినట్లు తెలుస్తోంది. లోలోపల టెండర్ దక్కించుకున్న ప్రముఖ కాంట్రాక్టర్లు అధికార పార్టీకి చెందిన నాయకులేనని తెలుస్తోంది. వీరంతా ఓ ముఖ్య నేతకు ప్రధాన అనుచరులుగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

'బినామీ' కాంట్రాక్టర్లు..?

నోరు మెదపని అధికారులు..

ప్రభుత్వం నుంచి అనుమతులు రాకుండానే పనులు ప్రారంభించడం.. పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్, పంచాయతీరాజ్, అటవీ, మున్సిపల్ అధికారులు నోరు మెదపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యనేత ఆదేశాల నేపథ్యంలో వారు నిబంధనలకు నీళ్లు వదిలినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. పనులు పూర్తయిన క్రమంలో వ్యయానికి మించి అంచనాలు రూపొందించి.. ఎక్కువ మొత్తంలో దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఇది లక్ష్మీకుంట. 20వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో కూడిన ఈ చెరువు సుందరీకరణ పనులు 2021లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత సుమారు ఎనిమిది నెలల అనంతరం రూ.31.75 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. 2022 సెప్టెంబర్‌లో పరిపాలనా అనుమతులు రాగా.. గత నెల 14న రూ.29.59 లక్షలు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో పనులు కొనసాగగా.. అటవీ శాఖ కు సంబంధించి కంపా నిధులు వెచ్చించారు.



సాక్షి ప్రతినిధి, మహబూబ్ నగర్

ఇది రాజనగరం చెరువు. ట్యాంక్ బండ్ నిర్మాణంతో పాటు సుందరీకరణ పనులు గత ఏడాది జనవరిలో ప్రారంభమయ్యాయి. సుమారు రూ.49 లక్షల వ్యయంతో అదే ఏడాది ఫిబ్రవరిలో ఎస్టిమేషన్ (అంచనా) వేయగా.. అదే నెలలో పరిపాలనాపరమైన అనుమతులు లభించాయి. మార్చిలో కాంట్రాక్ట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోగా.. జూన్‌లో కొంత మేర బిల్లులు మంజూరయ్యాయి.

2021 ఆగస్టులో తాళ్లచెరువు సుందరీకరణ పనులు ప్రారంభం కాగా.. గత ఏడాది ఫిబ్రవరిలో అంచనా వేసి ప్రభుత్వానికి పంపించారు. అనుమతులు రాగా.. మార్చిలో టెండర్ ప్రక్రియ పూర్తయి ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత జూన్‌లో బిల్లులు మంజూరయ్యాయి.

పరీక్షల పంచాయితీ

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేసింది. ఇందులో ఇప్పటివరకు ఏడు పరీక్షలు నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ నుంచి ప్రకటనలు వెలువడుతుండగా, వాటికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, పరీక్షా కేంద్రాల ఎంపిక, వాటి నిర్వహణ తదితరాలపై దృష్టి పెట్టిన టీఎస్‌పీఎస్సీ... వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి గతేడాది అక్టోబర్ 16న ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహించింది. ఆ తర్వాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) ఉద్యోగాల అర్హత పరీక్షలను గతేడాది నవంబర్ 7వ తేదీన నిర్వహించింది. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలోని ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీపీఓ), అసిస్టెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏసీడీపీఓ), వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో మేనేజర్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్షను ఈ ఏడాది జనవరి మూడో తేదీన నిర్వహించగా.. ఇదే శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (గ్రేడ్–2 సూపర్‌వైజర్) ఉద్యోగాల అర్హత పరీక్ష ఈ ఏడాది జనవరి 8వ తేదీన నిర్వహించారు. అలాగే ఇంజనీరింగ్ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్ష జనవరి 22న, ఆర్థిక శాఖకు సంబంధించిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) అర్హత పరీక్ష ఫిబ్రవరి 26న, వివిధ ఇంజనీరింగ్ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్ష మార్చి 5వ తేదీన నిర్వహించారు. ఇక ఈనెల 12న జరగాల్సిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష రద్దు కాగా, ఈనెల 15, 16 తేదీల్లో జరగాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలు కూడా రద్దయ్యాయి.

గ్రూప్-1 ప్రిలిమ్స్ లీక్‌పై అనుమానాలు

నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనల్లో తొలుత నిర్వహించిన అర్హత పరీక్ష గ్రూప్–1 ప్రిలిమ్స్. కాగా ఈ పరీక్షకు లీక్ కేసులో నిందితుడు ప్రవీణ్‌కుమార్ కూడా హాజరై ఏకంగా 103 మార్కులు తెచ్చుకోవడంతో పేపర్ లీక్‌పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కంప్యూటర్ నుంచి ఓ ఫోల్డర్ మొత్తం కాపీ చేశాడని, అందులో వివిధ పరీక్షల పేపర్లు ఉన్నాయనే సమాచారం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఈ క్రమంలోనే ఇప్పటివరకు నిర్వహించిన ఏడు పరీక్షలు రద్దు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగులు.. టీఎస్‌పీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాలు, దీక్షలు చేపడుతున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని, కమిషన్ కార్యదర్శిని తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయకుంటే ఆమరణ దీక్ష

సీబీఐ విచారణకు ఆర్ఎస్ ప్రవీణ్ డిమాండ్



పరిగి, నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేకుంటే 48 గంటల్లో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. బుధవారం వికారాబాద్ జిల్లా పరిగిలో భీమ్ దీక్షను ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షతో పాటు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి హయాంలో నిర్వహించిన పరీక్షల నిర్వాకాలపై విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖ రాస్తానని తెలిపారు. స్వచ్ఛందంగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఈ విషయమై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇక ఏ చిన్న సంఘటన జరిగినా క్షణాల్లో ట్వీట్ చేసే మంత్రి కేటీఆర్ ఈ విషయమై స్పందించక పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా నాగర్‌కర్నూల్‌కు వచ్చిన ప్రవీణ్‌కుమార్ స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాంకు సంబంధించి కేసీఆర్ కుటుంబం మీద అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.

పెన్‌డ్రైవ్‌లో పలు పేపర్లు!

కస్టోడియన్ కంప్యూటర్ నుంచి ఫోల్డర్ మొత్తం కాపీ చేసిన ప్రవీణ్

- అందులో ఇప్పటికే జరిగిన, జరగాల్సిన పరీక్షల ప్రశ్న పత్రాలు
- 'టౌన్ ప్లానింగ్'పేపర్ అమ్మే ప్రయత్నంలోనే విషయం లీక్
- కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సిట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఉన్న కమిషన్ కార్యదర్శి మాజీ వ్యక్తిగత సహాయకుడు పులిదిండి ప్రవీణ్‌కుమార్ పెన్‌డ్రైవ్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ పోస్టులకు సంబంధించిన పరీక్షల పేపర్లు ఉన్నట్లు ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించారు. మరోపక్క ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటైన సిట్ తన పనిలో నిమగ్నమైంది.



యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ తస్కరించి..

తన 'సన్నిహితురాలు'లవడ్యావత్ రేణుక కోరడంతో క్వశ్చన్ పేపర్ల లీక్‌కు ప్రవీణ్‌కుమార్ తెగించాడు. నెట్‌వర్క్ అడ్మిన్ రాజశేఖర్ సహాయంతో రంగంలోకి దిగాడు. పేపర్లన్నీ కమిషన్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లోని కంప్యూటర్‌లో ఉంటాయి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కస్టోడియన్ శంకరలక్ష్మి వద్ద ఉన్నాయి. వీటిని ఆమె తాను నిత్యం వినియోగించే నోట్ పుస్తకం ఆఖరు పేజీలో రాసి పెట్టుకున్నారు. గత నెల ఆఖరి వారంలో ఆమె కార్యదర్శి పేషీకి వచ్చినప్పుడు దృష్టి మళ్లించడం ద్వారా వాటిని నమోదు చేసుకున్నాడు. టీఎస్‌పీఎస్సీలోని అన్ని కంప్యూటర్లు ల్యాన్ నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయి ఉంటాయి. ఈ విషయం తెలిసిన రాజశేఖర్.. ప్రవీణ్ కంప్యూటర్ నుంచే శంకరలక్ష్మి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఉపయోగించి లాగిన్ అయ్యేలా సహకరించాడు. క్షణాల్లో పని కానిచ్చేయాలని భావించిన ప్రవీణ్ క్వశ్చన్ పేపర్లకు సంబంధించిన ఫోల్డర్ మొత్తం తన పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నాడు.

ఫోన్ల విశ్లేషణతోనే పూర్తి స్పష్టత

ప్రాథమిక దర్యాప్తు నేపథ్యంలో పోలీసులు ఏఈ పరీక్ష పత్రం మాత్రమే లీక్ అయిందని, ప్రవీణ్ ఫోల్డర్‌లో ఉన్న మిగిలిన ప్రశ్న పత్రాలు బయటకు రాలేదని తేల్చారు. దీన్ని సాంకేతికంగా నిర్ధారించుకోవాలని నిర్ణయించారు. దీనికోసమే నిందితులతో పాటు అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న 16 ఫోన్లు, ల్యాప్‌టాప్స్, పెన్‌డ్రైవ్స్‌లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. వాటిలో ఏఏ క్వశ్చన్ పేపర్ల షేరింగ్ జరిగింది? ఎవరి నుంచి ఎవరికి వెళ్లాయి? వేటిని కాపీ చేశారు? అంశాలను తేల్చనున్నారు.

యువతుల వ్యవహారం పరిగణనలోకి..

ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్ బృందం బుధవారం కమిషనర్ సీవీ ఆనంద్‌తో సమావేశమైంది. ప్రాథమికంగా ఈ కేసును సీసీఎస్‌లో రీ–రిజిస్టర్ చేశారు. అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ కమిషన్ కార్యాలయానికి వెళ్లి కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌తో పాటు ప్రశ్న పత్రాలు భద్రపరిచే విధానం తదితరాలను పరిశీలించారు. కస్టోడియన్ శంకరలక్ష్మి వాంగ్మూలం నమోదు చేశారు. ప్రవీణ్‌తో సన్నిహితంగా ఉన్న 46 మంది మహిళలు, యువతుల వ్యవహారాన్నీ పోలీసులు పరిగణనలోకి తీసుకున్నారు. వీరి వ్యవహారాల్లోనూ ఏవైనా లీకేజీలు, ఇతరత్రా కోణాలు ఉన్నాయా? అనేది తేల్చనున్నారు. అవసరమైన వారిని పిలిచి విచారించాలని నిర్ణయించారు.

రెండో ప్రయత్నంలో విషయం లీక్..

ఈ ఫోల్డర్‌లో అప్పటికే జరిగిపోయిన, జరగాల్సిన పరీక్షలకు సంబంధించిన క్వశ్చన్ పేపర్లు ఉండటాన్ని గుర్తించిన ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌కు లాక్ సెట్ చేశాడు. గత నెల ఆఖరి వారంలోనే రేణుక కోరిన పరీక్ష పత్రం అందజేశాడు. టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష (ఈ నెల 12న జరగాల్సిన పరీక్ష), ఇంకా తేదీలు ఖరారు కాని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ పోస్టుల పేపర్లను అదును చూసుకుని విక్రయించాలని భావించాడు. ఏఈ పేపర్‌ను రేణుక తదితరులు నీలేష్ , గోపాల్‌లకు రూ.10 లక్షల చొప్పున విక్రయించారు. టౌన్ ప్లానింగ్ పరీక్ష పత్రం విషయాన్నీ రేణుక వీరికి చెప్పింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉంటే తనకు తెలపాలని కోరింది. ఇలా ఈ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం వెతుకుతుండగానే విషయం బయటపడింది.

దావత్‌లో గొడవ.. వెలుగులోకి లీక్!

- ఏఈ పరీక్ష అనంతరం వనపర్తికి రేణుక, తదితరులు
- ఇంట్లో దావత్ చేసుకుంటుండగా డబ్బులపై గొడవ
- ఒప్పందం ప్రకారం మొత్తం ఇవ్వాలని నీలేశ్‌ను బెదిరించిన రేణుక
- డయల్ 100కు ఫోన్ చేసిన నీలేశ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: టీఎస్‌పీఎస్సీ ఈ నెల ఐదో తేదీన నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్స్ పరీక్ష పేపర్ల లీకేజీకి సంబంధించి ఆసక్తికరమైన సమాచారం వెలుగులోకి వచ్చింది. పరీక్ష అనంతరం ఈ కేసులో నిందితులతో పాటు మరికొందరు వనపర్తిలో దావత్ చేసుకున్నారని, ఆ సమయంలో 'లీకేజీ డబ్బులు'విషయమై గొడవ జరిగిందని, ఆ గొడవతోనే పేపర్ లీక్ విషయం బయటపడిందని తెలిసింది. ఈ బాగోతంలో తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఇందులో ఆరుగురు పాలమూరుకు చెందినవారేనన్న సంగతి తెలిసిందే.

పంచాంగల్‌లో ప్రిపరేషన్..వనపర్తిలో దావత్

ఏ–1 నిందితుడు ప్రవీణ్ నుంచి పేపర్ తీసుకున్న తర్వాత.. పరీక్షకు ఒకట్రెండు రోజుల ముందు రేణుక, డాక్యా దంపతులు గండేడ్ మండలం పంచాంగల్ తండాలోని ఇంటికి వచ్చారు. వీరితో పాటు ఆమె పెద్ద నాన్న కొడుకు శ్రీనివాస్ (మేడ్చల్ కానిస్టేబుల్), ఈయన స్నేహితులు కేతావత్ నీలేశ్ నాయక్, అతడి తమ్ముడు రాజేంద్ర నాయక్, వికారాబాద్ జిల్లా దుగ్యాల మండలం లగచర్ల తండాకు చెందిన పత్లావత్ గోపాల్ నాయక్ కూడా వచ్చినట్లు సమాచారం. రేణుక తమ్ముడు రాజేశ్వర్ కూడా వీరితో జత కాగా.. వారిని అక్కడే చదివించి 5న సరూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. పరీక్ష రాసిన తర్వాత రేణుక కారులో రాజేశ్వర్, శ్రీనివాస్, నీలేశ్, రాజేంద్ర నాయక్ వనపర్తి ఇంటికి వచ్చారని, అంతా కలిసి దావత్ చేసుకున్నారని సమాచారం. ఆ సమయంలో డాక్యా, గోపాల్ నాయక్ వారితో ఉన్నారా? లేరా? అనేది తెలియలేదు.

ఘర్షణ, బెదిరింపుతో..

దావత్ క్రమంలో రేణుక డబ్బుల విషయం లేవనెత్తినట్లు సమాచారం. ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున ఇచ్చేందుకు ఒప్పందం కుదరగా.. రూ.5 లక్షలు చొప్పున ఇచ్చి మిగతా డబ్బు తర్వాత ఇస్తామని రేణుకకు చెప్పారు. అయితే ఆమె ఇప్పుడే పూర్తిగా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే నీలేశ్‌నాయక్, రేణుక మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ జరిగినట్లు సమాచారం. నీలేశ్‌ను రేణుక బెదిరించడంతో ఆయన బయటకు వచ్చి డయల్ 100కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఆ ఇంటికి వచ్చి అందరినీ తీసుకెళ్లారు. వారు విచారించడంతో లీకేజీ డొంక కదిలినట్లు తెలుస్తోంది.

పేరులో తప్పు సరిచేసుకునేందుకు వెళ్లి..

రేణుకకు హిందీ పండిట్ ఉద్యోగం వచ్చిన తర్వాత రికార్డుల్లో ఆమె పేరులో తప్పుదొర్లింది. దీన్ని సరిచేసుకునేందుకు వెళ్లిన క్రమంలో ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత వారు తరచుగా కలిసేవారని.. రేణుక టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వెళ్లేదని తెలిసింది. ఈ క్రమంలోనే కవిత, ఆమె భర్త డాక్యా, ప్రవీణ్‌తో కలిసి పేపర్ లీకేజీ స్కెచ్ వేశారు. రేణుక సొంతూరు గండేడ్ మండలంలోని మన్సూర్‌పల్లి కాగా అత్తగారిల్లు ఇదే మండలంలోని పంచాంగల్ తండా. ఇలావుండగా వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఇంటెలిజెన్స్ అధికారులు బుధవారం ఈ రెండు తండాల్లో పర్యటించి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాల్సిందే

- భగ్గుమన్న విద్యార్థి సంఘాలు
- పేపర్ లీకేజీ ఘటనపై విచారణ జరపాలని డిమాండ్
- ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, ఆమ్‌ఆద్మీ ఆధ్వర్యంలో ఆందోళన
- టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడి



నిరసనకారుల్ని అరెస్టు చేస్తున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ, లిబర్టీ: టీఎస్‌పీఎస్సీ నియామక పరీక్షా పత్రాల లీకేజీపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. పేపర్‌లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, ఆమ్‌ఆద్మీ యువజన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. లీకేజీ నిర్వాకానికి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి యువతకు భరోసా ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో విద్యార్థి నాయకులను గోషామహల్ పోలీస్‌స్టేడియంతో పాటు పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయం, గాంధీభవన్ వద్ద గుమికూడిన వ్యక్తులను కూడా ముందస్తుగానే అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ అధికారులు చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఆమ్ ఆద్మీ విద్యార్థి యువజన విభాగం నేతలు రణధీర్‌సింగ్, రాణా తేజ్, రాకేష్‌సింగ్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా, టీఎస్‌పీఎస్సీ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఆందోళనలు చేపట్టకుండా నాలుగు రోజుల పాటు 144 సెక్షన్ విధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు.

పేపర్ లీకేజీపై నిరసనల వెల్లువ

ప్రభుత్వ, టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మల దహనం



ఖమ్మంలో ప్రదర్శన నిర్వహిస్తున్న పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీపై జిల్లాల్లో విద్యార్థి సంఘాలు ఆందోళనలకు దిగాయి. బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ ధర్నాలు నిర్వహించాయి. బోర్డులో ఇంత జరుగుతున్నా, నిర్లక్ష్యం వహించిన బోర్డు చైర్మన్, కార్యదర్శిపై విచారణ నిర్వహించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ పట్టణంలో ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, బీజేపీ ఆధ్వర్యంలో, కామారెడ్డిలో పీడీఎస్‌యూ, బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. హనుమకొండ అశోకా జంక్షన్‌లో పీడీఎస్‌యూ, పాలమూరు వర్సిటీ ఎదుట ఏబీవీపీ, నల్లగొండ జిల్లా దేవరకొండతో పాటు నిజామాబాద్ పట్టణం, తెలంగాణ యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాలు టీఎస్‌పీఎస్సీ దిష్టిబొమ్మలను దహనం చేశాయి. సిరిసిల్ల పట్టణంలో బీఎస్పీ రాస్తారోకో నిర్వహించగా, మంచిర్యాలలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ నిర్వహించింది.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- పేపర్ లీకేజీ వ్యవహారంపై సీఎం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది
- నైతికబాధ్యత వహిస్తూ చైర్మన్, సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి
- అఖిలపక్ష సమావేశంలో అభిప్రాయపడ్డ వక్తలు



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

పంజగుట్ట (హైదరాబాద్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దీని వెనుక ఎవరెవరున్నారో మొత్తం బయటకు తీయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఎప్పుడూ ఏపీపీఎస్సీ పేపర్లు లీకేజీ కాలేదని, తొలిసారి తెలంగాణలో లీకేజీ కావడం రాష్ట్ర చరిత్రలోనే ఇదొక దుర్దినమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ కేసులో కవిత ఉందా లేదా అనేదానికన్నా ఇది చాలా పెద్ద కేసని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవడం, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సైతం ఈ వ్యవహారంపై నోరువిప్పకపోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జాక్ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ మాట్లాడారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన చోట ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్‌ను టీఎస్‌పీఎస్సీలో పెట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి మాట్లాడుతూ..తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి లీకేజీలు చూడలేదన్నారు. ఓఎమ్ఆర్ షీట్ నింపలేని వాడికి 103 మార్కులు వచ్చాయంటే కచ్చితంగా లీకేజీ జరిగిందని అర్థమవుతుందన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ అతడితోపాటు సీఎం కేసీఆర్ కూడా తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు విఠల్ మాట్లాడుతూ..ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తాను మాజీ సభ్యుడినని చెప్పుకోవడానికే సిగ్గుగా ఉందన్నారు. కనీసం సెక్రటరీకి కూడా చెప్పకుండా చైర్మన్ గోప్యతను పాటించాలని కానీ, ఒక సెక్షన్ ఆఫీసర్ చేతికి పేపర్లు వెళ్లిపోవడం దారుణమన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంతో టీఎస్‌పీఎస్సీ విశ్వసనీయత, పేరు ప్రతిష్టలు దిగజారిపోయాయన్నారు. సమావేశంలో ఈడబ్ల్యూఎస్ జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సీపీఐ యువజన నేత ధర్మేంద్ర, బీజేపీ నాయకుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, చెరుకు సుధాకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, సీనియర్ జర్నలిస్టు విఠల్ పాల్గొన్నారు.

'లిక్కర్' కేసులో తీవ్ర చర్యలొద్దు

ఈ మేరకు ఈడీని ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్

- 16న జరిగే విచారణపై స్టే ఇవ్వాలని విజ్ఞప్తి
- ఈడీ విచారణ పారదర్శకతపై అనుమానాలు ఉన్నాయి
- థర్డ్ డిగ్రీ చర్యలకు పాల్పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది
- చట్ట విరుద్ధంగా ఫోన్‌ను సీజ్ చేశారు.. ఎందుకనే వివరణా ఇవ్వలేదు
- కవితపై కేంద్రంలోని అధికార పార్టీ కుట్ర.. కావాలనే ఇబ్బంది పెడుతున్నారు
- న్యాయవాది సమక్షంలో విచారించేందుకు అవకాశం ఇవ్వాలని విన్నపం
- పిటిషన్‌పై అత్యవసర విచారణకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నిరాకరణ
- ఈ నెల 24న విచారణకు చేపడతామని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో తనపై తీవ్ర చర్యలు తీసుకోవద్దని ఈడీని ఆదేశించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈడీ విచారణ పారదర్శకతపై అనుమానాలు వస్తున్నాయని.. నిందితులు/సాక్షులపై థర్డ్ డిగ్రీ చర్యలకు పాల్పడుతున్న పరిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు. అధికారులు చట్ట విరుద్ధంగా తన ఫోన్‌ను సీజ్ చేశారని కోర్టుకు తెలిపారు. కేంద్రంలోని అధికార పార్టీ కుట్రతో కావాలనే ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. అందువల్ల ఈ నెల 11 నాటి విచారణకు సంబంధించిన తదుపరి చర్యలపై, 16న జరగాల్సిన విచారణపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది వందన సెహగల్ బుధవారం కవిత తరఫున అభ్యర్థనలను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనానికి విన్నవించారు. ఈ తరహా కేసుల్లో గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులను పిటిషన్‌లో ప్రస్తావించారు. కవిత పిటిషన్‌లోని అంశాలివీ..

''పిటిషనర్ తెలంగాణ సీఎం చంద్రశేఖర్‌రావు కుమార్తె, ఉన్నత విద్యావంతురాలు, మహిళా ఎమ్మెల్సీ. గతంలో లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నప్పుడు పార్లమెంటులో పలు కమిటీల్లో పనిచేశారు. ఎన్నో సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కానీ ఈడీ ఉద్దేశ పూర్వకంగా ఇండోస్పిరిట్స్ తదితరుల కేసులో ఆమెను విచారిస్తోంది. 2022 ఆగస్టు 17న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్ పేరు లేదు. కొందరు వ్యక్తుల నిర్దిష్ట వాంగ్మూలం ఆధారంగా మాత్రమే ఈ కేసులో ఇంప్లీడ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో పిటిషనర్ పేరును కావాలనే ప్రస్తావిస్తున్నారు. అంతేకాదు ఈడీ దాఖలు చేసిన రిమాండ్ అప్లికేషన్‌లో పిటిషనర్ వ్యక్తిగత వివరాలు పొందుపరిచింది. అలా చేయాల్సిన అవసరం లేదు. ఈ విధంగా పిటిషనర్‌పై కేంద్రంలోని అధికారపార్టీ కుట్రలో భాగంగా ఈడీ పనిచేస్తోంది. న్యాయస్థానం జోక్యంతోనే పిటిషనర్‌పై రాజకీయ కుట్ర ఆగుతుంది.

విచారణకు సహకరించినా కూడా..

సీబీఐ 2022 డిసెంబర్ 2న పిటిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. అదే నెల 11న పిటిషనర్ నివాసంలో సుమారు ఏడు గంటలపాటు విచారించింది. అయితే ఈ ఏడాది మార్చి 10న జంతర్‌మంతర్ వద్ద నిరసన దీక్ష చేస్తామని పిటిషనర్ మార్చి 2న ప్రకటించారు. కానీ దీక్షకు ఒకరోజు ముందు (9న) విచారణకు హాజరుకావాలంటూ 7న ఈడీ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ విజ్ఞప్తి చేయడంతో 11న విచారణ చేపట్టి.. మళ్లీ 16న హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. ఇంటి వద్ద విచారించాలని కోరినా అనుమతించలేదు.

చట్ట విరుద్ధంగా ఫోన్ సీజ్..

ఈ నెల 7న ఈడీ మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 50(2), 50(3) ప్రకారం సమన్లు ఇచ్చింది. అంటే వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలి. కానీ ఫోన్ ఇవ్వాలని అందులో పేర్కొనలేదు. విచారణకు హాజరయ్యాక ఫోన్ ఇవ్వాలని అధికారులు కోరగా.. పిటిషనర్ ఫోన్ తెప్పించి అందజేశారు. కానీ ఈడీ అధికారులు చట్టవిరుద్ధంగా ఫోన్‌ను సీజ్ చేశారు. ఎందుకు అలా చేస్తున్నారని అడిగినా వివరణ ఇవ్వలేదు. పైగా ఫోన్‌ను పిటిషనరే స్వయంగా అందజేశారని ఈడీ పేర్కొంది. ఇక పిటిషనర్‌ను నివాసంలో విచారించాలని కోరినా ఈడీ తిరస్కరించిన నేపథ్యంలో అరెస్టు చేస్తారన్న భావన వ్యక్తమైంది. అలా జరగలేదు. కానీ రాత్రి సుమారు 8.30 గంటలకు వరకూ విచారణ కొనసాగింది.

ఆ స్టేట్‌మెంట్లలో విశ్వసనీయత కనిపించట్లేదు

పిటిషనర్‌పై ఎలాంటి కేసు లేదు. కొందరు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా ఈడీ విచారిస్తోంది. కానీ తన స్టేట్‌మెంట్‌ను ఉపసంహరించుకుంటున్నానని అరుణ్ పిళ్లై కోర్టులో పిటిషన్ వేయడాన్ని చూస్తే.. ఆ స్టేట్‌మెంట్లు బలవంతంగా సేకరించినట్లు స్పష్టమవుతోంది. ఈడీ చెప్తున్న స్టేట్‌మెంట్లపై విశ్వసనీయత కనిపించడం లేదు.

ఈడీ ఆఫీసులో విచారణ పిటిషనర్‌కు హానికరం!

ఈడీ విచారణలో భాగంగా థర్డ్ డిగ్రీ వంటి తీవ్ర చర్యలకు పాల్పడుతోందని శరత్‌చంద్రారెడ్డి విచారణ సమయంలో గాయపడిన చందన్‌రెడ్డిని చూస్తే అర్థమవుతుంది. పిటిషనర్, ఇతర నిందితులకు ఎదురైన పరిణామాలు చూస్తుంటే శారీరకంగా, మానసికంగా ఈడీ బాధించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరోసారి ఈడీ కార్యాలయంలో విచారించడం పిటిషనర్‌కు హానికరమే. పిటిషనర్ తన నివాసంలో విచారణకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నారు. పూర్తి పారదర్శకత కోసం పిటిషనర్‌ను న్యాయవాది సమక్షంలో విచారించాలి'' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

అత్యవసర విచారణకు నో..

ఈడీ దర్యాప్తుపై స్టే ఇవ్వాలంటూ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కవిత తరఫు న్యాయవాది సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు బుధవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. కానీ అత్యవసర విచారణకు నిరాకరించిన సీజేఐ.. ఈ నెల 24న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

ఏం జేస్తవో జేస్కో...

మోదీకి, ఈడీకి, బోడీకి భయపడేది లేదు .. దొంగలే భయపడుతరు

- నీతిమంతులెవరో, అవినీతిపరులెవరో ప్రజలే తీర్పిస్తరు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్లు రాకుండ జెయ్యాలె...
- ప్రజా కోర్టులోనే తేల్చుకుందాం!
- కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని జేద్దాం
- పిట్లం సభలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ మంత్రి కేటీఆర్


పిట్లం బహిరంగ సభలో మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

సాక్షి, కామారెడ్డి: 'భయపడేది లేదు.. ఏం జేస్తవో చేసుకో.. మోదీకి, ఈడీకి, బోడీకి, ఎవ్వనికీ భయపడేది లేదు..ఏం పీక్కుంటవో పీక్కో... భయపడేది దొంగలు.. మనం భయపడాల్సిన అవసరం లేదు. కచ్చితంగా ప్రజల దగ్గరకు పోదాం.. ప్రజా కోర్టులో తేల్చుకుందాం. ఎవరు నీతి మంతులో, ఎవరు అవినీతి పరులో, ఎవరు ఏం తప్పు చేసిండ్రో, ఒప్పు జేసిండ్రో.. ప్రజాక్షేత్రంలో ప్రజలే 2023లో తీర్పు చెప్పుతరు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ మున్సిపల్ శాఖల మంత్రి కే తారక రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీని సవాల్ చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో రూ.470 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన నాగమడుగు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పిట్లం మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ మహానటుడు అంటూ ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల సమయంలో జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తానన్న మోదీ, డబ్బులన్నీ తన స్నేహితుడు ఆదానీ ఖాతాలో జమ చేశారని, దేశ సంపదను దోచిపెట్టాడని విమర్శించారు. దోస్తు ఖాతాలో నింపిన డబ్బులను చందాల రూపంలో తీసుకుని, ప్రతిపక్ష పార్టీలను చీల్చడం, ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలను పడగొట్టడం చేస్తూ అద్భుతమైన నటన ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నపుడు గ్యాస్ సిలిండర్ ధర రూ.4 వందలు ఉంటే ఆయన్ను సన్నాసి అని తిట్టారని, మరి మోదీ పాలనలో సిలిండర్ ధర రూ.1200 అయ్యిందని, దీనికి ఏమనాలని ప్రశ్నించారు. అందుకే బీజేపీకి డిపాజిట్లు కూడా రాకుండా చూడాలని కోరారు.

ఫేకుడు, జోకుడే తప్ప బండి చేసేందేమీ లేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఫేకుడు, జోకుడే తప్ప చేసిందేమి లేదని కేటీఆర్ విమర్శించారు. బీజేపీ తెలంగాణకు పట్టిన శని, దరిద్రం అని, వచ్చే ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా చేయాలని ప్రజలను కోరారు. యాభై ఐదేళ్ల పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయకుండా, ఇప్పుడు ఒక్క చాన్స్ అంటూ పీసీసీ అధ్యక్షుడు తిరుగుతున్నాడని, అన్ని సార్లు అవకాశం ఇస్తే ఎందుకు చేయలేదని నిలదీశారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు గోదావరి నీరు వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని, మల్లన్న సాగర్ నుంచి నిజాంసాగర్‌కు, నిజాంసాగర్ నుంచి నాగమడుగుకు నీరిచ్చి మెట్ట ప్రాంతాలకు ఎత్తిపోతల ద్వారా అందించడం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయి హాట్రిక్ సాధిస్తారని, జుక్కల్‌లో ఎన్నడూ జరగనంత అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సింధేను ఈ సారి 72 వేల మెజారిటీతో గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్‌సింధే, బిగాల గణేశ్‌గుప్తా, జాజాల సురేందర్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దఫెదార్ శోభ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్' ఉద్రిక్తం

- గాంధీభవన్ నుంచి ర్యాలీగా వెళ్లిన భట్టి బృందం
- ఖైరతాబాద్ వద్ద అడ్డుకున్న పోలీసులు


చలో రాజ్‌భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: అదానీ కంపెనీల షేర్ల వ్యవహారంలో అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో రాజ్‌భవన్'కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కొంతదూరం సజావుగానే సాగినా ఆ తర్వాత పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు అరగంట సేపు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులు అడ్డుపెట్టిన బారికేడ్లను దూకి రాజ్‌భవన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని నగరంలోని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సీఎల్పీ నేత భట్టి తదితరులను అరెస్టు చేసిన పోలీసులు ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

గాంధీభవన్ నుంచి ర్యాలీగా

'చలో రాజ్‌భవన్'కార్యక్రమంలో భాగంగా ఉదయం 11:30 గంటల సమయంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు గాంధీభవన్ నుంచి బయలుదేరారు. భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్‌జావేద్, రోహిత్ చౌదరి, పార్టీ నేతలు అంజన్ కుమార్‌యాదవ్, మల్లురవి, ఎంఆర్‌జీ.వినోద్‌రెడ్డి, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రోహిణ్‌రెడ్డి, మెట్టు సాయికుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డిలతో పాటు పలువురు డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు ఇందులో పాల్గొన్నారు. అసెంబ్లీ, రవీంద్ర భారతి, చింతల్ బస్తీల మీదుగా ఖైరతాబాద్‌కు చేరుకున్నారు. అక్కడివరకు అనుమతించిన పోలీసులు చౌరస్తాలో బారికేడ్లు అడ్డుపెట్టి రాజ్‌భవన్ వైపు వెళ్లకుండా కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు.

నేటి నుంచి భట్టి పాదయాత్ర

సాక్షి, హైదరాబాద్: 'హాథ్‌సే హాథ్‌జోడో యాత్ర'లో భాగంగా కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క గురువారం నుంచి పాదయాత్ర చేయనున్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అనుమతి మేరకు చేపడుతున్న ఈ యాత్రను ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం బజారహత్నూర మండలం పిప్రి గ్రామం వద్ద గురువారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ప్రారంభించనున్నారు. ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావెద్, రోహిత్‌చౌదరి కూడా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నారు. పిప్రి నుంచి ఇచ్చోడ వరకు తొలిరోజు యాత్ర చేయనున్న భట్టి ఇచ్చోడ సభలో ప్రసంగించనున్నారు.

అన్ని విషయాలు ప్రజలకు చెప్తా: భట్టి

రాష్ట్రంలో జరుగుతున్న అన్ని పరిణామాలను నేరుగా చెప్పేందుకే పాదయాత్ర పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నానని భట్టి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వల్ల ప్రజలకు ఏం లాభం జరుగుతుందని ఆశించి ఆనాడు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో ఆ ప్రయోజనాలేవీ నెరవేరలేదని వ్యాఖ్యానించారు.

నేడు మళ్లీ ఈడీ ముందుకు కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు మరోసారి విచారించనున్నారు. ఈ నెల 11న సుమారు 9 గంటల పాటు కవితను ప్రశ్నించిన ఈడీ.. 16వ తేదీన మళ్లీ హాజరుకావాలని నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఉదయం 11 గంటలకు కవిత ఈడీ కార్యాలయానికి వెళ్లనున్నారు. లిక్కర్ పాలసీ రూపకల్పన, సౌత్‌గ్రూపు పాత్ర, ఆప్ నేతలకు ముడుపులు తదితర అంశాలపై ప్రశ్నించడంతోపాటు బుచ్చిబాబు, అరుణ్‌పిళ్లైతో కలిపి విచారించాలని ఈడీ అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది.

అరుణ్ పిళ్లైతో కలిపి బుచ్చిబాబు విచారణ

ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు బుధవారం విచారించారు. ఆయనను ఒంటరిగా, అరుణ్ పిళ్లైతో కలిపి ప్రశ్నించినట్టు తెలిసింది. కేసులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరినీ విచారించారని.. సాక్ష్యాల ధ్వంసం, మద్యం విధాన రూపకల్పన, హోటళ్లలో భేటీ వంటి అంశాలపై లోతుగా ప్రశ్నించారని సమాచారం.

ఢిల్లీకి మంత్రులు, ఎమ్మెల్యేలు

సాక్షి హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంలో ఆరోపణలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈడీ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో ఆమెకు నైతిక మద్దతు అందించేందుకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్‌తోపాటు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు బుధవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలో న్యాయ నిపుణులతో చర్చించడంతోపాటు అక్కడి పరిణామాలను మంత్రులు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వివరించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పక్కా ప్రణాళికతో ఆత్మీయ సమ్మేళనాలు

- వచ్చే మూడు నెలల కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్యులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశం
- గ్రామాల్లో అభివృద్ధిపై కరపత్రాలతో ప్రచారం చేయాలని సూచన

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి వచ్చే మూడు నెలలపాటు విస్తృతంగా చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని.. ఇందు కోసం పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని పార్టీ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు సూచించారు. పార్టీ కార్యక్రమాల అమలు, సమన్వయం కోసం పార్టీ ఇటీవల ప్రకటించిన జిల్లా ఇన్‌చార్జి నేతలతో బుధవారం జూబ్లీహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ శ్రేణులతో సమన్వయానికి సంబంధించి పలు సూచనలు చేశారు. ''ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ బాధ్యతను ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ జిల్లా ఇన్‌చార్జులతో సమన్వయం చేసుకోవాలి. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల, డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్‌పర్సన్లు, ఇతర ముఖ్యులను కలుపుకొని వెళ్లాలి. ప్రతి 10 గ్రామాలను యూనిట్‌గా తీసుకొని సమ్మేళనాలను నిర్వహించాలి. పట్టణాల్లో మొత్తంగా కలిపి లేదా కొన్ని డివిజన్లను కలుపుకొని జరపాలి. మొత్తంగా ఆత్మీయ సమ్మేళనాలను రెండు నెలల్లోపు పూర్తి చేయాలి. ఈ దిశగా జిల్లా అధ్యక్షులు తమ పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణాలను కవర్ చేసేలా సమ్మేళనాల షెడ్యూల్ (కేలండర్)ను సిద్ధం చేసి వెంటనే పార్టీకి అందించాలి''అని మంత్రి కేటీఆర్ ఆదేశించారు.

గ్రామానికో కరపత్రం.. అభివృద్ధిపై ప్రచారం..

ప్రతీ ఆత్మీయ సమ్మేళనంలో భోజన ఏర్పాటు ఉండాలని కేటీఆర్ సూచించారు. ఆయా ఆత్మీయ సమ్మేళనాలకు వస్తున్న గ్రామాల్లో జరిగిన అభివృద్ధిపై వివరాలు సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలని.. వీలైతే గ్రామాల వారీగా ఒక్కో కరపత్రాన్ని తయారు చేయాలని ఆదేశించారు. ప్రతి ఆత్మీయ సమ్మేళనం జరిగే ప్రాంగణంలో అభివృద్ధి కార్యక్రమాలు తాలూకు ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. వీలైతే నియోజకవర్గ అభివృద్ధిపై ఆడియో, వీడియో ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ కార్యాలయాలు ప్రారంభం కాని జిల్లాల్లో ఆత్మీయ సమ్మేళనాల సమయంలో ఆ పని చేపట్టాలని, ఏప్రిల్‌లో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు.

ఏప్రిల్ 25న సర్వసభ్య సమావేశాలు..

బీఆర్ఎస్ ఆవిర్భావం నేపథ్యంలో ఏప్రిల్ 25న నియోజకవర్గాల వారీగా సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ ఆదేశించారు. పార్టీ జెండాల ఆవిష్కరణ అనంతరం నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజాప్రతినిధుల సభ జరపాలని సూచించారు.

వనపర్తివాసులతో నిరంజన్‌రెడ్డి ఆత్మీయ భేటీ

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వనపర్తి నియోజకవర్గ ప్రజలు, నగరంలో నివసిస్తున్న వనపర్తి వాసులతో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో పాల్గొన్నారు. దాదాపు 10 వేల మంది రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభిమానులను, శ్రేయాభిలాషుల కుటుంబాలను ఒకచోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఏపీ నీటి విడుదలను ఆపండి

- లేకుంటే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తొచ్చు
- కృష్ణా బోర్డుకు రాష్ట్రం ఫిర్యాదు..

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ నుంచి ఏపీ సాగిస్తున్న నీటి విడుదలను నిలుపుదల చేయాలని మరోసారి ఆదేశించాలని లేనిపక్షంలో తెలంగాణలో తీవ్ర శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కావచ్చని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా సాగర్ ప్రధాన కాల్వకు నీటి విడుదలను నిలుపుదల చేయాలని ఆదేశిస్తూ ఈ నెల 7న కృష్ణా బోర్డు రాసిన లేఖను ఏపీ ఉల్లంఘిస్తూ నీటి విడుదలను కొనసాగిస్తోందని కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసింది. సాగర్‌లో నీటిమట్టం 510 అడుగులకంటే దిగువకు పడిపోతే ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న 8 లక్షల ఎకరాల పంటలను కాపాడుకోవడం సాధ్యం కాదని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే హైదరాబాద్‌కు 270 ఎంజీడీల నీటి సరఫరాపై ప్రభావం పడుతుందని తెలిపింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ ఈ నెల 10న కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు.

ఏపీ అదనంగా 60 టీఎంసీలు వాడింది...

తెలంగాణ, ఏపీ ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ప్రస్తుత నీటి సంవత్సరంలో మార్చి 10 నాటికి మొత్తం 979.28 టీఎంసీల జలాల లభ్యత ఉండగా, ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో జరిపిన తాత్కాలిక కోటా ప్రకారం ఏపీకి 646.99 టీఎంసీలు, తమకు 333.09 టీఎంసీల వాటాలున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా బోర్డుకు రాసిన లేఖలో పేర్కొంది. అందులో ఏపీ 624.99 టీఎంసీలను (73 శాతం) వాడుకోగా ఆ రాష్ట్రానికి ఇక 21.60 టీఎంసీల కోటానే మిగిలి ఉందని పేర్కొంది. తాము 230.31 టీఎంసీలను వాడుకోగా మరో 102.77 టీఎంసీల వాటా మిగిలి ఉన్నట్లు తెలియజేసింది. కనీస నీటిమట్టానికి ఎగువన కేవలం 124.8 టీఎంసీలే మిగిలినట్లు ఆందోళన వ్యక్తం చేసింది. శ్రీశైలం, సాగర్‌లలో తమకు 95.46 టీఎంసీల వాటా మిగిలి ఉండగా వాటి నుంచి ఏపీ కోటాకి మించి 37.66 టీఎంసీలను వాడేసిందని ఆరోపించింది. ఏపీ మొత్తం 60.48 టీఎంసీల కృష్ణా జలాలను అదనంగా వినియోగించిందని ఫిర్యాదు చేసింది. కాగా, బుధవారం నాటికి సాగర్‌లో నీటిమట్టం 537 అడుగులకు తగ్గిపోయింది. నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాల్వ హెడ్ రెగ్యూలేటర్/విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదలను నిలుపుదల చేయాలని ఏపీని కృష్ణా బోర్డు మరోసారి కోరింది. తెలంగాణ రాసిన లేఖకు స్పందనగా బుధవారం ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీకి బోర్డు లేఖ రాసింది.

మా పార్టీ అయినా అంతే!

- మహిళా రిజర్వేషన్లు కల్పించకపోవడంపై ఎమ్మెల్సీ కవిత
- ప్రతీ పార్టీ, ప్రతీ ఎన్నికలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి
- చట్టం చేసినప్పుడే అన్ని పార్టీలు దారికొస్తాయి
- ఈ అంశంపై పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు పోరాడుతారని వెల్లడి
- దేశ మహిళలకు అన్యాయం చేయొద్దని బీజేపీకి విజ్ఞప్తి


ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్యే షకిల్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ''మా పార్టీ సహా ఏ పార్టీ రాజ్యాంగంలోనూ మహిళలకు 50శాతం గానీ, లేదా ఇన్ని సీట్లు అనే ప్రస్తావనగానీ లేకపోవటమే అసలు సమస్య..''అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. స్వచ్ఛందంగా మహిళలకు సీట్లు కేటాయించడమనేదీ ఏ పార్టీలోనూ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేస్తేనే అన్ని రాజకీయ పార్టీలు దారికొస్తాయని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై భారత్ జాగృతి నేతృత్వంతో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత సహా 13 పార్టీలకు చెందిన ఎంపీలు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రశ్నోత్తరాల్లో ''రాజకీయ పార్టీల రాజ్యాంగాల్లో మహిళలకు 50% లేదా ఇన్ని సీట్లు అనే ప్రస్తావన ఉందా? మీ పార్టీ రాజ్యాంగంలో ఆ విధంగా ఏమైనా పొందుపరిచారా?''అని అభిమన్యుసింగ్ అనే జర్నలిజం విద్యార్థి ప్రశ్నించగా.. ఎమ్మెల్సీ కవిత స్పందిస్తూ.. ''మా పార్టీ సహా ఏ పార్టీ రాజ్యాంగంలో కూడా మహిళలకు ఇన్ని సీట్లు కేటాయించాలని లేకపోవటమే అసలు సమస్య. కొన్ని రాజకీయ పార్టీలు మహిళలకు ఎక్కువ స్థానాలు కేటాయిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ప్రతీ పార్టీలోనూ, ఎన్నికల్లోనూ మహిళలకు తగినన్ని సీట్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల సంఘం కూడా ఆ దిశగా పూనుకుంటేనే మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది''అని పేర్కొన్నారు.

ఇది నా పూర్వజన్మ సుకృతం

రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్ లోపల, బయట ఒత్తిడి పెంచేందుకే ఎంపీలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. ప్రైవేట్ మెంబర్ బిల్లు డ్రాఫ్ట్‌తోపాటు పార్లమెంట్‌లో ఎంపీలు ఎలాంటి ప్రశ్నలు అడిగి మహిళా బిల్లును సాధించేందుకు ముందుకు వెళ్లొచ్చనే మెటీరియల్‌ను భారత్ జాగృతి తరఫున తయారు చేసి ఇచ్చామన్నారు. త్వరలో వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లాలన్నదానిపై ఇప్పటికే బీఆర్ఎస్ ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావులతో చర్చించామని కవిత తెలిపారు. త్వరలోనే బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించడంతోపాటు ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టడం, వాయిదా తీర్మానాలు, ప్రత్యేక ప్రస్తావనల ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై పోరాటాన్ని కొనసాగిస్తారని వెల్లడించారు.

అందరినీ కలుపుకొని వెళతాం

బీజేపీ గత రెండు ఎన్నికల్లోనూ మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని.. దేశ మహిళలను మోసం చేయవద్దని కవిత విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు వైఎస్సార్‌సీపీ, టీడీపీలను భారత్ జాగృతి చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ఆహ్వానించలేదని.. త్వరలో వారిని కూడా కలుపుకొని పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానించినా.. తమతో కలిసి పోరాటం చేయాలన్న ఉద్దేశం లేకపోవడంతో కాంగ్రెస్ ప్రతినిధులు ఎవరూ హాజరుకాలేదని పేర్కొన్నారు.


తుంగభద్ర నది నుంచి జలాలను సేకరిస్తున్న అర్చకులు

భద్రాద్రి రామయ్యకి పుష్కర పట్టాభిషేకం

పుణ్య నదీ, సముద్ర, పుష్కరిణీ జలాలతో ఈనెల 31న త్రేతాయుగం నాటి క్రతువు

- పన్నెండేళ్ల పండుగ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
- 12 రోజుల పాటు చతుర్వేద హవనాలు

భద్రాచలం: త్రేతాయుగంలో జగదభిరాముడికి మహా పట్టాభిషేకం రోజున నిర్వహించిన క్రతువును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈనెల 31న జరపనున్నారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి మరుసటి రోజున పట్టాభిషేకం, 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కర పట్టాభిషేకం నిర్వహిస్తుండటం ఆనవాయితీనే. అయితే ఈ ఏడాది జరిగే పుష్కర పట్టాభిషేకానికి గతంలో ఎన్నడూ లేని విధంగా దేశ నలుమూలల్లో ఉన్న సముద్రాలు, నదులు, పుష్కరిణుల నుంచి పవిత్ర జలాలను సేకరిస్తున్నారు. ఈ జలాలతో శ్రీ సీతాలక్ష్మణసమేతుడైన రామచంద్రస్వామికి మిథిలా స్టేడియంలోని వేదికపై పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించేందుకు వైదిక కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

త్రేతాయుగం నాటి క్రతువు..

త్రేతాయుగంలో శ్రీరాముడికి వశిష్ట మహర్షి పురోహితుడిగా వ్యవహరించి పట్టాభిషేక మహోత్సవం జరిపినట్లు రామాయణ ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది. అరణ్యవాసం పూర్తి చేసుకున్న తర్వాత జరిగిన ఈ మహా పట్టాభిషేకోత్సవానికి వానర వీరులు దేశంలోని నాలుగు దిక్కుల్లో ఉన్న నాలుగు సముద్రాల జలాలను, ఇతర వానరులు 500 నదీ జలాలను రాజ్యానికి తీసుకొచ్చినట్లు పండితులు చెబుతున్నారు. ఆ పుణ్య సముద్ర, నదీ జలాలతో నిర్వహించిన పట్టాభిషేకం వల్లనే నాడు రాజ్యం సుభిక్షంగా ఉండి 'రామరాజ్యం'వర్ధిల్లిందని, అదే ఒరవడిని కొనసాగిస్తూ ఈనెల 31న జరిగే పుష్కర పట్టాభిషేకాన్ని సముద్ర, నదీ, పుష్కరణి జలాలతో జరపాలని వైదిక కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిక్కుల్లో ఉన్న గంగా, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరథీ, తపతి, తుంగభద్ర, సింధూ, ప్రాణహిత నదీ జలాలను ఆలయ అర్చకులు సేకరిస్తున్నారు.


108 మంది రుత్విక్‌లతో చతుర్వేద హవనాలు..

భద్రాద్రి రామాలయంలో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 22న ప్రారంభమవుతాయి. ఈనెల 30న శ్రీరామనవమి, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం ఉంటాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని 12 రోజుల పాటు ద్వాదశ కుండాత్మక చతుర్వేద సహిత శ్రీరామయణ మహాక్రతువు, హవనాలు(హోమాలు) నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో రెండు యాగశాలలు నిర్మించారు. హోమాలు చేసేందుకు వివిధ క్షేత్రాల నుంచి 108 మంది రుత్విక్‌లను, వేద విద్వాంసులను ఆహ్వానిస్తున్నారు.

వశిష్ట మహర్షిని ఆదర్శంగా తీసుకుని..

వశిష్ట మహర్షి పురోహితుడిగా ఉండి శ్రీ సీతారాములకు నిర్వహించిన పట్టాభిషేకాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ ఏడాది పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించాలని వైదిక కమిటీ తీర్మానించింది. భక్తులు మెచ్చేలా పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తాం.

– కోటి శ్రీమన్నారాయణాచార్యులు, రామాలయ ఉప ప్రధాన అర్చకులు



దాతృత్వం కంటే యుద్ధం, సాహసం ఎక్కువ గొప్ప పనులు చేయగలిగాయి. నీ సానుభూతి కాదు, నీ ధైర్యం దురదృష్ట వంతుడిని కాపాడగలదు.

– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, మార్చి, 16

అందరి కళ్లూ సుప్రీం పైనే!

దేశంలో సంప్రదాయం ఒకటి ఉండవచ్చు. రాజ్యాంగమిచ్చే హక్కు వేరొకటి కావచ్చు. రెంటి మధ్య ఘర్షణలో త్రాసు ఎటు మొగ్గాలి? ధర్మసందేహమే! విభిన్న ప్రకృతులైన స్త్రీ పురుషుల సంపర్కం, వివాహమే భారతీయ సమాజ సంప్రదాయం, చట్టబద్ధం. సంప్రదాయం కాకపోగా, బ్రిటీషు కాలపు చట్టం కింద నిన్నటి దాకా శిక్షార్హమైన స్వలింగ సంపర్కం మారుతున్న కాలానుగుణంగా శిక్షార్హం కాదని కొన్నేళ్ళ క్రితమే తీర్పిచ్చిన మన సుప్రీమ్ కోర్ట్ ఇక స్వలింగ వివాహమూ చట్టబద్ధమేనని తేలుస్తుందా అన్నది చర్చనీయాంశం. భారతదేశంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధతను కేంద్రం తన అఫిడవిట్‌లో మార్చి 13న వ్యతిరేకించింది. 'ఎంతో ప్రభావశీలమైన' ఈ కేసులో తుది వాదనలు అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విని, నిర్ణయిస్తుందని సుప్రీమ్ తేల్చింది. ఈ కేసు, ఏప్రిల్18 నుంచి ప్రత్యక్షప్రసారంలో జరగనున్న వాదనలు భారత సమాజంలో కీలకం కానున్నాయి.

పౌరులందరూ సమానులేనన్నది రాజ్యాంగ మౌలిక సూత్రం. వ్యక్తిగత ఇష్టానిష్టాలు, అభిప్రాయాలు, అలవాట్లు, నమ్మకాలను బట్టి దాన్ని మార్చలేం. మార్చకూడదు. కాబట్టి స్వలింగ సంపర్కులకూ అందరితో సమానంగా హక్కులు రాజ్యాంగ విహితమే. అయితే, సంప్రదాయవాద భారతీయ సమాజంలో స్వలింగ వివాహం సున్నిత అంశం. అన్ని వర్గాల నుంచి అన్ని రకాల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోకుండా చటుక్కున తేల్చే వ్యవహారం కాదు. ఆధునిక అమెరికాలోనూ దీర్ఘ కాలం దీనిపై చర్చోపచర్చలు నడిచాయి. అక్కడ డజనుకు పైగా రాష్ట్రాల్లో ఈ పెళ్ళిళ్ళు నిషిద్ధం. 2008లో తొలిసారి అధ్యక్షపదవికి పోటీకి దిగినప్పుడు ఒబామా సైతం ఈ వివాహాల్ని వ్యతిరేకించారు. దీర్ఘపోరు తర్వాత 2015లో అమెరికా సుప్రీమ్ తీర్పుతో 50 రాష్ట్రాల్లోనూ పరిస్థితి మారింది.

నిజానికి, 2018 సెప్టెంబర్‌లో భారత సర్వోన్నత న్యాయస్థానం స్వలింగ సంపర్కం శిక్షార్హం కాదని తేల్చింది. పాతకాలపు చట్టాన్ని పక్కనపెట్టి ఇచ్చిన ఈ సంచలన తీర్పుపై అప్పట్లోనే గగ్గోలు పుట్టింది. సాంస్కృతిక విలువలకు తిలోదకాలిచ్చి, పాశ్చాత్య సంస్కృతిని అలవరుచుకుంటున్నామంటూ విమర్శలు రేగాయి. తీరా స్వలింగ సంపర్కం తప్పు కాదని కోర్టు చెప్పినా తమకు సామాజిక అంగీకారం లభించడం లేదనీ, తమపై దుర్విచక్షణ సాగుతూనే ఉందనీ లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్ల (ఎల్జీబీటీక్యూ) వర్గం ఫిర్యాదు చేస్తోంది. కథ చకచకా ముందుకు సాగి, స్వలింగ సంపర్కం నేరం కాదనే దశ నుంచి స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కోరడం దాకా ఇప్పుడు వచ్చింది. హోమో సెక్సువల్ పెళ్ళిళ్ళను చట్టబద్ధమైనవని గుర్తించాలని కోరుతూ, 2020లోనే ఢిల్లీ, కేరళ హైకోర్టుల్లో కొన్ని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. తర్వాత సుప్రీమ్‌కు పిటిషన్లు చేరాయి. కోర్టు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది.

కేంద్రం మార్చి 13న సుప్రీమ్‌లో తన అఫిడవిట్ దాఖలు చేస్తూ, స్వలింగ వివాహాల చట్టబద్ధతకు ససేమిరా అంది. సహజ ప్రకృతికి విరుద్ధంగా జరిపే లైంగిక చర్యలు శిక్షార్హమని భారత శిక్షాస్మృతిలోని 377వ సెక్షన్ మాట. ఆ సెక్షన్ కింద స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించరాదని అయిదేళ్ళ క్రితం తీర్పునిచ్చినంత మాత్రాన ఏకంగా స్వలింగ వివాహాన్ని వివిధ చట్టాల కింద తమ ప్రాథమిక హక్కని పిటిషనర్లు అనుకోరాదన్నది ప్రభుత్వ వాదన. భారతీయ కుటుంబ వ్యవస్థకూ, ఈ స్వలింగ వివాహాలకూ పొంతన కుదరదని సర్కారీ అఫిడవిట్. 2018లో కోర్ట్ వల్ల రాజ్యాంగ హక్కులు లభించాయి కానీ, స్వలింగ వివాహాల్ని చట్టప్రకారం గుర్తించనిదే వైద్యచికిత్సకు సమ్మతి పత్రంపై సంతకాలు, పింఛన్లు, దత్తత స్వీకారాలు, చివరకు స్వలింగ దంపతులకు క్లబ్ సభ్యత్వాల లాంటి ప్రాథమిక హక్కులూ కరవేనని ఎల్జీబీటీ ఉద్యమకారుల వేదన. ఈ పరిస్థితుల్లో మార్చి 18 నుంచి రాజ్యాంగ ధర్మాసనం జరిపే విచారణకై వేచిచూడాలి.

1989లో ప్రపంచంలోనే తొలిసారిగా డెన్మార్క్ స్వలింగ భాగస్వామ్యాన్ని అనుమతిస్తూ చట్టం చేసింది. ఇక బ్రిటన్‌లో ఈ పెళ్ళిళ్ళను అంగీకరించడానికి 32 ఏళ్ళు పట్టింది. అమెరికాలో పుష్కర కాలమైంది. ఫ్రాన్స్‌లో ఏకంగా 220 ఏళ్ళు పట్టింది. స్వలింగ సంపర్కం ఎన్నడూ నేరమే కాని తైవాన్‌లో సైతం మొన్న 2019లో కానీ వీటికి ప్రభుత్వ గుర్తింపు దక్కలేదు. భారత్ మరి గత అయిదేళ్ళలోనే ఈ సంప్రదాయ విరుద్ధ, సాహసోపేత నిర్ణయం తీసుకొనే దశకు చేరుకుందా? ఆధునిక సమాజంలో ఎల్జీబీటీ హక్కుల్ని కాదనలేం. కానీ ఇప్పటికీ పెళ్ళంటే ఒకే కులం, మతం, సంప్రదాయాలకే మొగ్గే మెజారిటీ జనమున్న దేశంలో ఈ మార్పు భావోద్వేగభరిత అంశం. ధార్మిక, అంగీకృత సామాజిక విలువలు ముడిపడ్డ ఈ అంశంలో తొందరపడితే పర్సనల్ చట్టాల తేనెతుట్టె కదులుతుంది. పర్యవసానాలు సామాజికంగా, రాజకీయంగా తప్పవు. మెజారిటీ మనోభీష్టానికి వ్యతిరేకంగా లైంగిక సంబంధాలు, పెళ్ళి, లైంగిక సమ్మతి వయసు, దత్తత, వారసత్వహక్కు లాంటివి పాలకులు ముట్టనిదీ అందుకే. కడకు ఇలాంటివి కోర్టు గుమ్మం తొక్కడమూ సహజమే.

ప్రస్తుతం ఆస్ట్రేలియా, జర్మనీ సహా 32 దేశాల్లో ఈ పెళ్ళిళ్ళు చట్టబద్ధమే. కానీ, లైంగిక మైనారిటీ దంపతుల పెంపకంలోని పిల్లల చదువు, ఆరోగ్యం, సామాజిక – ఆర్థిక పురోగతిపై వివిధ పరిశోధనలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. అది అటుంచినా, ఆ భావిపౌరులపై సమాజంలో పడే ముద్రకూ, ఎదురయ్యే సహాయ నిరాకరణకూ పరిష్కారమేంటి? స్వలింగ వివాహాలకు చట్టబద్ధత నిస్తే, అనేక చట్టాలను పునర్నిర్వచించక తప్పదు. అది మరో సవాలు. అన్నిటికీ సిద్ధమై, సమాజంలో అందరినీ సిద్ధం చేయకుండా తొందరపడితే కష్టం. అందుకే, ఇప్పుడు అందరి కళ్ళూ సుప్రీమ్ పైనే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.నవమి ప.1.15 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.1.51 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.20 నుండి 1.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.09 నుండి 10.56 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** రా.9.20 నుండి 10.48 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

'మూల' సంస్కృతికి రక్ష అంబేడ్కరిజం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ప్రకృతి నుంచి నేర్చుకొంటూ ఎక్కడికక్కడ మానవ సమూహాలు తమవైన సంస్కృతులను అభివృద్ధి చేసుకున్నాయి. సాధారణంగా ఆహారావసరాలు తీర్చగలిగే నదీలోయల్లో విభిన్న సాంస్కృతిక విశిష్టతలతో కూడిన నాగరికతలు రూపుదిద్దుకొంటాయి. మన గోదావరి, కృష్ణా వంటి నదీలోయల్లో విలసిల్లిన 'మూల సంస్కృతి' ఇలా అభివృద్ధి చెందినదే. ఇక్కడి మూలవాసులు ఏ ప్రకృతి వనరులను ఉపయోగించుకుని వ్యవసాయం, టెక్నాలజీలను అభివృద్ధి చేసుకున్నారో... అవే ప్రకృతి శక్తులను దేవుళ్లుగా పూజించారు దేశం బయటి నుంచి వచ్చిన ఆర్యులు. వారే ఇక్కడివారిపై 'రాక్షసులు' అని ముద్రవేశారు. ఆ వైదిక సంస్కృతీ వాహకులు ఇప్పటికీ మూలవాసుల సంస్కృతిని కబళించే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

భారతదేశం ఈనాడు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక ఘర్షణల్లో ఉంది. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించే శక్తుల విజృంభణే ఇందుకు కారణం. ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ వంటి మతతత్త్వ శక్తులు రాజ్యాంగేతర జీవనాన్ని కొనసాగిస్తూ... దానిని దేశం మీద రుద్దాలనే తాపత్రయంలో ఉన్నాయి. కారణం వారు స్వాతంత్ర్యానికి ముందు నుంచీ భారతదేశ సాంస్కృతిక, సాంకేతిక వ్యవస్థలకు విరోధులు కావడమే. నిజానికి భారతదేశ మూలాలు భౌతికవాద, హేతువాద, తాత్వికవాద భావజాలంలో ఉన్నాయి. భౌతిక వాదం, జీవశాస్త్రం, మానవ పరిణామవాదాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమన్వయించి హిందూ ప్రత్యామ్నాయ వాదాన్ని రూపొందించారు. అందులో తత్త్వ శాస్త్రానికి ప్రాధాన్యమిచ్చి ఆధ్యాత్మిక వాదం ఒక ఊహాత్మక వైయక్తిక భావ జాలం నుండి రూపొందిందేననీ, అందుకే వేలకొద్దీ దేవుళ్ళు భారత దేశంలో సృష్టించబడ్డారనీ ఆయన చెప్పారు.

ఎంఎన్ రాయ్ తన 'మెటీరియలిజం' గ్రంథంలో శాస్త్రీయ భావ జాల చారిత్రక దృక్పథం గురించి వివరిస్తూ... భారతదేశమే భౌతిక తత్త్వ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించిందని నొక్కి వక్కాణించారు. భారతీయ మూలవాసులు భౌతికవాద జీవులనీ; వారు నిప్పునూ, నీరునూ, గాలినీ, శూన్యాన్నీ జీవితానికి అన్వయించుకున్న మహోన్నత శాస్త్రవేత్తలనీ ఆయన శాస్త్రీయంగా నిరూపించారు. మరీ ముఖ్యంగా సింధు నాగరికతలో వచ్చిన నదీ నాగరికత సంస్కృతి నుండి నదులకు కాలువలు నిర్మించే బృహత్తరమైనటువంటి ఇంజనీరింగ్‌ను దళితులు కనిపెట్టారు. అంబేడ్కర్ దళిత బహుజనులు 'మొదటి ఇరిగేషన్ ఇంజనీర్లు' అని చెప్పారు. అందుకే భారతదేశ వ్యాప్తంగా సింధు, గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణా, కావేరి, సువర్ణ రేఖ, మహానది, పెన్నా, మహి, సబర్మతి, నర్మదా, తపతి వంటి ఎన్నో నదులకు ఆనకట్టలు కట్టి నదీ నాగరికతలనూ, వ్యవసాయ సంస్కృతినీ నిర్మించారు. ఈ నదులన్నింటినీ వైజ్ఞానిక దృష్టితో చూడకుండా దిగజార్చింది మత వ్యవస్థ.

భారతదేశంలో అత్యుత్తమమైన నదుల్లో గోదావరి చాలా గొప్పది. ఈ నది ప్రవహించే ప్రాంతం ఎక్కువగా గుట్టలు, పర్వతాలు, లోయలు; ఎగువ, దిగువ ప్రాంతాలు; చిన్న చిన్న గుట్టలతో కూడి ఉంది. ఈ నది అంచుల్లో నివసించే వాళ్ళు గిరిజనులు, దళితులే. వారే ఈ నదీ వ్యవస్థను ఇప్పటికీ రక్షిస్తున్నారు. ఈ గోదావరి సంస్కృతికీ, హిందూ మత సంస్కృతికి సంబంధమే లేదు. సుమారు 1600 సంవత్సరాలు గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో బౌద్ధ సంస్కృతి విలసిల్లింది. ఈ హిందూ వాద సంస్కృతి వచ్చిన తర్వాత ఈ నదీ నాగరికత మీద గొడ్డలి వేటు పడింది.

గోదావరి తర్వాత గొప్ప సంస్కృతులు సృష్టించింది కృష్ణా నదీ



పరివాహక ప్రాంతం. దీని పరీవాహక ప్రాతంలోనూ దళితులు, గిరిజనులే అధికంగా జీవిస్తున్నారు. వీరే ఇక్కడ విలసిల్లిన సంస్కృతికి సృష్టికర్తలు. హిందూ సంస్కృతికీ, ఇక్కడి సంస్కృతికి కూడా ఎటువంటి సంబంధం లేదు. హిందూ సామ్రాజ్యవాదం నదీ సంస్కృతులను ధ్వంసం చేయాలనే పెద్ద ప్రయత్నంలో ఉంది. అంబేడ్కర్ అందుకే నదుల అనుసంధానానికి సంబంధించి ఉద్గ్రంథాలను రచించారు. ఆదివాసీల నుండీ, దళితుల నుండీ ఆయుధాలు ఉన్న అగ్ర వర్ణాల వారే భూమిని కొల్లగొట్టారని నిరూపించారు. అంబేడ్కర్ దళితుల, ఆదివాసీల జీవన సంస్కృతులన్నీ నదీ పరీవాహక వ్యవసాయక అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. దీనికి తోడు సుదీర్ఘమైన సముద్ర తీర ప్రాంతంలో జీవిస్తున్న బెస్తలు, కొండల మీద గొర్రెలను మేపుకొని జీవిస్తున్న యాదవులు, తాటాకు కొట్టి గృహ నిర్మాణ సంస్కృతికి పునాదులు వేసిన గౌడలు, శెట్టి బలిజలు; వస్త్రాలు నేసి మానవ నాగరికతను కాపాడిన పద్మశాలీలు, దేవాంగులు, దళితులు... వీళ్లంతా కూడా నదీ నాగరికత సృష్టికర్తలే అని అంబేడ్కర్ చెప్పారు.

మైనార్టీలపైనా, దళితులపైనా... ద్వేషం, మాత్సర్యం, క్రోధం కలిగి ఉండటం ఆర్ఎస్ఎస్ భావజాలంలో ప్రధానమైన అంశం. నిజానికి మైనారిటీలుగా చెప్పబడుతున్న ముస్లింలు కానీ, క్రైస్తవులు కానీ పరాయివారు కారు. హిందూమత అస్పృశ్యతను వారు భరించలేక ఇస్లాం మతాన్నీ, క్రైస్తవ మతాన్నీ తీసుకున్నవారే. ఆర్యులు మధ్య ఆసియా నుండి వచ్చారని రొమిల్లా థాపర్, డీడీ కోశాంబి, ఆర్ఎస్ శర్మ, బిపిన్ చంద్ర వంటి వారు తేల్చారు. ఆర్యులు మూలవాసులకు శత్రువులని అంబేడ్కర్ చెప్పారు.

ఇకపోతే బౌద్ధం భారత ఉపఖండంలో జన్మించింది. సిక్కుమతం భారతదేశంలో పుట్టింది. ఆయా సందర్భాలలో చారిత్రకంగా వివిధ మతాలు స్వీకరించిన దళిత బహుజన మైనారిటీలను శత్రువులుగా చూడటం అశాస్త్రీయ విషయం. నిజానికి మూలవాసులైన దళితులు ఏవైతే ఉత్పత్తి సాధనాలుగా శాస్త్రీయ పరికరాలు కనిపెట్టారో వాటిని ఆర్యులు పూజించారు. అంటే మూలవాసుల కంటే వారు ఎంత వెనుకబడి ఉన్నారో మనకు అర్థం అవుతుంది. నాగరికతలో, మానవతలో, సౌజన్యంలో, ప్రేమలో, కరుణలో మూల వాసులది అద్వితీయమైన పాత్ర. ఆర్యులు మూలవాసుల సుగుణాలను అధ్యయనం చేయలేక పోయారు. మూలవాసులు ప్రకృతి వనరులను ఉపయోగించి నాగరికతా నిర్మాణం చేస్తే... ఆర్యులు ఆ ప్రకృతి శక్తులను దేవుళ్లుగా కొలిచారు. వేదాల్లో ఉన్న దేవుళ్ళు అందరూ ఇందుకు ఉదాహరణ.

మనిషి దేవుణ్ణి సృష్టించుకున్నాడు. కానీ ఆ దేవుడు మనిషి మీద ఆధిపత్యం వహిస్తున్నాడు. చివరకు మనిషిని బలిచ్చేవరకు ఈ మూఢ భక్తి పరిఢవిల్లింది. సాటి మనిషిలో ఉన్న జ్ఞానాన్నీ, హేతుభావాన్నీ నిరాకరించి దైవాధీన భావాన్ని అలవాటు చేసుకున్నాడు మానవుడు. తన తోటి మనిషిని ప్రేమించడం మానేసి, తను పూజించే దేవుణ్ణి కొనియాడమని బలవంతం చేశాడు. పూజించకపోతే వధించాడు. ఒక్కొక్క దేవుణ్ణి పూజించేవారు ఒక్కో సమూహంగా ఏర్పడ్డారు. ఇతర దేవుళ్లను పూజించే వారిని చంపడం ప్రారంభించారు. దీన్ని 'దుష్ట శిక్షణ' అన్నారు. వేదాల్లో తమ శత్రువులను చంపమని వాళ్ళ దేవతలను వేడుకొన్నారు ఆర్యులు. చివరకు దేవుళ్ళనే అవతార పురుషులుగా కిందకు దించారు. మూలవాసులకు 'రాక్షసులని' పేరు పెట్టి వారిని హతమార్చటానికే 'దశావతారాలు' ఆవిర్భవించాయని ప్రచారం చేశారు. వేద కాలం నుంచే ఈ హననం, హత్యాకాండ, అణచివేత, దౌర్జన్యం, విధ్వంసం ప్రారంభమయ్యాయి.

సంస్కృతిని, సంపదను మూలవాసులు సృష్టిస్తూ వెళ్లారు. ఆర్యుల వారసులు వీరిని వధిస్తూ, సంపదను ధ్వంసిస్తూ వెళ్లారు. ఈ చరిత్రను వక్రీకరించాలనే ఉద్దేశ్యంతోనే హిందూ మతవాద శక్తులు విద్యావ్యవస్థలో సిలబస్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 'ద ఆరెస్సెస్: రోడ్‌మ్యాప్స్ ఫర్ ద 21సెంచరీ' వంటి పుస్తకాలు విశ్వవిద్యాలయాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

ఇకపోతే ఎన్నో విలువైన గ్రంథాలను హిందూత్వ శక్తులు నిరాకరించాలనీ, ధ్వంసం చేయాలనీ ప్రయత్నిస్తున్నాయి. కమ్యూనిస్టు భావాలకూ, సోషలిస్టు భావాలకూ, అంబేడ్కరిస్టు భావాలకూ భిన్నంగా వ్యవహరిస్తున్నారు. మూలవాసుల జీవన సంస్కృతులకు మూలమైన నదీ నాగరికతా సాంస్కృతిక విప్లవానికీ, రాజ్యాంగ మూల సూత్రాలకూ భిన్నంగా ఆ శక్తులు జీవిస్తున్నాయి. రాస్తున్నాయి. ప్రచారం చేస్తున్నాయి. అందుకే ఇప్పుడు అంబేడ్కర్ ఆలోచనలతో పునరుజ్జీవన ఉద్యమం, ప్రత్యామ్నాయ భావజాల ఉద్యమం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. అంబేడ్కర్ మార్గమే ఈనాటి సామాజిక జీవన సూత్రం కావాలి.

వ్యాసకర్త దళిత ఉద్యమ నేత | 9849741695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

పురాతన మతం



యజీదీలు ముస్లింలు కాదు. కుర్దులు, అరబ్బులు కూడా కాదు. వాళ్ల పవిత్ర అంశీభూతాలు: అగ్ని/సూర్యుడు, వాయువు, జలం, భూమి, ఆకాశం. యజీదీలది ఒక ప్రాచీన మతం.

– అజ్జాద్ అల్‌సలేమ్, యజీది యాక్టివిస్టు

ఆయనదో లోకం



ఒక కూరగాయల వ్యాపారి ఎప్పుడూ శ్రద్ధగా చదువుకుంటూ ఉంటాడు (ఢిల్లీలో). ఆయన పేరు అశోక్‌కుమార్. ఆ కారణంగా నేను ఎప్పుడూ కూరగాయలు ఆయన దగ్గరే కొంటూ వుంటాను.

– మయాంక్ ఆస్టెన్ సూఫీ, రచయిత

అంతగా వేచివుండాలా?



పుణెలోని ఒక హాస్పిటల్లో చెస్ట్ ఫిజీషియన్ అపాయింట్‌మెంట్ నాకు 11:40కి ఇచ్చారు. డాక్టర్ రావడమే 12:20కి వచ్చాడు. అప్పటికి లిస్టులో నాది 15వ పేరు. మొత్తానికి నన్ను డాక్టర్ 1:30కి చూడగలిగాడు. హాస్పిటల్స్ ఇంతకంటే మెరుగ్గా పనిచేయలేవా?

– హరీష్ పూరి, ఆర్మీ వెటెరన్

చర్యలు ఉండవా?



ఢిల్లీ విమానాశ్రయంలో మొత్తం గందరగోళంగా ఉంది. ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ చెక్ కోసం మూడు గంటల పొడవైన క్యూలు. జనాలు నీరసిస్తున్నారు, పోట్లాడుతున్నారు. అసలు చాలా కౌంటర్లు పనిచేయడం లేదు. ఇప్పుడిదే సాధారణమా?

– తనుశ్రీ పాండే, జర్నలిస్ట్

కొత్త శ్వాస



డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్'కు ఆస్కార్ అనేది చివరి అడుగు కాదు. విజయపు ఒడి చివర ఆస్కార్ ఉందంతే. మా తమ్ముడు గెలవాలని నేను కోరుకున్నదైతే నిజం. సరే, ఇది శౌనక్ (సేన్) 'తొలి' ఆస్కార్ నామినేషన్‌గా గుర్తుండి పోతుంది. ఈ డాక్యుమెంటరీకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రేమాభివందనాలు. మీరే మా ఛాంపియన్లు.

– రాజా సేన్, స్క్రీన్ రైటర్

వ్యతిరేకించడం తప్పు కాదు!



నేను అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె.అడ్వాణీ– ఇద్దరినీ లండన్‌లో 'బీబీసీ' కోసం ఇంటర్వ్యూ చేశాను. అలాగే 1990ల్లో నగరంలో జరిపిన వారి కార్యక్రమాలకు కవరేజీ ఇచ్చాను. ఇరువురూ అప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని 'ప్రజాస్వామ్య వ్యతిరేకి' అని నిందించారు. ప్రతిపక్ష నాయకుల పనే అది, వ్యతిరేకించడం!

– పంకజ్ పచౌరీ, యాంకర్, రిపోర్టర్

చదువరి



ఒక పాత(2012) ప్రసంగంలో ఎల్.కె. అడ్వాణీ ఫిర్ సుబహ్ హోగీ(1958) చిత్రం ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ 'క్రైమ్ అండ్ పనిష్‌మెంట్' నవలకు రూపాంతరం అని చెబుతున్నారు. రామ్ అనే ఒక తెలివైన లా విద్యార్థి వడ్డీవ్యాపారి ఇనస్పెక్టెను బద్దలుగొట్టి దోచుకోవాలనుకోవడం ఇందులో కథ. దోస్తోవ్‌స్కీ అటుండనీ, రాజకీయ నాయకులు ఇలా క్లాసిక్స్‌ను ఉటంకించడమే అరుదు.

– ఇర్ఫాన్, ఆర్కైవిస్టు

ఇన్‌బాక్స్

మహామహోపాధ్యాయుడు

తిరుమల తిరుపతి దేవస్థానం వారి భగవద్గీత ప్రాజెక్టుకు 2002–2007 మధ్య స్పెషల్ ఆఫీసరుగా పనిచేసి, శ్రీమద్భగవద్గీతను నాలుగు సార్లు వైవిధ్యభరితమైన వ్యాఖ్యానాలతో ప్రచురించి ఘనతను పొందినవారు డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య. సంస్కృత పండితులుగా, సాహితీవేత్తగా గొప్ప పేరున్న 'మహామహోపాధ్యాయ' సముద్రాల లక్ష్మణయ్య సోమవారం రాత్రి ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

చిత్తూరు జిల్లా ఏర్పేడు వద్ద కాట్రకాయలగుంటలో 1939 జూన్ 8న ఆయన జన్మించారు. ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఏ సంస్కృతంలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. తర్వాత తిరుపతి ప్రాచ్య కళాశాలలో శిక్షణ పొందారు. తిరుపతిలోని తి.తి.దే.లో అధ్యాపకులుగా పని చేస్తూ 42 గ్రంథాలను రచించారు. టీటీడీ ప్రచురణలకు సంపాదకులుగా వ్యవహరించారు. ధర్మ ప్రచార పరిషత్‌కు కార్యదర్శిగా, పురాణ –ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా సేవలనందించారు. వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ పీఠం ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. అన్నమాచార్య సంకీర్తనామృతం, భర్తృహరి సుభాషితములు, శ్రీ మలయాళ స్వామి జీవిత చరిత్ర, దశకుమార చరితము, రఘువంశము, అమరవాణి, హిందూ ధర్మ పరిచయం, యోగవాశిష్టము వంటి గ్రంథాలు ప్రచురించారు.



డా॥ సముద్రాల లక్ష్మణయ్య

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలకు వ్యాఖ్యానం రాసి భవిష్యత్తరాలకు, ఇతర వ్యాఖ్యానకారులకు ఆదర్శవంతంగా నిలిచారు. అన్నమయ్య కీర్తనల్లో వేదాలు, రామాయణ, మహాభారతాలు, ఉపనిషత్తులు, పురాణాల్లోని అంశాలను ఆయన స్పృశించారు. వేదాంత ధోరణితో ఆయన రచించిన సంకీర్తనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారు 'వాచస్పతి' పురస్కారాన్ని, 'మహామహోపాధ్యాయ' బిరుదులనిచ్చి లక్ష్మణయ్యను సత్కరించారు. వీరి మృతి సాహితీ రంగానికీ, ఆధ్యాత్మిక రంగానికీ తీరని లోటు.

– డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య
అన్నమయ్య తితిదే ప్రాజెక్టులో వ్యాఖ్యానకారుడు

ఆధునిక శిబిచక్రవర్తి అమరజీవి

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

అమరజీవి పొట్టి శ్రీరాములు మదరాసులో మహాలక్ష్మమ్మ, పొట్టి గురవయ్య దంపతులకు 1901 మార్చి 16న జన్మించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయిన శ్రీరాములు తల్లి దగ్గరే నలుగురి సంతానంలో ఒకడిగా పెరిగారు. శ్రీరాములు జీవించిన 52 ఏళ్లలో తొలి 20 ఏళ్ళు మదరాసులో ఉన్నారు. శానిటరీ ఇంజనీరింగ్ చదువు కోసం, గ్రేట్ ఇండియా పెనిన్సులర్ రైల్వేలో అసిస్టెంట్ ప్లంబర్ ఉద్యోగం కారణంగా బొంబాయిలో పదేళ్ళు గడిపారు. ఇంజనీరింగు డిప్లమా చదువుతున్న కాలంలో పెళ్ళి జరగడమూ, ఉద్యోగం చేస్తున్న సమయంలో మొదట 1928లో తల్లి మహాలక్ష్మమ్మను, పిమ్మట కొంత కాలానికే తొలి సంతానాన్ని ఐదు రోజులకే కోల్పోవడం, తర్వాత 1929లో భార్య సీతమ్మను కోల్పోవడం తీరని విషాదాలు.

క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో గాంధీజీ పరిచయంతో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. మూడేళ్ళపాటు తలలో నాలుకగా సబర్మతీ ఆశ్రమంలో గడిపి గాంధీజీ ఆలోచనను, ఆచరణను తన రక్తంలో జీర్ణించుకున్నారు. 1933 ఆగస్టు 1 రాత్రి గాంధీజీతో పాటు బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించిన 34 మందిలో పొట్టి శ్రీరాములు ఒకరు. ఇది ఆయనకు తొలిసారి జైలు జీవితాన్ని పరిచయం చేసింది.

1934 జనవరి 15న పగలు రెండు గంటల సమయంలో బిహార్ ఉత్తర ప్రాంతంలో మూడు సార్లు తీవ్రంగా కంపించి భయంకరమైన శబ్దంతో భూకంపం ముంచెత్తింది. దీని ప్రభావం 77 వేల చదరపు మైళ్లకు వ్యాపించిందనీ, ఫలితంగా కోటి న్నరమంది తీవ్ర సమస్యలకు గురయ్యారనీ అంచనా. పది లక్షల ఇళ్ళు, 1,400 కిలోమీటర్ల రైలు మార్గం ధ్వంసమయ్యాయి. ఐదోనెల జైలు శిక్ష అనుభవిస్తున్న ఎంతో మందితోపాటు భూకంపం కారణంగా పొట్టి శ్రీరాములు విడుదలై గాంధీజీ సలహా మేరకు బిహార్ భూకంప బాధి



తుల కేంద్ర సహాయక సంఘంలో సభ్యుడుగా చేరారు. దీనికి నాయకత్వం వహిస్తున్నది బాబూ రాజేంద్రప్రసాద్. దాదాపు పది నెలలపాటు నిద్రాహారాలు మాని, సహాయ సేవా కార్యక్రమాలను పొట్టి శ్రీరాములు గొప్పగా నిర్వహించారు.

1937లో మేనమామ భార్య తండ్రి అయిన గోనుగుంట్ల నర్సయ్య మరణంతో శ్రీరాములు ప్రజా జీవితం తెలుగు ప్రాంతానికి తరలివచ్చింది. ప్రత్యేక రాష్ట్రం కోసం తనను తాను త్యాగం చేసుకున్న అమరజీవిగానే ఆయన తెలుసు. నిజానికి పొట్టి శ్రీరాములు ధీరోదాత్త ఆత్మత్యాగం కారణంగా తమిళులు, కన్నడిగులు, మలయాళీలు, గుజరాతీలు, మహారాష్ట్రీయులు... ఇలా ఎన్నో మాతృభాషలవారు ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పరచుకోగలిగారు.


1937 నుంచి తెలుగు ప్రాంతాలలో హరిజనోద్ధరణ, హరిజనుల దేవాలయ ప్రవేశం, ఖాదీ ప్రచారం, మద్యపానాన్ని మాన్పించడం, పాకీ పనివారి సమస్యలు తీర్చడం, భిక్షువుల సమస్య తీర్చడం, హిందూ ముస్లిం ఐక్యత కోసం పాటుపడడం – ఇలా ఎన్నోరకాలుగా శ్రీరాములు కృషి సాగింది. ఇంతే కాకుండా సరళంగా, మంచి వ్యక్తీకరణతో సాగే రచనలు చేయగల సామర్థ్యం కూడా గలిగినవాడు. గుడివాడ నుంచి ఎర్నేని సుబ్రహ్మణ్యం నడిపిన 'దరిద్ర నారాయణ' పత్రికలో పొట్టి శ్రీరాములు స్వతంత్ర రచనలతోపాటు ఆంగ్ల వ్యాసాలకు అనువాదాలు కూడా కనబడతాయి. గాంధీ స్మారక నిధి, ఇంకా కాంగ్రెస్ కమిటీ బాధ్యుడిగా భాష తెలియని ప్రభుత్వం కారణంగా ప్రజా కార్యక్రమాలు సరిగా నిర్వహింపబడటం లేదని గుర్తించి స్వభాషారాష్ట్రం కోసం ఆత్మార్పణకు పూనుకొన్న యోధుడు పొట్టి శ్రీరాములు. సి.రాజగోపాలాచారి వంటి కొందరు నాయకులు కొంత దూరదృష్టితో, ఉదారబుద్ధితో వ్యవహరించి ఉంటే తెలుగువారు పొట్టి శ్రీరాములును కోల్పోయి ఉండేవారు కాదు!

వ్యాసకర్త ఆకాశవాణి పూర్వ సంచాలకులు | మొబైల్: 94407 32392
(నేడు పొట్టి శ్రీరాములు జయంతి)

ధర్మ పక్షం

'నువ్వు లంకలో పుట్టి పెరిగినవాడివి. మా నాన్నకు సాక్షాత్తూ తమ్ముడివి. కొడుకు లాంటి నాకు ద్రోహం చేసేందుకు ఎలా సిద్ధమయ్యావు? నీ బుద్ధి శిథిలమైపోయి, నీకు నువ్వే హాని చేసుకొంటున్నావు. శత్రువు ఎంత గుణవంతుడైనా, స్వపక్షం ఎంత గుణహీనమైనదైనా, మనిషికెప్పుడూ స్వపక్షమే శ్రేయస్కరం. నిర్గుణః స్వజనః శ్రేయాన్, యః పరః పర ఏవ సః! (వాల్మీకి 6–87–15). ఇప్పుడు నిన్ను నెత్తినెక్కించుకొని నీ సహాయంతో నీ స్వపక్షాన్ని నాశనం చేసినవాడు, రేపు తన పని కాగానే నిన్నూ చంపేస్తాడు! తెలుసుకో!'

ఈ మాట అన్నవాడు ఇంద్రజిత్తు. అన్నది పినతండ్రి విభీషణుడితో! లక్ష్మణుడితో తను (తన ఆఖరి) యుద్ధానికి సిద్ధపడుతున్నప్పుడు! పైపైన చూస్తే అతడి వాదంలోనూ కొంత బలం కనిపిస్తుంది. ఇందుకు విభీషణుడు ఇలా బదులిచ్చాడు:



జ్యోతిర్మయం

'రాక్షసుడిగా పుట్టినా కూడా నాకు ధర్మం, సద్గుణం, సచ్ఛీలమే ప్రధానం. దారుణమైన అధర్మాన్ని నేను ఏ పక్షంలోనూ సహించలేను. నేను నా అన్నను వదలలేదు. ఆయనే నన్ను తిట్టి తరిమేశాడు. స్వపక్షం వాడు కదా అని ధర్మచ్యుతుడిని సమర్థించడం ముంజేతికి కాలనాగును కట్టుకోవడమే! నా అన్న మూడు తప్పులు చేస్తూ వచ్చాడు. అవి – పరులసొమ్ము హరించడం, పరస్త్రీలతో దుర్వర్తన, హితవు చెప్పే వారిని శత్రువులుగా శంకించి దూరం చేసుకోవడం! ఆయనకున్న ఎన్నో సద్గుణాల కొండలను ఈ దోషాలు కారుమబ్బుల్లా కప్పేశాయి. అవి ఆయన ఐశ్వర్యాన్నీ, జీవితాన్నీ నాశనం చేసి తీరతాయి. యమ పాశాన్ని మీ మెడలకు మీరే బిగించుకొన్నారు'.

స్వపక్షాన్ని సమర్థించ వలసిందే గానీ ధర్మాన్ని అతిక్రమించి కాదు. అధర్మాన్ని ఆశ్రయించిన పక్షానికి వినాశం తప్పదు. దానితో నువ్వూ నాశనం కాకూడదనుకొంటే, ధర్మం వైపు నిలబడమని విభీషణుడి మతం. విభీషణుడు రావణ పక్షాన ఉంటే, రావణుడు రక్షింపబడేవాడు కాదు, విభీషణుడికి కూడా వినాశమే మిగిలేది.

– ఎం. మారుతిశాస్త్రి

క్లుప్తంగా...

గట్టిగా మాట్లాడితే గొంతు నొక్కేయత్నం: శ్రీనివాస్‌గౌడ్

శంకర్‌పల్లిలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



శంకర్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే బీజేపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా నిలదీస్తే వారిపై కేసు పెట్టి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ని కేసులు పెట్టి వేధించినా తాము భయపడబోమని స్పష్టం చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలసి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దమ్ముంటే బీజేపీ నాయకులు అభివృద్ధిలో పోటీపడాలని సవాల్ విసిరారు. తెలంగాణ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. పొలాల వద్ద కరెంట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, పక్క రాష్ట్రం కర్ణాటకలో ఉచిత కరెంట్ ఇస్తున్నారా? అని శ్రీనివాస్‌గౌడ్ నిలదీశారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై త్వరలో నీరా సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం గౌడ కులస్తులకు స్థలాన్ని కేటాయించి ఈత, తాటి, ఖర్జూరా మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు 4.17 కోట్ల మొక్కలను నాటినట్లు గుర్తుచేశారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విలపించిన రాజయ్య



ధర్మసాగర్: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కొంతమంది నాయకులు ఆడవారిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. భావోద్వేగానికి గురైన ఆయన ఒక్కసారిగా బోరున విలపించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం గ్రామంలో ఫాదర్ కొలంబో 96వ జయంతి వేడుకల సందర్భంగా బుధవారం కొలంబో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తాను మహిళల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చానన్నారు. తన వయస్సు 63 సంవత్సరాలని, తనను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నారని కంటతడి పెట్టారు.

ఆమె గుండె కుడివైపు..



మారుబాయిని పరీక్షిస్తున్న వైద్యులు

కాగజ్‌నగర్ రూరల్: సాధారణంగా మనుషులకు గుండె ఎడమ వైపు ఉంటుంది. కానీ కుమురంభీం జిల్లాలో ఓ మహిళకు కుడివైపు భాగంలో గుండె ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలో బుధవారం సిర్పూర్ పేపర్ మిల్లుకు చెందిన స్పర్శ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మారుబాయి (55) అనే మహిళను పరీక్షించగా, ఆమె గుండె కుడివైపు ఉన్నట్లు గుర్తించారు. కుడివైపు గుండె ఉండడం అరుదైన విషయమని, ఈ పరిస్థితిని డెక్స్ట్రోకార్డియా అంటారని వైద్యుడు భానుప్రకాశ్ తెలిపారు. గుండె కుడివైపున్నా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

'విచారణ అనగానే మహిళా కోటా గుర్తుకొచ్చిందా?'

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవిత కావాలనే మహిళా రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ కేబినెట్, ఎమ్మెల్యే టికెట్లలో మహిళలకు 33% రిజర్వేషన్లు ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో ఈడీ విచారణకు పిలవగానే మహిళా రిజర్వేషన్లు గుర్తుకు వచ్చాయని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై కవితకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తొలుత తన తండ్రి, సీఎం కేసీఆర్‌తో మాట్లాడి కేబినెట్, 119 నియోజకవర్గా ల్లో 33% మంది మహిళలకు అవకాశం ఇస్తామని ప్రకటన చేయించాలని అర్వింద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లా డుతూ, సొంత రాష్ట్రంలో రిజర్వేషన్లు పట్టించుకో కుండా ఢిల్లీకి వచ్చి ధర్నాలు అంటూ.. కవిత జోకర్‌లా అయిపోయారని ఎద్దేవా చేశారు.

ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు గర్హనీయం

సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్‌పై కూడా గతంలో అర్వింద్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే కేసు అయిందని, ఆ కేసును కొట్టివేయాలని అతడు కోర్టుకు కూడా వెళ్లారని ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి గుర్తు చేశారు.

ఇంటర్ పరీక్షలు షురూ

ఇబ్బందుల్లేకుండా సజావుగా మొదలైన ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్
- తొలిరోజు సుమారు 95 శాతం మంది విద్యార్థుల హాజరు
- నేడు సెకండియర్ పరీక్షలు ప్రారంభం



కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలోని పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వచ్చి, పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన 9 మంది విద్యార్థులు



పినపాకలో విద్యార్థిని శైలజను కుర్చీలో కూర్చోబెట్టుకుని తీసుకెళ్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం తొలిరోజు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సజావుగా జరిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో ఈసారి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ నిబంధన కారణంగా పలు జిల్లాల్లో కొందరు విద్యార్థులు పరీక్షలు రాయలేకపోయారు. మొదటి రోజు 95 శాతానికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు. సుమారు 23 వేల మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు పరిశీలకులను పంపించినట్లు చెప్పారు. గురువారం నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

పరీక్షలకు హాజరైన వివరాలు..		
	మొత్తం విద్యార్థులు	: 5,05,625
	హాజరైనవారు	: 4,82,427
	గైర్హాజరైనవారు	: 23,198
	గైర్హాజరైనవారి శాతం	: 4.58%

వారు ఆత్మవిశ్వాసం చాటారు...
- విద్యుత్ షాక్‌కు గురై గతేడాది మణికట్టు వరకు చేతులు కోల్పోయినప్పటికీ ఆత్మవిశ్వాసం కోల్పోని నిర్మల్ జిల్లా కుంటాల మండలం గామాపూర్ తండా విద్యార్థి చౌహాన్ సాయికిరణ్ ఓ సహాయకుడి సాయంతో ఇంటర్ పరీక్ష రాశాడు.
- కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్ తండాకు చెందిన విజయ్‌సింగ్ అనే విద్యార్థికి గత వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. అయినా పరీక్ష రాసేందుకు హాజరయ్యాడు.
- గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఎడమ చేయిని కోల్పోయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం శివారు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఆదివాసీ గిరిజన విద్యార్థిని మడిమి మోతీ ఒంటి చేత్తోనే పరీక్ష రాసింది.
- గత కొన్ని రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న భద్రాద్రి జిల్లా పినపాక మండలం భట్టుపల్లి కేజీబీవీ విద్యార్థిని కోరం శైలజను కుటుంబ సభ్యులు పినపాకలోని పరీక్ష కేంద్రానికి తీసుకురాగా పోలీసులు ఆమెను కుర్చీపై కూర్చోబెట్టి పరీక్ష రాయించారు.
- భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని నలంద కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థి ఫిట్స్‌కు గురైనప్పటికీ సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొంది మళ్లీ పరీక్ష రాసేందుకు వచ్చాడు.
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ కళాశాలలో అభిలాష్ అనే విద్యార్థి అపెండిసైటిస్ బారినపడినప్పటికీ ఆపరేషన్ చేయించుకున్న 24 గంటల్లోనే పరీక్ష కేంద్రానికి వచ్చి పరీక్ష రాశాడు.
- నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలలో చదువుతున్న సాంపల్లి తండావాసి రాథోడ్ అక్షయకు గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకున్న ఆమెకు ఇన్విజిలేటర్లు ప్రత్యేకంగా గది బయట కుర్చీ ఏర్పాటు చేశారు. సహాయకుడి సాయంతో ఆమె పరీక్ష రాసింది.
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ఫస్టియర్ చదువుతున్న శిరీష అనే యువతి తన 3 నెలల పాప (దీక్షిత), తల్లితో కలసి మండల కేంద్రంలోని ఓ సెంటర్‌కు వచ్చింది. ఆమె పరీక్ష రాస్తున్నంతసేపు మనవరాలిని అమ్మమ్మ ఆడిస్తూ గడిపింది.

గూగుల్ మ్యాప్ మోసగించింది!

ఖమ్మం రూరల్ మండలం కొండాపురానికి చెందిన కొండా వినయ్ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ సీఈసీ చదువుతున్నాడు. ఎన్నెస్పీ క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాయాల్సిన అతను గూగుల్ మ్యాప్ ఆధారంగా బయలుదేరగా అది ఇంకో ప్రాంతానికి దారిచూపింది. దీంతో సరైన చిరునామా తెలుసుకొని ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకొనే సరికి 20 నిమిషాలు ఆలస్యం కావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలో 13 మంది, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు ఉదయం 9 గంటలు దాటాక పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో అధికారులు వారిని తిప్పిపంపారు.



● ప్రమాదాల వెం'బడి'..

సంగారెడ్డి జిల్లా జిన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో నిత్యం బడికి వెళ్తున్నారు. పాఠశాల జిన్నారానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎవరైనా వాహనంపై లిఫ్ట్ ఇస్తే సరే.. లేదంటే నడుచుకుంటూ బడికి వెళ్తారు. అలా నడుస్తూ వెళ్తున్న విద్యార్థులను చూసి జేసీబీ డ్రైవర్ ఎక్కించుకున్నాడో.. లేదా విద్యార్థులే లిఫ్ట్ అడిగి ఎక్కారో.. ఇలా ప్రమాదకరంగా బడికి వెళ్లారు. దాదాపు 15 మంది విద్యార్థుల్లో కొందరు ముందు భాగంలో డ్రైవర్ పక్కన.. మరి కొందరు వెనకాల ఇలా వెళ్లారు. పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. -జిన్నారం(పటాన్‌చెరు)

బీజేపీ, కేసీఆర్‌లు ఒక్కటే: రేవంత్‌రెడ్డి



నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్న రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి: అదానీ, ప్రధాని వేరుకాదని అదానే ప్రధాని, ప్రధానే అదానీ అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ క్యాంపులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ సమావేశాల కంటే ముందే హిండెన్‌బర్గ్ అనే సంస్థ ఆర్టికల్‌ను పబ్లిష్ చేసిందన్నారు. రూ.వేల కోట్ల బ్యాంక్ రుణాలు తీసుకొని ప్రపంచంలోనే 3వ స్థానంలో బిజినెస్ మ్యాగ్నెట్‌గా అదానీ ఎలా నిలిచారో హిండెన్‌బర్గ్ తేటతెల్లం చేసిందని తెలిపారు. గుజరాత్ నుంచి బయల్దేరిన నలుగురిలో ఇద్దరు అమ్మేవాళ్లు ఇద్దరు కొనేవాళ్లు ఉన్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. ఆనాటి ఈస్టిండియా సమానానే నేడు అదానీ రూపంలో మోదీ అమలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, కేసీఆర్‌లు ఒక్కటేనని, ఢిల్లీలో, రాష్ట్రంలో అరెస్టుల వెనుక బీఆర్ఎస్, బీజేపీల చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు.

చర్చకు కేటీఆర్ సిద్ధమా?

'ఈ పదేళ్లలో మీరేం చేశారో చెప్పడానికి చర్చకు రావాల'ని మంత్రి కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ సొంతూరు చింతమడకలో స్కూల్ నుంచి అన్ని ఏర్పాట్లు చేసిందీ, కేసీఆర్ నుంచి కేటీఆర్ వరకు ఓనమాలు దిద్దడానికి కారణమైంది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తే కేసీఆర్ సీఎం, కేటీఆర్ మంత్రి అయ్యాడన్నారు.

18న 'ఫ్యామిలీ' కోర్టులు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: పురానీ హవేలీలో ఏర్పాటు చేసిన కుటుంబ వివాదాల పరిష్కార సమీకృత కోర్టులను ఈ నెల 18న ఉదయం 11 గంటలకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ హాజరుకానున్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు ఇతర న్యాయమూర్తులు పాల్గొంటారు.

పాలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లో

- నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో పెంచిన అధికారులు
- పెరుగుతున్న జలాశయ నీటిమట్టం

సాక్షి ఎఫెక్ట్



కూసుమంచి: ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయానికి నాగార్జునసాగర్ డ్యాం నుండి ఇన్‌ఫ్లో పెంచారు. దీంతో బుధవారం నుండి 5,279 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, నీటిమట్టం 17 అడుగులకు చేరింది. జలాశయానికి సాగర్ జలాలు తక్కువగా వస్తుండడం, నీటిమట్టం పడిపోతుండటంతో చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతున్న విషయమై 'సాక్షి'ప్రధాన సంచికలో బుధవారం 'ఆఖరి ఆయకట్టు అంతేనా?'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు సాగర్ ఇన్‌ఫ్లోను 5వేల క్యూసెక్కులకు పైగా పెంచిన నేపథ్యంలో.. చివరి ఆయకట్టు వరకు సాగునీరు సక్రమంగా అందే అవకాశముంది. జలవనరులశాఖ ఈఎన్‌సీ నాగేందర్‌రావు కూడా జిల్లాలో పర్యటిస్తూ ఆయకట్టుకు నీటి సరఫరాను పరిశీలించారు.

భార్యను గొడ్డలితో నరికి.. పసికందును సంపులో పడేసి..

- దారుణంగా హత్య చేసిన భర్త
- రంగారెడ్డి జిల్లా అనాజ్‌పూర్‌లో ఘటన



ధన్‌రాజ్, లావణ్య దంపతులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: భార్యను గొడ్డలితో నరికి చంపి.. నెలన్నర పసికందును సంపులో ముంచి హత్య చేశాడో వ్యక్తి. రంగారెడ్డిజిల్లా అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం అనాజ్‌పూర్‌లో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏర్పుల ధన్‌రాజ్‌కు బండరావిరాల గ్రామానికి చెందిన కందికంటి నర్సింగ్‌రావు పెద్దకూతురు లావణ్య (28)తో 2018లో వివాహం జరిగింది. వీరికి రెండున్నరేళ్ల కూతురు ఆద్య, రెండు నెలల వయసున్న కుమారుడు క్రియాన్స్ ఉన్నాడు. కొంతకాలం నుంచి ధన్‌రాజ్ అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. ఇదే విషయంపై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. పలుమార్లు పెద్దమనుషులు పంచాయితీ పెట్టి సర్దిచెప్పారు. కాగా, డెలివరీ తర్వాత లావణ్య పుట్టింట్లోనే ఉండగా.. కుమారుడికి టీకా వేయించాలని చెప్పి ధనరాజ్ బుధవారం లావణ్యను అనాజ్‌పూర్‌కు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరగగా.. కోపోద్రిక్తుడైన ధన్‌రాజ్ భార్యను గొడ్డలితో నరికి చంపాడు. అలాగే పసికందును ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో ముంచి హత్య చేశాడు. తల్లిదండ్రులు గొడవ పడుతుండటాన్ని గమనించిన కూతురు ఏడుస్తూ బయటకు రావడంతో ఇరుగుపొరుగు వచ్చే సరికి ధన్‌రాజ్ అక్కడి నుంచి పరారయ్యాడు. వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి , సీఐ స్వామి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ కలహాలే హత్యలకు కారణమని, నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు.

మిర్చికి రికార్డుస్థాయి ధర

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా రూ. 23,099



కేసముద్రం/ఖమ్మం వ్యవసాయం/వరంగల్: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి బుధవారం రికార్డుస్థాయిలో క్వింటాకు గరిష్ట ధర రూ.23,099 పలికింది. మిర్చి సీజన్ ప్రారంభమయ్యాక అధికంగా ధర పలకడం ఇదే మొదటిసారని మార్కెట్ అధికారులు తెలిపారు. మంగళవారం గరిష్ట ధర రూ.22,151, కనిష్ట ధర రూ.18,687 పలకగా, బుధవారం మార్కెట్‌కు 1,450 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా, గరిష్ట ధర రూ.23,099, కనిష్ట ధర రూ.17,601 పలికింది.

ఖమ్మం మార్కెట్‌లో క్వింటా రూ.22,501

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం తేజా రకం మిర్చి ధర క్వింటాకు జెండాపాటలో రూ.22,501గా నమోదైంది. మంగళవారం క్వింటా ధర రూ.21,800గా ఉండగా.. మర్నాడు బుధవారం ఏకంగా రూ.701 పెరిగింది. జనవరిలో పంట సీజన్ మొదలైనప్పుడు మిర్చి క్వింటా రూ.21 వేలు పలకగా.. ఫిబ్రవరి ఆరంభానికి రూ.18 వేలకు పడిపోయింది. మళ్లీ ఇప్పుడు పెరుగుతుండడంతో రైతులు అమ్మకానికి ఆసక్తి చూపిస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో క్వింటా రూ.23 వేలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బేరువాడకు చెందిన బానోతు జైతురాం 48 బస్తాల తేజ మిర్చి తీసుకురాగా.. క్వింటాకు రూ.23వేలు రికార్డు ధర పలికిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ రాహుల్ తెలిపారు. ములుగు జిల్లా పంచోత్కులపల్లికి చెందిన రైతు పి.పాపారావు నాలుగు బస్తాల సింగిల్ పట్టి మిర్చి తీసుకురాగా.. క్వింటాకు రూ.63వేలు ధర పలికిందన్నారు.

అప్పు కట్టలేదంటూ ఇల్లు జప్తు

తండ్రి ఆస్పత్రిలో ఉన్నాడన్నా వినిపించుకోని బ్యాంకు సిబ్బంది
- తండ్రి తీసుకున్న అప్పుతో తనకు సంబంధం లేదన్న కుమారుడు
- సామాన్లు వదిలేసి వెనుదిరిగిన అధికారులు
- తర్వాత జప్తు వీడియో వైరల్ చేసిన డీసీసీబీ అధికారులు



మదనాపురంలో ఇంటి తలుపులు తొలగిస్తున్న బ్యాంకు సిబ్బంది



రైతు ఇంటి తలుపులు తొలగించాలని చెబుతున్న డీసీసీ జిల్లా అధికారి

గూడూరు: బ్యాంకులో తీసుకున్న పంట రుణం కట్టలేదని అధికారులు ఓ రైతు ఇల్లును జప్తు చేశారు. అయితే తన తండ్రి తీసుకున్న అప్పుతో తనకేం సంబంధమని ఆ రైతు ఎదురు తిరగడంతో బ్యాంకు సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా వెనుదిరిగారు. కానీ రెండురోజుల తర్వాత జప్తు వీడియోను బ్యాంక్ అధికారులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మదనాపురం గ్రామంలో బుధవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు వీరేందర్‌నాయక్ కథనం ప్రకారం.. గుగులోతు మోహన్‌నాయక్ తన పంట సాగు కోసం పట్టాదారు పాస్ పుస్తకాలు పెట్టి 2021లో గూడూరు డీసీసీబీలో రూ.4.50 లక్షల పంట రుణం తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. కరోనా సమయం నుంచి పంటల సాగు అంతంతమాత్రంగా ఉండడంతో మోహన్‌నాయక్ తీసుకున్న రుణం చెల్లించడంలో ఆలస్యమైంది. గత ఏడాది రూ.60 వేలు చెల్లించారు. మిగతా రుణాన్ని కూడా చెల్లించాలని బ్యాంకు అధికారులు అడగడంతో మోహన్‌నాయక్ కుమారుడు వీరేందర్‌నాయక్ తన తండ్రి ఆరోగ్యం ఇటీవల బాగాలేదని, ఆస్పత్రులకు తిరుగుతున్నామని, కాస్త టైం ఇస్తే చెల్లిస్తామని అభ్యర్థించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉన్న తండ్రిని చూసేందుకు వీరేందర్ ఈ నెల 10న బయలుదేరారు. అదే రోజు మధ్యాహ్నం పోలీసులతో డీసీసీ బ్యాంకు అధికారులు వీరేందర్‌నాయక్ ఇంటికి వచ్చారు. అతని భార్య, మాజీ సర్పంచ్ గుగులోతు స్వరూప.. తన భర్త లేరని, మామ మోహన్‌నాయక్ ఆస్పత్రిలో ఉండటంతో చూడడానికి వెళ్లారని చెప్పారు. అయితే అదంతా తమకు అనవసరమంటూ బ్యాంకు అధికారులు ఇంట్లోని టీవీ, ఇతర వస్తువులను ఒక చోటికి చేర్చారు. వద్దని ఆమె ఎంత వారించినా ఇంటి తలుపులు తొలగించి ఆటోలో వేశారు. ఈ విషయాన్ని స్వరూప.. భర్త వీరేందర్‌కు ఫోన్‌లో చెప్పడంతో హైదరాబాద్ వెళ్తున్న అతను మధ్యలోనుంచి వెనుదిరిగి వచ్చారు. అప్పు తీసుకుంది తాను కాదని, తన తండ్రి అని, ఆయన ఆరోగ్యం బాగోలేదని వీరేందర్ అధికారులకు చెప్పారు. దాంతో వారు వెళ్లిపోయారు. ఇంట్లో వస్తువులు పాడైన విషయాన్ని సాయంత్రం ఆయన గూడూరు ఎస్సై సతీష్‌గౌడ్‌కు వివరించారు.

వీడియో వైరల్ చేసిన బ్యాంక్ అధికారులు

అధికారులు జప్తు చేస్తున్న సమయంలో సిబ్బందితో వీడియో తీయించారు. ఆ వీడియోను అధికారులు మంగళవారం రాత్రినుంచి వైరల్ చేయడం ప్రారంభించారు. దీంతో కంగుతిన్న వీరేందర్ తన ఇల్లు జప్తు చేసి అవమానించారని, తనకు తండ్రి తీసుకున్న అప్పుతో సంబంధం లేదని, డీసీసీ బ్యాంకు అధికారులు చేసిన నష్టానికి పరిహారం చెల్లించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బ్యాంకు మేనేజర్ చైతన్యను వివరణ కోరగా, బ్యాంకు నిబంధనల ప్రకారం వెళ్లామని తెలిపారు.

క్లుప్తంగా...

తుర్కియేలో వరద బీభత్సం
14 మంది మృతి

అంకారా: ప్రకృతి ప్రకోపంతో తుర్కియే వణికిపోతోంది. వేలాది మందిని బలిగొన్న భీకర భూకంప ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న తుర్కియేలో వరదలు ముంచెత్తుతున్నాయి. అదియమాన్, సాన్లీయుర్ఫా ప్రావిన్స్‌లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరదల వల్ల ఇప్పటిదాకా 14 మంది మృతిచెందారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. కనీసం ఇద్దరు కనిపించకుండాపోయారని తెలియజేశాయి.

ఊపిరాడక ఐదుగురి మృతి
ఛత్తీస్‌గఢ్‌లో ఇటుక బట్టీ వద్ద విషాదం

రాయ్‌పూర్: ఇటుకలు కాల్చేందుకు రాజేసిన అగ్గి చివరకు వారి ప్రాణాలమీదకు తెచ్చింది. ఇటుక బట్టీ వద్ద ఐదుగురు కార్మికులు ఊపిరి ఆడక మరణించిన దుర్ఘటన ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాసముంద్ జిల్లాలోని గంధ్‌పూలీగఢ్ గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఒక ఇటుకల బట్టీ కర్మాగారం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి ఎండిన బురదమట్టి ఇటుకలను క్రమపద్ధతిలో పేర్చి వాటి అంతర్భాగంలో నిప్పుపెట్టి పైభాగంలో ఆరుగురు కార్మికులు నిద్రించారు. మిగతా కార్మికులు ఉదయం బట్టీ దగ్గరకు వచ్చేసరికి ఆ ఆరుగురు చలనం లేకుండా పడిఉన్నారు. హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించగా ఐదుగురు అంతకుముందే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. విషపు పొగ పీల్చడంతో ఊపిరాడక మరణించారని భావిస్తున్నారు.

ఆరు కేంద్ర సాయుధ బలగాల్లో 84,866 ఖాళీలు

న్యూఢిల్లీ: కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం, సరిహద్దు భద్రతా దళం వంటి ఆరు కేంద్ర సాయుధ బలగాల్లో మొత్తంగా 84,866 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మొత్తం బలగాల గరిష్ట నియామకాల పరిమితి 10,05,520 కాగా వాటిలో కేవలం 84,866 పోస్టులే భర్తీ చేయాల్సి ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ బుధవారం రాజ్యసభలో చెప్పారు. వీటిలో గత 5 నెలల్లో 31 వేలకు పైగా సిబ్బందిని భర్తీ చేశామన్నారు. 2023 జనవరి 1 నాటికి సీఆర్‌పీఎఫ్‌లో 29వేలకుపైగా, బీఎస్‌ఎఫ్‌లో 19వేలకుపైగా, సీఐఎస్‌ఎఫ్‌లో 19వేలకుపైగా, సశస్త్ర సీమాబల్‌లో 8వేలకు పైగా, ఐటీబీపీలో 4వేలకుపైగా, అస్సాం రైఫిల్స్‌లో 3,000 పైగా ఖాళీలున్నాయి. కేంద్ర బలగాల్లో 247 డాకర్లు, 2,354 నర్సులు, ఇతర వైద్య వృత్తుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నట్లు రాయ్ తెలిపారు.

మంచుకొండల్లో మహాముప్పు

జోషిమఠ్ కుంగుబాటుకు మించి పొంచి ఉన్న ప్రమాదాలు

భూకంపాలు, కొండచరియలు, అవలాంచ్‌ల ముప్పు

చైనా, భారత్ హిమాలయాల్లో సాగిస్తున్న నిర్మాణాలే కారణమంటున్న నిపుణులు

తక్షణం అడ్డుకట్ట వేయకుంటే పెనుముప్పే



అందమైన మంచుకొండలైన హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఉత్తరాఖండ్‌లో జోషిమఠ్ కుంగిపోవడం కంటే మించిన విధ్వంసాలు ఎదురుకానున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. హిమానీ నదాలు కరిగిపోవడం, సరస్సులు మాయమవడం, శాశ్వత మంచు ప్రాంతాలపై ప్రభావం పడడం వంటి విపత్తులు ఎదురు కానున్నాయి. దీనికి ముఖ్య కారణం వాతావరణంలో వస్తున్న మార్పులు కాదు, భారత్, చైనా పోటాపోటీగా హిమాలయాల్లో నిర్మాణాలు సాగించడం కూడా ప్రధాన కారణమవుతోంది..వాణిజ్య అవసరాలు, సైనిక అవసరాల కోసం రెండు దేశాలు హిమాలయాల్లో కొండల్ని తొలుస్తున్నారు. రైల్వే ట్రాకులు, రహదారులు నిర్మిస్తున్నారు. సొరంగాలను తవ్వుతున్నారు. హిమాలయాలకి రెండు వైపులా ఈ కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతూ ఉండడం పెను ప్రమాదానికి దారి తీయబోతోందన్న ఆందోళనలు ఎక్కువైపోతున్నాయి. 2020లో గల్వాన్‌లో ఘర్షణల తర్వాత ఇరు దేశాలు సైనిక అవసరాల కోసం హిమాలయాల వెంబడి వంతెనలు, ఔట్‌పోస్టులు, హెలిప్యాడ్‌లు విస్తృతంగా నిర్మిస్తున్నాయి. చైనా ఏకంగా చిన్న చిన్న నగరాలనే కట్టేస్తున్నట్టు ఉపగ్రహఛాయాచిత్రాల ద్వారా వెల్లడవుతోంది.

ఎల్‌ఏసీ వెంట అధిక ముప్పు..

భారత్, చైనా మధ్య 3,500 కి.మీ. పొడవునున్న వాస్తవాధీన రేఖ వెంబడి ముప్పు అధికంగా ఉందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఎన్‌హెచ్–7 జాతీయ రహదారిపై ప్రతీ కిలోమీటర్‌కి ఒక కొండచరియ విరిగిపడి రహదారులు మూతపడడం సర్వసాధారణంగా మారింది. ''భారత్‌లోని హిమాలయాల్లో ఉత్తరాఖండ్‌లోనూ, అటు చైనా వైపు హిమాలయాల్లోనూ అత్యధిక ముప్పు పొంచి ఉంది. మౌలిక సదుపాయాల పేరిట చేపడుతున్న కార్యక్రమాలు శాశ్వత మంచు పర్వతాలను సైతం కుదేలు చేసే రోజులొచ్చేస్తున్నాయి. అవలాంచ్‌లు (హిమ ఉత్పాతం), కొండచరియలు విరిగిపడడం, భూకంపాలు అత్యంత సాధారణంగా మారతాయి''అని క్రయోస్పియర్ జర్నల్ ఒక నివేదికలో వెల్లడించింది.

చైనా నిర్మాణాలు

టిబెట్ పీఠభూమిలో

- 9,400 కి.మీ. మేరకు రోడ్డు నిర్మాణం. ➤ 580 కి.మీ. పొడవున రైల్వేలు చెంగ్డూ నుంచి లాసా వరకు రైల్వే నిర్మాణం
- సముద్రానికి 13 వేల అడుగుల ఎత్తులో పూర్తిగా మంచుతో నిండి ఉన్న 21 పర్వతాల మీదుగా 14 అతి పెద్ద నదుల్ని దాటుకుంటూ సియాచిన్–టిబెట్ రైల్వే లైన్ నిర్మాణం
- 2,600 కి.మీ. పొడవున విద్యుత్ లైన్‌లు ➤ వేలాది సంఖ్యలో భవనాలు
- అస్సాంలో బ్రహ్మపుత్ర నది నుంచి ఉత్తర చైనాకు నీటిని మళ్లించడానికి డ్యామ్‌లు
- 2050 నాటికి మంచుకొండల్లో 38.14%రోడ్లు, 38.76% రైల్వేలు
- 39.41% విద్యుత్ లైన్లు, 20.94% భవనాలే కనిపిస్తాయి.
- సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం 624 భవనాల నిర్మాణం



చైనాలో ఓ ప్రాజెక్ట్ వద్ద..

నేపాల్ వైపు

- చైనా బెల్ట్ అండ్ ఓడ్ ఇనీషియేటివ్ కింద రాసువగాఢి హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టు ➤ ఉద్యాన వనాలు
- హైడ్రోపవర్ ప్రాజెక్టులు ➤ 240 కోట్ల డాలర్ల విలు వైన ప్రాజెక్టులు
- పాంగాంగ్ సరస్సుపై సైనిక అవసరాల కోసం వంతెన

ఎలాంటి ప్రభావం చూపిస్తుంది ?

అరుణాచల్ ప్రదేశ్, సిక్కిమ్ రాష్ట్రాల్లో వర్షాకాలాలు బీభత్సంగా మారనున్నాయి.

సింధు నదికి సమీపంలో చిలాస్‌లో డ్యామ్‌లు కట్టడంతో ఒక నెలలో దాని పరిసర ప్రాంతంలో 300 సార్లు భూకంపం సంభవించింది. సరిగ్గా అలాంటి ముప్పే హిమాలయాల్లో కూడా జరిగే అవకాశం ఉంది.

అవలాంచ్‌లు ముంచెత్తి సరస్సులు విస్ఫోటనం చెందుతాయి

కొండచరియలు విరిగిపడి నిర్మాణంలో ఉన్నవన్నీ కూడా ధ్వంసమయ్యే ప్రమాదముంది. టిబెట్‌లోని బొమి ప్రాంతంలో దశాబ్దాల క్రితం కట్టిన వంతెనలు, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ కొండచరియలు విరిగిపడి ధ్వంసమయ్యాయి.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవన్నీ పూర్తవకుండానే భూకంపాలు, కొండచరియలు, అలవాంచ్‌లతో అవన్నీ ధ్వంసమయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయని, మరింత ప్రమాదంలోకి హిమాలయాలు వెళ్లిపోయాయని ఓల్లో యూనివర్సిటీ ప్రొఫెసర్ అండ్రూస్ కాబ్ అంచనా వేస్తున్నారు.

భారత్‌లో 23 హిమానీనదాలతో అత్యంత ప్రమాదముందని నిపుణులు గుర్తించారు.

భారత్‌లో కొండచరియలు విరిగిపడే ప్రమాదాల్లో 85% హిమాలయాల్లోనే సంభవిస్తున్నాయి. కొండచరియలు ముప్పు కలిగిన టాప్–5 దేశాల్లో చైనా, భారత్‌లు ఉన్నాయి.

హిమాలయాల్లో ఉన్న హిమానీ నదాలు 2035 నాటికి మాయమైపోయే ఛాన్స్ ఉంది.

భారత్ నిర్మాణాలు

- హిమాలయాల్లో 30 అతి పెద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టులు
- అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిమ్‌లలో వాయువేగంతో సాగుతున్న హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణాలు
- 900 కి.మీ. పొడవునా గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బదిరీనాథ్‌లను కలిపేలా చార్‌ధామ్ ప్రాజెక్టు
- 283 కి.మీ. పొడవునా నిమ్ము–పదమ్–దర్చా (ఎన్‌పీడీ)హైవే



హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్

- చైనాతో వివాదంలో ఉన్న 3,500 కి.మీ. సరిహద్దుల పొడవునా రోడ్లు, టన్నెల్స్, వంతెనలు, ఎయిర్‌ఫీల్డ్స్, హెలిప్యాడ్స్ నిర్మాణం
- చైనాతో వ్యూహాత్మకంగా ప్రాధాన్యం కలిగిన 73 ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం

- సాక్షి, నేషనల్ డెస్క్

34 మంది జలసమాధి
మడగాస్కర్ తీర ప్రాంతంలో విషాదం

అంటనానారివో(మడగాస్కర్): బతుకుదెరువు కోసం సముద్రమార్గంలో విదేశానికి వలసవెళ్తున్న శరణార్థులు ప్రమాదవశాత్తు జలసమాధి అయ్యారు. శనివారం రాత్రి వాయవ్య మడగాస్కర్ తీరం దగ్గర్లోని హిందూ సముద్రజలాల్లో జరిగిన ఈ దుర్ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మడగాస్కర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్రాన్స్ అధీనంలోని మయోటీ ద్వీపానికి చేరుకునేందుకు మడగాస్కర్ దేశంలోని అంబిలోబే, టమతమే, మజుంగా ప్రాంతాలకు చెందిన 58 మంది శరణార్థులు ఒక పడవలో బయల్దేరారు. మార్గమధ్యంలో నోసీ బే అనే ద్వీపం సమీపంలో హిందూ సముద్రజలాల్లో పడవ మునిగింది. ఈ ప్రమాదంలో నీట మునిగిన 34 మంది మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. 24 మందిని అక్కడి మత్స్యకారులు కాపాడారు. మయోటీ అనేది పేదరికం కనిపించే చిన్న ద్వీపాల సముదాయం. అంతకుమించిన నిరుపేదరికంతో మగ్గిపోతున్న మడగాస్కర్‌లో కంటే మయోటీలో జీవనం కాస్త మెరుగ్గా ఉంటుందని శరణార్థులు అక్కడికి వలసపోతుంటారని అధికారులు చెప్పారు.

మూడేళ్లలో రూ.2,430 కోట్లు


న్యూఢిల్లీ: గత మూడేళ్లకాలంలో భారతీయ ఎన్‌జీవో సంస్థలు విదేశాల నుంచి విరాళాల రూపంలో రూ.2,430.80 కోట్లను స్వీకరించాయని కేంద్రం వెల్లడించింది. బుధవారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ వివరాలు చెప్పారు. 2019–20లో రూ.727.1 కోట్లు, 2020–21కాలంలో రూ.798.1 కోట్లు, 2021–22కాలంలో రూ.905.5 కోట్ల విరాళాలు పొందాయని పేర్కొన్నారు. ఈ నెల పదోతేదీ నాటికి దేశవ్యాప్తంగా 16,383 ఎన్‌జీవో సంస్థలు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని తెలిపారు. వీటిలో దాదాపు 15వేల సంస్థలు 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తమ వార్షిక నివేదికలను సమర్పించాయి. కొన్ని సంస్థల నిధుల దుర్వినియోగం/నిధుల మళ్లింపుపై ఫిర్యాదుల నేపథ్యంలో చర్యల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.



మన సూర్యుడికంటే 30 రెట్లు పెద్దదైన నక్షత్రం ఇది. పేరు డబ్ల్యూఆర్ 124. మరికొన్ని లక్షల ఏళ్లలో ఇది బద్దలుకాబోతోంది. జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ తీసిన తాజా చిత్రమిది.

అదానీపై విచారణ డిమాండ్‌తో... ఈడీ ఆఫీసుకు విపక్షాల ర్యాలీ

పాల్గొన్న 18 పార్టీల ఎంపీలు ● మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు



పార్లమెంట్ నుంచి ఈడీ ఆఫీస్‌కు ర్యాలీగా వస్తున్న విపక్ష పార్టీల ఎంపీలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు అవకతవకలపై ఈడీతో లోతుగా దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తూ విపక్ష పార్టీలు సమైక్యంగా కదం తొక్కాయి. ఈ ఉదంతంపై ఈడీకి ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు 18 విపక్ష పార్టీల ఎంపీలు బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో పార్లమెంటు భవనం నుంచి ఈడీ ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈడీ కార్యాలయానికి వెళ్తున్న ఎంపీలను మార్గమధ్యంలోనే విజయ్ చౌక్ సమీపంలో పోలీసులు అడ్డుకుని ముందుకు వెళ్లకుండా నిలువరించారు. బారికేడ్లతో రోడ్లను మూసేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ర్యాలీని అనుమతించబోమని చెప్పారు. దీనిపై నేతలంతా మండిపడ్డారు. అదానీపై విచారణ కోరుతూ ఈడీకి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే మోదీ సర్కారు నిరంకుశంగా అడ్డుకుందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. దాదాపు 200 మంది ఎంపీల శాంతియుత ర్యాలీని అమానుషంగా అడ్డుకున్నారంటూ దుయ్యబట్టారు. అనంతరం ఎంపీలంతా పార్లమెంటు ప్రాంగణానికి వెనుదిరిగారు. ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలు పాల్గొనకపోవడం విశేషం. అంతకుముందు తృణమూల్ విడిగా ఎల్పీజీ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం ముందు ధర్నా చేసింది.

పార్లమెంట్‌లో ఆగని రగడ

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాల్సిందే ● లోక్‌సభ, రాజ్యసభల్లో బీజేపీ డిమాండ్ ● అదానీపై జేపీసీకి విపక్షాల పట్టు ● ఉభయ సభలు మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో దుమారం కొనసాగుతూనే ఉంది. అధికార, విపక్ష సభ్యుల నినాదాలు, కేకలతో ఉభయసభలు వరుసగా మూడో రోజు బుధవారం సైతం స్తంభించాయి. రాహుల్ క్షమాపణకు బీజేపీ సభ్యులు, అదానీ వ్యవహారంపై జేపీసీకి విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. దాంతో లోక్‌సభ, రాజ్యసభ మళ్లీ వాయిదా పడ్డాయి.

ప్రజాస్వామ్యాన్ని అవమానించారు

బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. అదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) డిమాండ్‌తో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలకు దిగారు. రాహుల్ క్షమాపణ చెప్పాలంటూ బీజేపీ ఎంపీలు సైతం నినాదాలు ప్రారంభించారు. వెల్‌లోంచి వెళ్లి సభ జరగనివ్వాలని స్పీకర్ ఓం బిర్లా కోరారు. కార్యకలాపాలకు అడ్డు తగులుతున్న విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను మంత్రి పీయూష్ గోయల్ కోరారు. పార్లమెంట్ సభ్యుడైన ఓ వ్యక్తి విదేశాలకు వెళ్లి ఇదే పార్లమెంట్‌ను దారుణంగా కించపర్చారని రాహుల్ గాంధీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది చాలా తీవ్రమైన అంశమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సభ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా పడింది. వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్ష ఎంపీలు నినాదాలు కొనసాగించారు. సభ సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సభ్యులందరిపైనా ఉందని సభాపతి స్థానంలో ఉన్న భర్తృహరి మెహతాబ్ చెప్పారు. సభలో ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలకు తప్ప ప్లకార్డులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. గందరగోళం కొనసాగుతుండగానే రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ ఇంటర్–సర్వీసెస్(కమాండ్, కంట్రోల్, డిసిప్లిన్) బిల్లు–2023ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ సభకు వచ్చి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ మన దేశాన్ని అవమానించారంటూ ప్రవాస భారతీయుల నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయని వెల్లడించారు. భారత్ సార్వభౌమత్వ దేశమని, మన దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలంటూ ఇతర దేశాలను రాహుల్ కోరడం ఏమిటని ప్రహ్లాద్ జోషీ ఆక్షేపించారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది.



రాజ్యసభలోనూ గందరగోళం

లోక్‌సభలో కనిపించిన దృశ్యాలే రాజ్యసభలోనూ పునరావృతమయ్యాయి. లండన్‌లో చేసిన వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు ఎదురుదాడికి దిగారు. అరుపులు కేకలతో గందరగోళం నెలకొనడంతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమైన తర్వాత ఇరుపక్షాల నడుమ వాగ్వాదం కొనసాగింది. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించేందుకు ప్రయత్నించగా, బీజేపీ సభ్యులు అడ్డుకున్నారు. రాహుల్ క్షమాపణ చెప్పిన తర్వాతే కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడాలంటూ నినాదాలు చేశారు. సభ్యులంతా శాంతించాలని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పదేపదే కోరినా ఫలితం లేకుండా పోయింది. సభ ముందుకు సాగే అవకాశాలు లేక పోవడంతో మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రాహుల్ క్షమాపణ ప్రసక్తే లేదు: ఖర్గే

రాహుల్ వ్యాఖ్యలపై ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ నేతలపై గతంలో ప్రధాని మోదీ విదేశాల్లో చేసిన వ్యాఖ్యలను ఎత్తిచూపుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎదురుదాడికి దిగారు. ''భారత్‌లో పుట్టినందుకు గతంలో మీరంతా సిగ్గుతో తలదించుకునేవారు. అదో పాపంగా భావించారు. జీవిస్తున్నారు అని ప్రధాని హోదాలో చైనాలో మోదీ అన్నారు. రాహుల్ మాటల్లో తప్పేంలేదు. క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదు'' అని స్పష్టంచేశారు. ' భావ ప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని అణగదొక్కుతున్నారు. నిజం మాట్లాడితే జైలు పంపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని చంపడం కాదా?'' అన్నారు.

లాలూ కుటుంబానికి ఊరట
అందరికీ బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు




న్యూఢిల్లీ: భూమికి ఉద్యోగం కుంభకోణంలో నిందితులుగా ఉన్న నాటి రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి, కూతుళ్లు మీసా భారతి తదితరులకు కోర్టు నుంచి ఉపశమనం లభించింది. ఇటీవల మూత్రపిండమార్పిడి శస్త్రచికిత్స తర్వాత కోలుకుంటున్న లాలూ బుధవారం ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టుల ప్రాంగణానికి చేరుకుని జడ్జి ఎదుట హాజరయ్యారు. ఇతర నిందితులూ వెంట వచ్చారు. లాలూ, రబ్రీ దేవి, మీసా భారతి తదితరులకు ప్రతి ఒక్కరికీ చెరో రూ.50,000 విలువైన వ్యక్తిగత బాండు, అంతే మొత్తానికి మరో పూచీకత్తు సమర్పించాలని సూచిస్తూ అందరికీ బెయిల్ మంజూరుచేస్తూ ప్రత్యేక న్యాయమూర్తి గీతాంజలి గోయల్ ఉత్తర్వులు జారీచేశారు. బెయిల్ కోసం నిందితులు గతంలో పెట్టుకున్న అభ్యర్థనలను కోర్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) తోసిపుచ్చలేదు. కేసు తదుపరి విచారణను కోర్టు మార్చి 29వ తేదీకి వాయిదావేసింది. భారతీయ రైల్వే నియామకాల్లో పేర్కొన్న నిబంధనావళిని తొక్కిపెట్టి తమకు తక్కువ ధరకు భూములు దక్కేలా చేసిన ఉద్యోగార్థులకు వేర్వేరు జోన్లలో తక్కువ స్థాయి ఉద్యోగాలు ఇప్పించారని లాలూ కుటుంబంపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో కేసు నమోదుచేసి సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్న విషయం తెల్సిందే.

ఇమ్రాన్‌కు స్వల్ప ఉపశమనం

లాహోర్: ప్రభుత్వ కానుకల అక్రమ విక్రయం కేసులో కోర్టుకు గైర్హాజరై అరెస్ట్‌ను ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు లాహోర్ హైకోర్టు ఉపశమనం కల్పించింది. గురువారం దాకా ఆయనను అరెస్ట్ చేయొద్దని పోలీసులను ఆదేశించింది. ఇమ్రాన్‌ను అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులతో, అడ్డుకునేందుకు వచ్చిన తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలతో ఇమ్రాన్ నివాసప్రాంతం ఉద్రిక్తంగా మారడం తెలిసిందే. కోర్టు ఉత్తర్వులతో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అయితే శుక్రవారం అరెస్ట్‌ను అడ్డుకునేందుకు ఇంకా పెద్ద సంఖ్యలో మద్దతుదారులు వస్తుండటంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది.

4 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాల విడుదలకు చెక్
అణువిద్యుత్ రంగంతో ఇది సాధ్యమైంది: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 4 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాల విడుదలకు అణువిద్యుత్ రంగం అడ్డుకట్టవేస్తోందని కేంద్రం పేర్కొంది. విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలపై ఆధారపడకుండా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని లోక్‌సభలో అణుఇంధన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో కేవలం మూడు శాతమే అణువిద్యుత్‌కేంద్రాల నుంచి వస్తున్నప్పటికీ ఆ కేంద్రాలు దేశ ఇంధన భద్రతలో ఆవశ్యక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. 2032 ఏడాదికల్లా అణువిద్యుత్ వ్యవస్థాపక సామర్థ్యం మూడింతలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఇకపై 3 షిఫ్టుల్లో సీయూఈటీ: యూజీసీ

న్యూఢిల్లీ: ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష(సీయూఈటీ)ను ఈ ఏడాది నుంచి 3 షిఫ్టుల్లో నిర్వహించనున్నట్లు యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్ కుమార్ చెప్పారు. జేఈఈ, నీట్ వంటి కీలక పరీక్షలను సీయూఈటీలో కలిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షల సమ్మేళనం గురించి రెండేళ్ల ముందుగానే ప్రకటిస్తామన్నారు. సీయూఈటీ–యూజీ సెకండ్ ఎడిషన్ పరీక్షను ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించేందుకు యూజీసీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇకపై విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరీక్షపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఉద్యోగం పోయిన హెచ్–1బి వర్కర్లకు... ఆర్నెల్ల గ్రేస్ పీరియడ్

అమెరికా అధ్యక్షుని సలహా కమిటీ సిఫార్సు

- వేలాది భారత టెకీలకు ఊరట!
- ఐదేళ్లకు మించి వెయిటింగ్‌లో ఉన్న గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఈఏడీ!
- సాధ్యాసాధ్యాలపై అధ్యక్షుని సలహా కమిటీ చర్చ

వాషింగ్టన్: మాంద్యం దెబ్బకు అమెరికాలో వరుస పెట్టి ఉద్యోగాలు కోల్పోతున్న హెచ్–1బీ ఉద్యోగులకు ఊరట. ఉద్యోగం పోయిన రెండు నెలల్లోపే కొత్త కొలువు వెతుక్కోవాలన్న నిబంధనను సడలించి గ్రేస్ పీరియడ్‌ను ఆర్నెల్లకు పెంచాలని అధ్యక్షుని సలహా సంఘం సిఫార్సు చేసింది. తద్వారా కొత్త ఉపాధి అవకాశం వెతుక్కునేందుకు వారికి తగినంత సమయం దొరుకుతుందని అభిప్రాయపడింది. దీనికి అధ్యక్షుని ఆమోదం లభిస్తే కొన్నాళ్లుగా అమెరికాలో ఉద్యోగాలు కోల్పోతున్న వేలాది భారత టెకీలకు భారీ ఊరట కలగనుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్‌తో పాటు పలు దిగ్గజ కంపెనీలు వేలాదిగా ఉద్యోగులను తొలగిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత నిబంధనల మేరకు వారంతా 60 రోజుల్లోగా మరో ఉపాధి చూసుకోలేని పక్షంలో అమెరికా వీడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో గ్రేస్ పీరియడ్‌ను 180 రోజులకు పెంచాల్సిందిగా సిఫార్సు చేసినట్టు ఆసియా అమెరికన్లు తదితరులపై అధ్యక్షుని సలహా సంఘం సభ్యుడు అజన్ జైన్ భుటోరియా వెల్లడించారు. అమెరికాలో 2022 నవంబర్ నుంచి రెండు లక్షలకు పైగా ఐటీ నిపుణులు ఉద్యోగాలు కోల్పోయారు. వీరిలో ఏకంగా 80 వేల మంది భారతీయులేనని అంచనా!



గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఊరట!

మరోవైపు, ఈబీ–1, ఈబీ–2, ఈబీ–3 కేటగిరీల్లో ఆమోదిత ఐ–140 ఉపాధి ఆధారిత వీసా పిటిషన్లుండి, ఐదేళ్లకు పైగా గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నవారికి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్లు (ఈఏడీ) జారీ చేయాలని అధ్యక్షుని సలహా కమిటీ తాజాగా ప్రతిపాదించింది. ఇందుకు ఆమోదం లభిస్తే ఇమిగ్రెంట్ వారి వీసా దరఖాస్తులపై తుది నిర్ణయం వెలువడేదాకా అమెరికాలో వృత్తి, ఉద్యోగాలు కొనసాగించుకునేందుకు వీలు కలుగుతుందని కమిటీ సభ్యుడు అజన్ జైన్ భుటోరియా తెలిపారు.

అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం

మెక్‌మోహన్ రేఖ అంతర్జాతీయ సరిహద్దు	అమెరికా సెనేట్‌లో తీర్మానం	భారత్‌కు అండగా ఉంటా మన్న సెనేటర్ బిల్ హగెర్టీ

వాషింగ్టన్: అరుణాచల్ ప్రదేశ్ తమదేనని వాదిస్తున్న చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమే తప్ప చైనాలో భాగం కాదని అగ్రరాజ్యం అమెరికా తేల్చిచెప్పింది. చైనా, అరుణాచల్ మధ్యనున్న మెక్‌మోహన్ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. సరిహద్దు వద్ద యథాతథ స్థితిని మార్చడానికి చైనా ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సెనేటర్లు బిల్ హగెర్టీ, జెఫ్ మెర్క్‌లీ సెనేట్‌లో తీర్మానం ప్రవేశపెట్టగా మరో సెనేటర్ జాన్ కార్నిన్ కూడా దాన్ని ప్రతిపాదించారు. ''స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు చైనా నుంచి ముప్పు కొనసాగుతున్న తరుణంలో ఈ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలకు అండగా నిలవడం అమెరికా బాధ్యత. ప్రత్యేకించి భారత్‌కు మా మద్దతు ఉంటుంది'' అని హగెర్టీ పేర్కొన్నారు. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వద్ద యథాతథ స్థితిని మార్చాలన్న చైనా కుటిల యత్నాలను ఖండిస్తున్నామని చెప్పారు. అమెరికా–భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత ముందుకెళ్లనుందని అన్నారు. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు 'క్వాడ్' కూటమి మద్దతు ఉంటుందని వెల్లడించారు. సరిహద్దు వెంట వివాదాస్పద ప్రాంతాల్లో గ్రామాల నిర్మాణం, అరుణాచల్ భూభాగాలకు మాండరిన్ భాషలో మ్యాప్‌లను రూపొందించడాన్ని తీర్మానంలో ప్రస్తావించారు.

సాక్షి కరీంనగర్

గురువారం । 16 । మార్చి । 2023



ఇక వృద్ధులతో సంఘాలు

మహిళా సంఘాల్లో ఇకపై వృద్ధులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 60 ఏళ్లు పైబడిన వారితో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. - 10లో▸



పేపర్ లీకేజీపై నిరసన

టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/22.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



కరీంనగర్: ఏప్రిల్ 3 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న పరీక్షలకు 12,144 మంది రెగ్యులర్, 51 మంది ప్రైవేటు విద్యార్థుల కోసం 78 పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు 76 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 76 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇద్దరు అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు, 800 మంది ఇన్విజిలెటర్లను నియమించినట్లు తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన సీపీ



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు బుధవారం కరీంనగర్ త్రీటౌన్, రూరల్ పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్లలో అన్నిస్థాయిలకు చెందిన సిబ్బందితో మాట్లాడి నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్‌లో ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయో తెలుసుకోవడంతోపాటు పరిష్కార చర్యలపై ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. 5 ఎస్ ప్రోగ్రాంలో భాగంగా పోలీస్‌స్టేషన్ల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పాటు చేయాలని చెప్పారు. సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలని చెప్పారు. కరీంనగర్ టౌన్, రూరల్ ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, సీఐలు దామోదర్‌రెడ్డి, విజ్ఞాన్‌రావు పాల్గొన్నారు.

జేఎన్‌వీ విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం

చొప్పదండి: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన 12వ తరగతి విద్యార్థినులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ద్వారా రూ.12వేల చొప్పున ఉపకార వేతనాలను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన అలెన్ కోట వారి ఆధ్వర్యంలో నిష్ణాతులైన అధ్యాపక బృందంతో అంతర్జాల తరగతులు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఒక్కో విద్యార్థినికి రూ.ఆరు వేల విలువైన ఇంజినీరింగ్, మెడిసిన్ ప్రవేశ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్‌ను బుధవారం జేఎన్‌వీలో అందజేసినట్లు తెలిపారు. కోఆర్డినేటర్ అబ్దుల్ రహమాన్, విద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కట్టా’ను పట్టుకున్నాం!

34 ఏళ్లుగా పంచాయతీరాజ్‌లో కట్టా విష్ణువర్ధన్ కొలువు

- ‘సాక్షి’ పరిశోధన కథనాలతో వెలుగుచూసిన వాస్తవం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు
- అతని తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లేనన్న దర్యాప్తు టీమ్
- 1956లో తల్లి నిరూప, 1967లో విష్ణువర్ధన్ జన్మించినట్లు రికార్డులు
- ఉన్నత విద్య కోసం లీవులే పెట్టలేదని తేల్చిన అధికారులు
- క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తో వ్యవస్థలను తప్పదోవ పట్టించాడని నివేదిక



పట్టుకోండి చూద్దాం..!



ఆయన అర్హతలు తేల్చండి!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 34 ఏళ్లపాటు వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడు. ఎలాంటి అర్హత లేకున్నా.. కారుణ్య నియామకం కింద ఉద్యోగం పట్టాడు. ఉద్యోగం చేస్తూనే ఒక్కరోజు కూడా లీవు పెట్టకుండా ఇంజినీరింగ్ సర్టిఫికెట్లు కొట్టాడు. తన తల్లి తన కంటే కేవలం 10 ఏళ్లు మాత్రమే పెద్దదంటూ రికార్డులు ఇచ్చి అధికారులను ఒప్పించాడు. దొడ్డిదారిలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, సుప్రీం కోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతులు పొంది ఇంతకాలం సమాజాన్ని మోసం చేస్తూ వస్తోన్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ కట్టా విష్ణువర్ధన్ ఆట ముగిసింది. ‘పట్టుకోండి చూద్దాం’ పేరుతో ‘సాక్షి’ కొంతకాలంగా ప్రచురిస్తున్న కథనాలు నిజమేనని అతని వ్యవహారంపై విచారణ జరిపిన అధికారులు నిగ్గు తేల్చారు. ఇటీవలే దర్యాప్తు నివేదికను హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపారు. ఈ నివేదిక ప్రతిని ‘సాక్షి’ సంపాదించింది. ఇంతకీ ఆ నివేదికలో ఏముందంటే..?

రికార్డులే లేవు.. అన్నీ అక్రమాలే..!

పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్–డివిజన్, ఏఈ, కట్టా విష్ణువర్ధన్ మార్చి2, 1967లో కట్టా వెంకట నాగరత్నాచారి, కట్టా నిరూపలకు కోత్మీర్‌గడ్డలో జన్మించారు. వీరిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవ్‌పూర్‌లో విష్ణువర్ధన్ గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 02, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. అంటే ఇద్దరి మధ్య కేవలం పదేళ్లే వ్యత్యాసమా? వాస్తవానికి విష్ణువర్ధన్ నియామకం సమయంలో అధికారులు ఈ చిన్న పాయింట్‌ను పసిగట్టలేకపోయారు. తీరా ఇటీవల అధికారులు విచారణ ప్రారంభించినప్పుడు అతని సర్వీసు బుక్ లభ్యమైందే తప్ప.. అతని నియామక రికార్డులు మాయం కావడం గమనార్హం.

పేరు, విద్యార్హతలపై అనేక సందేహాలు..!

విష్ణువర్ధన్ 1988లో సమర్పించిన సర్టిఫికెట్ల ప్రకారం.. 1967లో జన్మించానని చెప్పుకున్నారు. అవేగాక పదోన్నతుల సమయంలో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా (ముంబై), బీటెక్ సివిల్ (రాజస్తాన్ డీమ్డ్ వర్సిటీ) సర్టిఫికెట్లు చూపారు. ఈ సర్టిఫికెట్ల విశ్వసనీయతపైనా దర్యాప్తు అధికారులు సందేహాలు వ్యక్తం చేశారు. వీటి ఆధారంగా విష్ణువర్ధన్ నాలుగు సార్లు పదోన్నతులు పొందారు. కానీ.. ఈ కోర్సులు చేస్తున్న సమయంలో ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం లేదు. ఆ కోర్సుల పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఎలాంటి లీవులు పెట్టినట్లుగా రికార్డులే లేవని, అసలు ఆ సర్టిఫికెట్లు రెగ్యులరా? లేక దూరవిద్యవా? అన్న విషయంలో విష్ణువర్ధన్ స్పష్టత ఇవ్వలేదని నివేదికలో పొందుపరిచారు. పదోన్నతుల సమయంలో అతని ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని, అతని సర్టిఫికెట్ల విశ్వసనీయతను సైతం పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదని తోటి ఉద్యోగులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విష్ణువర్ధన్‌ను ఇంటి వద్ద అంతా ‘వాసు’ అని పిలుస్తారని గుర్తు చేస్తున్నారు. ఇన్ని అక్రమాలకు పాల్పడిన అతన్ని సర్వీసు నుంచి తొలగించాలని అతని తోటి ఉద్యోగులంతా వరుసగా హైదరాబాద్ ఈఎన్‌సీ కార్యాలయానికి ఫిర్యాదులు చేస్తున్నారు.

విష్ణువర్ధన్‌ది క్రిమినల్ ఇన్‌టెన్షన్..!

వాస్తవానికి నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద టైపిస్ట్, స్టెనో, క్లర్క్ ఇలాంటి దిగువ కేటగిరీ ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ.. ఇతని విషయంలో మాత్రం వర్క్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్–3 ఇవ్వడం తమకు ఆశ్చర్యానికి గురిచేసిందని నివేదికలో దర్యాప్తు అధికారులు స్పష్టంచేశారు. అతను అనర్హుడని, అక్రమార్కుడని యథేచ్ఛగా అన్ని వ్యవస్థలను మోసం చేశాడని, ఉన్నతాధికారుల కళ్లకు గంతలు కట్టాడని వివరించారు.

- అతను విధుల్లో చేరినప్పటి నుంచి ఈ రోజు వరకు విధి నిర్వహణ మొత్తం అనుమానాస్పదంగా, క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తోనే ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన ప్రతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు.
- ఇతని అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆరా తీసి, రికవరీకి కూడా సిఫారసు చేశారు. అదే సమయంలో అతని విద్యార్హతలపై గందరగోళం ఉందని వాటిపైనా లోతైన దర్యాప్తు చేయాలని చెప్పారు.

పట్టుకోండి చూద్దాం పార్ట్–5



కట్టా విష్ణువర్ధన్ ➤

రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి..



విష్ణువర్ధన్ పేరు నుంచి విద్యార్హతల వరకు అన్నీ నకిలీనే. 34 ఏళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను మోసం చేస్తూ వస్తున్నాడు. అతని విద్యార్హతలపై చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం. అత్యంత అవినీతి పరుడు, తోటి ఉద్యోగులను వేధించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. పేరెంట్స్ సర్కారు ఉద్యోగులని తెలినా కారుణ్య నియామకం కింద అతన్ని కొనసాగించడం దారుణం. వెంటనే అతన్ని రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి.

– ఆమిర్, సామాజిక ఉద్యమకారుడు

రేపటి నుంచి అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్ అర్బన్: అంగారిక టౌన్‌షిప్ 3వ విడత ప్లాట్ల వేలం ఈ నెల 17 నుంచి 19వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. నగరంలోని వాసర గార్డెన్స్‌లో మూడు రోజుల పాటు ప్లాట్ల ప్రత్యక్షవేలం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల ప్రత్యక్ష వేలం కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో తుది విడత అంగారిక టౌన్ షిప్‌కు సంబంధించిన 157 ఓపెన్ ప్లాట్లను ప్రత్యక్షవేలం ద్వారా విక్రయించనున్నామని అన్నారు. ప్రత్యక్ష వేలం గురించి ప్రజలకు తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. వేలం వేదిక వద్ద హెల్ప్‌డెస్కులు, కౌంటర్లను ఏర్పాటు చేయాలని, అవసరం మేర కంప్యూటర్లను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాసర గార్డెన్స్ వద్ద పోలీసు బందోబస్తు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ప్రొజెక్టర్లను, బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వేలం నిర్వహించే రోజులలో సిబ్బంది అందరూ ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో కరీంనగర్ ఆర్డీవో ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సేవ ఇస్లావత్, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, అంగారిక అధికారులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్ ధర రూ.7,400

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,400 పలికింది. మార్కెట్‌కు 93వాహనాల్లో 1,293 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.6,600 కాగా గన్నీ సంచుల్లో 15 మంది రైతులు 26 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.6,000కు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

ఐకమత్యమున్న చోటే అభివృద్ధి

- అన్ని పార్టీలూ రైస్ మిల్లర్లను దొంగల్లా చూశాయి
- మిల్లర్ల వైపు నిలిచింది కేసీఆర్ మాత్రమే
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



అధ్యక్ష, కార్యదర్శులతో మంత్రి గంగుల

కరీంనగర్ అర్బన్: ఐకమత్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళదామని, తదనుగుణంగా మిల్లర్లు సహకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రైస్ మిల్లులపై ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మంది ఆధారపడి ఉంటారని, ఎన్నికల వాతావరణం రావద్దనే ఉద్దేశంతో అందరి సంక్షేమం కోసం సమన్వయం చేసి ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగిందని వివరించారు. ప్రభుత్వానికి పరిశ్రమలకు వారధిగా సంఘాలు పనిచేయాలని సూచించారు. కరీంనగర్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రి గంగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేడు 90 శాతం మంది మిల్లర్లు సీఎంఆర్‌పై ఆధారపడి ఉన్నారని, చిన్న పాటి మిల్లర్లకు మొదట కేటాయింపులు జరిపి వాళ్లని బతికించాలని సూచించారు. గత ప్రభుత్వాలు పరిశ్రమలపై నిర్లక్ష్యం చేసి పవర్ హాలిడేల పేరిట విద్యుత్ ఇవ్వకుండా ఇబ్బందుల్లోకి నెట్టాయని.. సీఎం కేసీఆర్ అండగా నిలిచారని అన్నారు. ప్రపంచానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించిందని అన్నారు. జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నర్సింగరావు, జిల్లా కార్యదర్శులుగా తొడుపునూరి కరుణాకర్, గుర్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఇదే..

రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి అయిన అన్నమనేని సుధాకర్‌రావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షునిగా బోయినపల్లి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శులుగా తొడుపునూరి కరుణాకర్, గుర్రాల రాజమౌళి, కోశాధికారిగా జి.ఆనందరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కేశవరెడ్డి, వి.మల్లన్న, పి.మల్లారెడ్డి, కె.మహేశ్, ఎ.రవి, జి.శంకర్‌లింగం, ఎస్.శ్రీధర్, పి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, వి.వీరకుమార్, బి.బాలనారాయణ, ఎస్.వేణుగోపాల్, పి.విజేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.



సక్సెస్ మీట్‌లో బలగం చిత్రం యూనిట్‌తో మంత్రి, మేయర్ తదితరులు



నృత్యం చేస్తున్న బాలభవన్ చిన్నారులు

నగరంలో ‘బలగం’ టీమ్

కరీంనగర్‌కల్చరల్: ‘బలగం’ సినిమా టీమ్ బుధవారం నగరంలో సందడి చేసింది. కరీంనగర్‌లోని జ్యోతిబాపూలే మైదానంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి గంగుల మాట్లాడుతూ.. తెలంగాణ పల్లెల్లో జరిగే యదార్థ గాథలను అద్భుతంగా సినిమా తీశారని.. భూమి మీద ఎవరు శాశ్వతం కాదని.. అంతిమంగా కుటుంబానికి ప్రేమ పంచాలని చూపించిన సినిమా ‘బలగం’ అని అన్నారు. దర్శకుడు ఎల్దండి వేణు మాట్లాడుతూ.. ‘సిరిసిల్లలో చదువుకున్నాను. కరీంనగర్ వచ్చి మార్నింగ్ షో సినిమా చూసి ఒక టీ తాగి, డబల్ రొట్టె తిని సిరిసిల్లకు వెళ్లేవాడిని’ అని గుర్తు చేసుకున్నారు. ‘మా కుటుంబం సిరిసిల్లలో కూరగాయలు అమ్ముతుండేది. రాత్రి కరీంనగర్‌లో సెకండ్ షో చూసి మార్కెట్‌లో కూరగాయలు కొనుక్కొని సిరిసిల్లకు తీసుకెళ్లే వాడిని’ అని చెప్పారు. బలగం చిత్రాన్ని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బాలభవన్ చిన్నారులు చేసిన నృత్యం అలరించింది. హీరో ప్రియదర్శి, హీరోయిన్ కావ్య, నిర్మాత దిల్‌రాజు, హర్షిత్ రెడ్డి, హన్షితరెడ్డి, సంగీత దర్శకుడు భీమ్స్, గేయ రచయిత దాసర్ల శ్యామ్, నటీనటులు రచ్చ రవి, విజయలక్ష్మి, మల్లయ్య, సౌమ్య, సత్యనారాయణ, సంజయ్, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, మురళీధర్ సందడి చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫస్టియర్ పరీక్షలు ప్రారంభం

- 16,163 మంది విద్యార్థులు హాజరు.. 517 మంది గైర్హాజరు
- మొదటి రోజు ప్రశాంతం
- ఐదు నిమిషాల ఆలస్యంతో పరీక్ష రాయకుండానే వెనుదిరిగిన విద్యార్థిని

కరీంనగర్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయడంతో మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ ట్రినిటి జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు విద్యార్థిని ఐదు నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారులు వెనక్కి పంపించారు. జనరల్ విభాగంలో 14,767 మంది విద్యార్థులకు 305 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,913 మంది విద్యార్థులకు 1,701 మంది పరీక్ష రాశారు. మొత్తంగా 16,680 మంది విద్యార్థులకు 517 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 16,163 మంది హాజరైనట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షించినట్లు ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ అధికారులు జి.జగన్మోహన్‌రెడ్డి, ఆంజనేయరావు, శశిధర్‌శర్మ, రవీందర్‌రెడ్డి వెల్లడించారు.



లాస్ట్ ప్రిపరేషన్: పరీక్షకు ముందు కూడా పుస్తకాలతో కుస్తీ



రూమ్ నంబర్ ఎంత?: హాల్‌టికెట్ నంబర్లు చూస్తూ..



ఆగండి.. ఆగండి..: విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది





పదండి.. పదండి..: పరీక్ష రాసేందుకు వెళ్తున్న స్టూడెంట్స్



ర్యాంకు రావాల్సిందే..: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

26 మంది ఎస్సారార్ విద్యార్థులకు ఉద్యోగాలు



శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్‌): ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలంగాణ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో బుధవారం 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ సీహెచ్.మారుతి, విబిలీవ్ కన్సల్టెంట్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ జ్ఞానేంద్రరెడ్డి, మేనేజర్ అజీజ్, టీఎస్‌కేసీ మెంటర్ డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

నవత ట్రాన్స్‌పోర్ట్‌లో ఉద్యోగ అవకాశాలు

కరీంనగర్ అర్బన్‌: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలున్నాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న స్వశక్తి కళాశాలలోని ఈజీఎంఎంఎ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇంటర్ నుంచి బీటెక్ వరకు విద్యార్హత గలవారికి ఆయా విభాగాల్లో ఉద్యోగాలిస్తారని వివరించారు. క్లర్క్‌కు ఇంటర్ లేదా డిగ్రీ, ఆఫీసర్‌కు ఏదైనా డిగ్రీ, వెహికిల్ మెంటినెన్స్‌కు బీటెక్(మెకానికల్) లేదా డిప్లొమా (మెకానిక్), మెకానిక్స్‌కు ఐటీఐ(డీజిల్ మెకానిక్), డిప్లొమా(ఆటోమొబైల్ ఇంజినీరింగ్) చదివిన వారు అర్హులని, వేతనం రూ.11,045 నుంచి రూ.15వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

మైనర్లకు వాహనాలిచ్చే వారిపై కేసులు

కరీంనగర్‌క్రైం: మైనర్లు వాహనాలు నడిపి ఏవైనా ప్రమాదాలకు పాల్పడినట్లయితే సదరు వాహనాల యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌ను తీవ్రంగా పరిగణిస్తూ కమిషనరేట్‌వ్యాప్తంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగడానికి కారణం అవుతున్న దుకాణాదారులపై కూడా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలకు అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందించాలని సూచించారు.

బావిలోపడి వృద్ధురాలు మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలోని గౌతమినగర్‌లో ఓ వృద్ధురాలు బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అందె దేవమ్మ(80) గౌతమినగర్‌లోని పెద్ద కొడుకు అందె భూమయ్య ఇంట్లో ఉంటోంది. మంగళవారం రాత్రి సుమారు 9గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె లేకపోవడంతో కుటుంబసభ్యులు అందరూ చుట్టుపక్కల వెతికారు. ఇంట్లో బావిలో చూడగా నీళ్ల తోడుకునే బకెట్, తాడు కనిపించలేదు. భూమయ్య అతని సోదరుడు రాజు, చుట్టుపక్కల వాళ్లు బావిలోకి దిగి చూసేసరికి దేవమ్మ మృతదేహం కనిపించింది. దేవమ్మ తరచూ బావిలోని నీరు తోడుకొని తాగుతుండేది. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి బావిలో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు పడిందని భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పేపర్ లీకేజీపై నిరసన జ్వాలలు



నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు



మాట్లాడుతున్న మహేందర్, యుగేందర్

కరీంనగర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాలు లీకేజీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లాకేంద్రంలో పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణచౌక్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగుల నిర్లక్ష్యంతో కిందిస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం కారణంగా నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయమై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆది మల్లేశం, చిగుర్ల శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ నుంచి పేపర్‌లీకేజీ అవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, టీఎస్‌పీఎస్సీ అధికారుల ప్రమేయం లేకుండా ప్రశ్నపత్రాలు లీక్‌అయ్యే అవకాశంలేదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షకార్యదర్శులు మహేందర్, యుగేందర్ అన్నారు. ప్రస్తుతం గ్రూప్స్ నోటిఫికేషన్లు జారీ చేశారని, ఏ చిన్న పొరపాటు జరిగినా లక్షలాది మందిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిసినా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన బోర్డు తీరు సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు.

డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, నిందితులపై చర్యలు తీసుకోవాలని, బోర్డు చైర్మన్, కార్యదర్శిని తక్షణమే విధుల నుంచి తప్పించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిరుపతి, రజనీకాంత్‌లు డిమాండ్ చేశారు. తెలంగాణచౌక్‌లో టీఎస్‌పీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బోర్డులో ఇంత జరుగుతున్నా, నిర్లక్ష్యం వహించిన బోర్డు చైర్మన్, కార్యదర్శిపై విచారణ నిర్వహించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.నరేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు జి.లక్పతినాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరవింద్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేశ్, శివ, అనిల్, రాజేశ్, రాజు, కార్తీక్, అంబర్ సింగ్, ఆటోత్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల భవితతో ఆడుకోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న డాక్టర్ నగేశ్

విద్యానగర్(కరీంనగర్): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం వారి భవితతో ఆడుకోవడం సిగ్గుచేటు అని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలన్నీ లీక్ చేయడంలో బీఆర్ఎస్ నాయకుల పాత్ర ఉందన్నారు. లీకేజీకి టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బాధ్యుడ్ని చేసి, విధుల్లోంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ విషయం తేల్చే వరకు పోరాటం చేస్తామన్నారు. నాయకులు ఊకంటి రవీందర్ రెడ్డి, బి. ఆంజనేయులు, సయ్యద్ రియాజ్, ఖాలీద్, అజారోద్దీన్, సునీల్, శేఖర్, సంపత్, అజీఖాన్ ఉన్నారు.

ఎంజేపీలో బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

తిమ్మాపూర్: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో (ఇంగ్లిష్ మీడియం) మిగిలి ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఎంజేపీ గురుకుల కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 24 2023 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి గౌతమ్‌కుమార్ తెలిపారు.దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రవేశ పరీక్ష మే 5న ఉంటుందని తెలిపారు.

జూనియర్ కాలేజీల్లో..

సొసైటీ పరిధిలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నిర్వహించే ఆర్‌జేసీ సెట్–2023కు 2022–23లో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే ఆర్‌డీసీ సెట్–2023కు 2022–23లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 16 2023 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 29న పరీక్ష నిర్వహించనున్నారు.

విధుల్లో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవు

- వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలి
- ఫోరం సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ సత్యనారాయణ



విద్యుత్ సమస్యను వివరిస్తున్న రుద్ర రాజు

కొత్తపల్లి: విద్యుత్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ పి.సత్యనారాయణ గౌడ్ హెచ్చరించారు. పౌర సేవా పత్రం ప్రకారం సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిన విద్యుత్ ఉద్యోగుల నుంచి రూ.5.50 లక్షలు వసూలు చేసి వినియోగదారులకు చెల్లించడం జరిగిందని గుర్తు చేశారు. కొత్తపల్లి(హెచ్) సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన కరీంనగర్ రూరల్ డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సుకు హాజరైన ఆయన వినియోగదారుల నుంచి విద్యుత్ సంబంధిత వినతులు స్వీకరించి వాటిపై ఉద్యోగుల నుంచి వివరణ ఇప్పించారు. ఫోరం చైర్మన్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యలుంటే తప్ప వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. పౌరసేవా పత్రం ప్రకారం సమస్యలు పరిష్కరించకుండా విద్యుత్ ఉద్యోగులు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే ఫోరంను లెటర్ ద్వారా గాని వాట్సప్ ద్వారా గాని సంప్రదిస్తే పరిష్కారమార్గం చూపుతామని చెప్పారు. వినియోగదారులు తమ హక్కులు సాధించుకునేందుకు ఈ ఫోరం ఒక చక్కని వేదిక అని, ప్రతి ఒక్కరు ఫోరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్ గందు రాంబాబు, వినియోగదారులతో పాటు ఫోరం సభ్యులు తిరుమల్ రావు, నరేందర్, చరణ్‌దాస్, డీఈ రాజం, ఏడీఈ కొలుపుల రాజు, ఎస్ఏఓ రాజేశం, ఏఈలు శ్రీధర్, లక్ష్మీనారాయణ, తిరుపతి, శ్రీనివాస్, నరేష్, సబ్ ఇంజినీర్లు, సీనియర్‌లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ మెన్లు, జేఎల్ఎంలు, అన్‌మ్యాన్డ్, ఆర్టిజన్లు ఉన్నారు.

దేశవ్యాప్త ప్రచారానికి సీపీఐ శ్రేణులు సిద్ధంకండి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



జెండా ఆవిష్కరిస్తున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని, దాన్ని అడ్డుకోవడం కోసం దేశ్ కీ బచావో బీజేపీకి హటావో అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రచార ఆందోళనలకు సిద్ధం కావాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బోయిని అశోక్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీపీఐ పతాకాన్ని ఎగురవేశారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నల్లధనం వెనక్కి తీసుకోవస్తామని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రగల్భాలు పలికాడని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న సంపాదను ఆదానీ, అంబానీలకు కట్టబెట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నాడని మండిపడ్డారు. బీజేపీ పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవడం కోసం సీపీఐ జాతీయ సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో దేశ్ కి బచావో బిజెపికి హఠావో అనే నినాదంతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పూర్వ వైభవానికి కార్యకర్తలు ,నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి, గూడెం లక్ష్మి కసిరెడ్డి సురేందర్ రెడ్డి,బత్తుల బాబు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఏం అభివృద్ధి చేశారు?

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: ఎమ్మెల్యేగా చిగురుమామిడి మండలానికి వొడితెల సతీశ్ కుమార్ చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం బీజేపీ నాయకులతో కలిసి చిగురుమామిడిలో మాట్లాడారు. అంతకుముందు ఎంపీ బండి సంజయ్‌కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీగా బండి సంజయ్ అనేక నిధులు తీసుకొస్తున్నారని అన్నారు. ఇప్పటికీ గ్రామపంచాయతీలకు వచ్చే 15, 16వ ఆర్థిక సంఘాల నిధులు మీ ఖాతాల్లో వేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. రామాయంపేట నుంచి సిద్దిపేట, హుస్నాబాద్ ద్వారా ఎలక్తుర్తి వరకు ఫోర్‌లైన్ రోడ్ కోసం రూ.578 కోట్లు ఎంపీ మంజూరు చేయించారని అన్నారు. ఇందుర్తి–హుస్నాబాద్ రోడ్డుకు రూ.15కోట్లు మంజూరు చేశారన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమని, ఇక్కడ ఎగిరేది కాషాయపు జెండాయేనని అన్నారు. బొమ్మ శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌ను విమర్శిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే దత్తత తీసుకున్న గ్రామాలు బొమ్మనపల్లి, ఎలబోతారంతో పాటు మరోరెండు ఊర్లలో అభివృద్ధి జాడ కనిపించడం లేదన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పోలోజు సంతోశ్ కుమార్, బోయిని వంశీకృష్ణ, వంగరల మల్లేశం, బోయిని ప్రశాంత్ ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్ బెల్టు గ్రేడింగ్



కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం మార్షల్ ఆర్ట్స్ గ్రేడింగ్ నిర్వహించారు. పలువురు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ బెల్టులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అసిస్టెంట్ కోచ్ రాకేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, పీఈటీలు శ్రీకాంత్, సుప్రజ, అనిల్, రహీం పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితచరిత్రపై వ్యాసరచన పోటీలు

హుజూరాబాద్: ఏప్రిల్ 14న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు రొంటాల బాబు పిలుపునిచ్చారు. బుధవారం హుజూరాబాద్‌లో మాట్లాడుతూ తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ జీవిత చరిత్రపై కరపత్రం ఆవిష్కరించి, గడపగడపకు తీసుకెళ్తామన్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, సెమినార్లు నిర్వహించి విద్యార్థులకు అంబేడ్కర్ బాల్యం, సాధించిన విజయాలను, ఆశయాలను వివరిస్తామన్నారు. రోగులకు పండ్ల పంపిణీ , రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు మండలాల వారీగా సన్మానాలు చేయాలని పిలుపునిచ్చారు.

గంజాయి కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని గంజాయి అమ్మకానికి ఒడిగట్టిన నేరంలో నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవాణి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పరకాల మండలం చర్లపల్లికి చెందిన రావుల మొగిలి(51) లాండ్రి పని చేస్తుండాడు. దానిద్వారా వచ్చిన డబ్బు కుటుంబపోషణకు సరిపోవటం లేదని గంజాయి అమ్మి ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. మొగుళ్లపల్లి మండలం మేదరిమెట్లకు చెందిన పెండ్లి విజేందర్(50) మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి ఇక్కడ అమ్ముతుంటాడు. మొగిలి అతని వద్ద నుంచి మూడు కిలోల గంజాయి కొనుగోలుచేసి గోదావరిఖనిలో అమ్మేందుకు 2017 మార్చి 1న తన ద్విచక్రవాహనంపై జమ్మికుంట రైల్వేస్టేషన్ వెళ్తుండగా వెహికల్ చెకింగ్ చేస్తున్న జమ్మికుంట ఎస్సై ఎం.శ్రీనివాస్ పట్టుకున్నాడు. ఇతని వద్ద మూడు కిలోలు, విజేందర్ వద్ద ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశాడు. చార్జీషీటు దాఖలు చేయగా.. సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వెంకటేశ్వరరావు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. ఈ కేసు విచారణ సమయంలో రావుల మొగిలి చనిపోగా.. మరో నిందితుడు పెండ్లి విజేందర్‌కు నాలుగేళ్ల జైలు, రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ పండుగ ఏర్పాట్లపై పోలీసు, ముస్లిం, హిందూ మతపెద్దలు, నాయకులతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సమయంలో మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, వీధిదీపాలు వెలిగేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారికి, కరెంటు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులకు సూచించారు. నైట్ మార్కెట్లు, ఫ్రూట్, వెజిటేబుల్ మార్కెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఉపవాస దీక్షలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఇబ్బందులు ఉంటే పోలీస్‌శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, మేయర్ వై.సునీల్‌రావు, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్యాంప్రసాద్ లాల్, డీసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు
- మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు అన్నారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవలి కాలంలో కార్డియాక్ అరెస్టులతో చాలా మంది యువకులు అకస్మాత్తుగా మరణిస్తున్నారని, ఇలాంటి మరణాలు ఇక ముందు జరగొద్దని... ఒక వేళ జరిగినా వారిని కాపాడాలని సంకల్పించి పోలీస్ సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సైతం క్షతగాత్రులకు సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డీసీపీ చంద్రమోహన్, ట్రాఫిక్ ఏసీపీ విజయ్‌కుమార్, సీఐలు తిరుమల్, నాగార్జున, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, డాక్టర్ అక్షయ్, హర్షిత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాలో నేటి కంటివెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో గురువారం 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జువేరియా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 1, 6, 8, 12, 15, 18, 41, 45, 46, 49, 53, 56 డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలో 4, 15 వార్డులు, మండలంలోని కాట్రపల్లి, సిరసపల్లి, జమ్మికుంట పట్టణంలోని 9వ వార్డు, మండలంలోని గండ్రపల్లి, మడిపల్లి, వీణవంక మండలం ఎలబాక, కొండపాక, బేతికల్, చిగురుమామిడి మండలం రేకొండ, ఇందుర్తి, చొప్పదండిలోని వార్డు నంబర్ 11, కాట్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తారు. ఇల్లందకుంట మండలం మల్లన్నపల్లి, మల్యాల, గంగాధర మండలం గర్శకుర్తి, ఇస్లాంపూర్, ఉప్పర మల్యాల, రామడుగు మండలంలో దేశరాజ్‌పల్లి, వన్నారం గ్రామాల్లో ఉంటాయి. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్, మొగ్దుంపూర్, నగునూర్, మానకొండూరు మండలంలో ముంజంపల్లి, కొండపల్కల, పచ్చునూర్, సైదాపూర్ మండలం ఎక్లాస్పూర్, అమ్మనగుర్తి, కేశవపట్నం మండలం వంకాయగూడెం, లింగాపూర్ గ్రామాలు, తిమ్మాపూర్ మండలంలో నుస్తులాపూర్, నల్లగొండ, గన్నేరువరం మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తున్నాయన్నారు.



ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

'శ్రీ చైతన్య'లో ఫ్లాష్‌మాబ్

తిమ్మాపూర్: మండలంలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ఆధ్వర్యంలో ఆవిర్భావ్–2క23 'నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోసియం' పురస్కరించుకొని విద్యార్థులు బుధవారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు చేసిన వివిధ రకాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర కో–కరిక్యులర్ ఆక్టివిటీస్ లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్‌లు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రాజు, రామ నర్సింహారెడ్డి, హెచ్‌వోడీ కాజా జియావుద్దీన్, ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి రమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వసంత నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ హెలిప్యాడ్ గ్రౌండ్‌లో గల శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని మేయర్ సునీల్‌రావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ 22 నుంచి 28వరకు ప్రతిరోజూ ఉదయం ప్రత్యేక పూజలు, హవనాలు, పారాయణాలు జరుగుతాయని, 29న సీతారాముల నామకరణ మహోత్సవం, తలంబ్రాలు కలుపుట, సాయంత్రం ఎదుర్కోలు వేడుక, 30న ఉదయం కల్యాణం, సాయంత్రం దశముఖ రావణ సంహారలీల, 31న పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మైనార్టీ స్కూల్స్, హాస్టల్స్ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్టల్స్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ తాజొద్దీన్ మాట్లాడుతూ బైపాస్‌లోని విట్స్ కాలేజీ ఆవరణలోని మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్, స్కూల్‌ను సందర్శించగా విద్యార్థులు తమకు ప్రభుత్వం అరకొర సౌకర్యాలు అందిస్తున్నదని వెల్లడించారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ అఖిల్, నేహాల్ అహ్మద్, అయాఖ్‌ఖాద్రి, ఎండీ ఇర్ఫాన్, ఫెరీజ్, అబ్దుల్ కరీం, హనీఫ్, ఘనీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



విద్యానగర్(కరీంనగర్): ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన మేడి మహేశ్, దీకొండ కుల్దీప్ వర్మ, ఎలుక ఆంజనేయులు, లకావత్ రవినాయక్‌లను బుధవారం మాదిగ రాజకీయ పోరాట సమితీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమితి నాయకులు మాతంగి రమేశ్, గాలిపెల్లి శ్రీనివాస్, అక్కపాక ఆకాశ్, నరేందర్, రాజు, మహేశ్, అశోక్ పాల్గొన్నారు.

రైతుబీమాకు దూరం

- భూములున్నప్పటికీ రైతుల చిరునామాల్లేవు
- కరీంనగర్ మండలంలో 1,521 మందికి బీమా లేదు



నగునూరు రైతువేదికలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

కరీంనగర్‌రూరల్: రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకంలో చేరేందుకు రైతులు ముందుకు రావడం లేదు. గ్రామాల్లో వ్యవసాయ భూములున్నప్పటికీ పలువురు రైతులు స్థానికంగా ఉండకపోవడంతో అధికారులకు వివరాలు లభించడం లేదు. రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, నామిని వివరాలను సంబంధిత ఏఈవోలకు ఇస్తే రైతుబీమా పథకంలో ఆన్‌లైన్ చేస్తారు. అయితే పలువురు రైతులు రైతుబంధుకు వివరాలను అందిస్తున్నప్పటికీ రైతుబీమాకు ఇవ్వకపోవడంతో అధికారులకు సైతం ఏమిచేయలేని పరిస్థితి ఏర్పడింది.

64 మంది రైతులు మృతి

రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా పథకంను 2018 ఆగస్టు 14 నుంచి అమలు చేస్తోంది. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి అమలు చేసే రైతుబీమాకు ప్రభుత్వం ఒక్కో రైతు పేరిట రూ.3,487 ప్రీమియం చెల్లిస్తుంది. ఎవరైనా రైతు ఏదైనా కారణంతో మృతి చెందితే కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తోంది. కరీంనగర్ మండల పరిధిలో మొత్తం 11,632 మంది రైతులు ఉన్నారు. రైతుబీమా పథకంలో చేరేందుకు 6,369మంది అర్హులుగా నిర్ధారించారు. గతేడాది వరకు 51 మంది రైతులు మృతి చెందగా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించగా ఈ ఏడాదిలో 13 మంది రైతులు మృతి చెందారు. 9మంది రైతుల కుటుంబాలకు పరిహారం మంజూరు కాగా ఇంకా నాలుగు కుటుంబాలకు పరిహారం రావాల్సి ఉంది.

1,521మంది రైతుల వివరాల్లేవు

గ్రామాల్లో పలువురు రైతులకు వ్యవసాయ భూములున్నప్పటికీ స్థానికంగా నివాసముండకపోవడంతో అధికారులకు వివరాలను సేకరించడం కష్టసాధ్యంగా మారింది. అంతేకాకుండా సరైన అవగాహన లేకపోవడంతో బీమాకు సంబంధించిన పూర్తి వివరాలను రైతులు ఇవ్వలేకపోతున్నారు. నామినీ పేరు, ఆధార్‌కార్డు తదితర వివరాలు అందుబాటులో లేకపోవడంతో పలువురు రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోతున్నామని ఏఈవోలు పేర్కొంటున్నారు. కరీంనగర్ మండలంలో ఈ ఏడాది 1,521 మంది అర్హులైన రైతుల వివరాలను అధికారులు సేకరించకపోవడంతో రైతుబీమాకు దూరమయ్యారు. అత్యధికంగా నగునూరులో 426 మంది రైతులుండగా దుర్శేడ్‌లో 201, బొమ్మకల్ 151, ఆరెపల్లిలో 149, చామనపల్లిలో 112 మంది రైతులున్నారు. క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు రైతుల వివరాలను సేకరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అర్హులైన పలువురు రైతులు బీమాకు నోచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

వివరాల సేకరణలో నిర్లక్ష్యం



రైతుల వివరాలను సేకరించడంలో వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుతో అర్హులైన రైతులకు అన్యాయం జరుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన రైతులందరిని రైతుబీమా పథకంలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– సాయిల్ల వినయ్‌సాగర్, ఎంపీటీసీ సభ్యుడు, నగునూరు.

స్థానికంగా ఉండటం లేదు



క్లస్టర్ పరిధిలోని ఏఈవోల ద్వారా అర్హులైన రైతుల వివరాలను ఆన్‌లైన్ చేశాం. కొందరు రైతులకు గ్రామాల్లో వ్యవసాయభూములుండగా స్థానికంగా ఉండటం లేదు. పట్టణాల్లో నివసిస్తుండటంతో రైతుల చిరునామా లభించక వివరాలు సేకరించేందుకు ఇబ్బందవుతోంది.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

చిత్ర కథ



నిబంధనలు బేఖాతర్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ అనే నిబంధనతో పాటు పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ అమలు ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లు, డీటీపీ సెంటర్లు మూసివేయాలి. కానీ కరీంనగర్‌లోని డాక్టర్ స్ట్రీట్‌లోని బాలికల జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఉండగా కళాశాల ఎదురుగా ఓ జిరాక్స్ సెంటర్ తెరిచి ఉండటం అధికారుల ఆలసత్వానికి నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

విద్య, క్రీడలతోనే కీర్తి ప్రతిష్టలు



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌లాల్

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్
- మల్కాపూర్ హైస్కూల్‌లో వార్షికోత్సవ సందడి

కొత్తపల్లి: విద్య, క్రీడల్లో రాణించడం ద్వారానే కీర్తి ప్రతిష్టలు పొందవచ్చని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి సందడిగా జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహించాలని అన్నారు. రెండు రోజులుగా నిర్వహించిన కరీంనగర్ నియోజకవర్గ స్థాయి కాసర్ల సుధాకర్‌రెడ్డి స్మారక క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం మారం స్వదేశీకుమార్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డీఈవో జనార్దన్‌రావు, ఎంఈవో మధుసూదనచారి, యూపీఎస్ హెచ్ఎం అశోక్‌రెడ్డి, దాత కాసర్ల జీవన్‌రెడ్డి, సర్పంచ్ గొట్టె జ్యోతి, ఎంపీటీసీ పండుగ గంగవ్వ, సీనియర్ సిటిజన్ లక్ష్మారెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల హిందీ పండిట్ వెంకటరమణ పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు.

ఆదాయ మార్గాలపై దృష్టి



సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మధు

కరీంనగర్ అర్బన్: పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో పాటు మార్కెట్‌కు ఆదాయమొచ్చేలా చర్యలుండాలని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ నిర్ణయించింది. బుధవారం మార్కెట్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు అధ్యక్షతన మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. యార్డులో ఉపయోగకరంగా లేని ఒక ఓపెన్ షెడ్‌ని ఫంక్షన్ హాల్‌గా మార్చి మార్కెట్ కమిటీకి ఆదాయం సమకూర్చాలని నిర్ణయించారు. అలాగే పండ్ల మార్కెట్‌లో నిర్మించబోయే రెండు నూతన షెడ్‌ల గురించి చర్చించారు. మార్కెట్ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, డైరెక్టర్లు కర్నాటి చలమయ్య, పబ్బతి రంగారెడ్డి, గుంటి రాజమల్లు, సోమిరెడ్డి లక్ష్మారెడ్డి, గోలి మల్లయ్య, గంగాధర లస్మయ్య, గుండేటి అనిత, చంద్రపల్కల అంజయ్య, బోనాల జనార్దన్, మహమ్మద్ మహమూద్ పాషా, విజయ్ కుమార్ ముండదా, శివనాథుని వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బావుల సర్వేను అడ్డుకున్న రైతులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లలో నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా నష్టపోతున్న వ్యవసాయ బావులు, పైపులైన్లను సర్వే చేసేందుకు బుధవారం గ్రామానికి వచ్చిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను రైతులు అడ్డుకున్నారు. భూ సేకరణలో భాగంగా గ్రామపరిధిలోని రైతులకు చెందిన వ్యవసాయబావులు, పైపులైన్ల వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, వర్క్ ఇన్‌స్పెక్టర్ సమ్మిరెడ్డిలు గ్రామానికి వచ్చారు. రోడ్డు నిర్మాణంతో నష్టపోతున్న భూముల్లోని వ్యవసాయబావులు, పైపులైన్లను సర్వే చేసేందుకు రైతులు సహకరించాలని ఏఈ అనూష కోరారు. అయితే రోడ్డు నిర్మాణానికి సంబంధించి ముందుగా హద్దులను నిర్ణయించిన తర్వాతనే సర్వే చేయాలంటూ పలువురు రైతులు ఏఈకి తేల్చి చెప్పారు. రైతులు సర్వే చేసేందుకు ఒప్పుకోకపోవడంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు.

యోగా ఈవెంట్‌లో 'సెయింట్ జార్జ్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: కర్ణాటక రాష్ట్రానికి చెందిన వర్షిణి యోగా ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ స్పోర్ట్స్ ట్రస్టు బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన 5వ జాతీయ స్థాయి యోగా ఈవెంట్‌లో కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ స్కూల్ చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. అండర్–15 విభాగంలో ధృతి జాతీయస్థాయిలో ప్రథమస్థానం, స్మృతిజ రెండో స్థానం, అండర్–10 విభాగంలో అద్వికానాత్ 4వ స్థానంలో నిలిచి సత్తా చాటినట్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో బుధవారం యోగా కోచ్ ప్రదీప్‌తో కలిసి విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు చురుకుగా ఉంటూ చక్కగా రాణించే అవకాశాలుంటాయమన్నారు.

ఉపాధిహామీ పని దినాలు పెంచాలి



మాట్లాడుతున్న కవ్వంపల్లి అజయ్

విద్యానగర్(కరీంనగర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పనిదినాలు పెంచి రోజు కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. పేద, మధ్య తరగతి రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అఖిల భారత సంఘాల పిలుపులో భాగంగా రాష్ట్రంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్, జిల్లా కమిటీ సభ్యులు జిట్టవేని మల్లయ్య, నాయకులు కొమ్మగల్ల బాబు, కసాడి పవన్‌కుమార్, గజ్జెల శ్రీహరి, అరెల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఒకినోవా కరాటే ఆధ్వర్యంలో వేములవాడలో ఇటీవల జరిగిన 3వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కరీంనగర్ మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ పాఠశాల చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. కటాస్, స్పారింగ్‌లో బంగారు, రజత పతకంతో పాటు ఐదు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

భూ సేకరణ పరిశీలన

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో బుధవారం బైపాస్ రోడ్డు భూ సేకరణను ట్రైనీ కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టోపో పరిశీలించారు. కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ కోసం భూసేకరణ చేస్తున్నారు. డీఐ రవీంద్రాచారి, సర్వేయర్ సంతోష్ ద్వారా భూసేకరణ వివరాలను తెలుసుకున్నారు. వెంట ఆర్డీవో హరిసింగ్, తదితరులు ఉన్నారు.

సమాచారం

18న సాయిబాబా ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని దేవాదాయ శాఖ పరిధిలో గల సాయినగర్ శ్రీవిజయగణపతి సాయిబాబా ఆలయంలో ఈనెల 18న ఉదయం 10 గంటలకు హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 20న టెంకాయలు, పూల దండలు, ఫొటోల విక్రయం, కొబ్బరి ముక్కల ప్రోగుకు సంబంధించిన వేలంను వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ పీటీసీ ఫీడర్ పరిధిలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాల, బుల్ స్టేషన్, కరీంనగర్ డెయిరీ, శ్రీహరినగర్, సంతోశ్‌నగర్, వినాయకనగర్, కుర్మవాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తపల్లి తహసీల్దార్‌గా వెంకట్‌రెడ్డి

- మూడు నెలలకే లక్ష్మీనరసింహారావు బదిలీ
- అవినీతి ప్రక్షాళన జరిగేనా..?



వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు, బదిలీ తహసీల్దార్

కొత్తపల్లి: కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా నల్ల వెంకటరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్‌రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అతడిని మంగళవారం రాత్రి కొత్తపల్లి తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతిమయంగా మారిన తహసీల్ కార్యాలయం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో తహసీల్దార్ బదిలీ చర్చనీయాంశంగా మారింది. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డికి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహారావు బాధ్యతలు అప్పగించగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐలు నర్సయ్య, అరుణ్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అవినీతి ప్రక్షాళన జరిగేనా..?

అవినీతి కూపంగా మారిన కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ప్రక్షాళన జరిగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన చిల్ల శ్రీనివాస్ ధరణి రికార్డుల గోల్‌మాల్‌తో పాటు అనేక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అతడిని కలెక్టర్ బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అతని స్థానంలో గందె లక్ష్మీనరసింహారావు బాధ్యతలు స్వీకరించారు. తహసీల్ ఆఫీసులో జరుగుతున్న కార్యకలాపాలు చూసి ఖంగుతున్న ఆయన ప్రక్షాళన దిశగా అడుగులు వేశారు. తొలుత డిప్యూటీ తహసీల్దార్ నవాజ్‌ను బదిలీపై పంపించి ఒక్కొక్కటిగా చక్కదిద్దే పనిలో పడ్డాడు. ఈ దశలో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్న తహసీల్దార్‌పై అవినీతిపరుల కన్ను పడింది. చిల్ల శ్రీనివాస్ విధులు నిర్వర్తించిన సమయంలోని ప్రతి ఫైల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా యంత్రాంగం నుంచి ఆదేశాలు రావడంతో అక్రమాల పుట్ట బయటకు వస్తుందన్న ఆందోళన అవినీతిపరుల్లో మొదలైంది. ఇతను ఇలాగే కొనసాగితే గతంలో జరిగిన అవకతవకలతో పాటు నిబంధనలకు మేరకు వ్యవహరిస్తుండటంతో ఎలాగైనా బదిలీ చేయాలని ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. తాను కూడా ఈ ముళ్లపాదలో పనిచేయలేనని, పదోన్నతులు, తదితర శాఖాపరమైన అంశాల్లో తనకెలాంటి ఇబ్బందులెదురవుతాయోనని భావించిన లక్ష్మీనరసింహారావు సంతోషంగా బదిలీని స్వీకరించినట్లు సన్నిహితుల ద్వారా తెలిసింది. కొత్త తహసీల్దార్ రాకతో ఇక అక్రమార్కుల ఆటలు సాగుతాయా.. అవినీతి ప్రక్షాళన జరుగుతుందా.. అన్న చర్చ ప్రజల్లో మొదలైంది.

కరీంనగర్‌రూరల్ తహసీల్దార్‌గా నారాయణ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌గా కె.నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తహసీల్దార్ నల్ల వెంకటరెడ్డిని కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం రాత్రి బదిలీ చేయగా ఆయన స్థానంలో కలెక్టరేట్ ఏవోగా పనిచేస్తున్న నారాయణను నియమించారు. తహసీల్దార్‌గా విధుల్లో చేరిన నారాయణను నాయబ్ తహసీల్దార్ శంకరయ్య, ఆర్ఐ రజనీకాంత్, మీ సేవా కేంద్రాల నిర్వాహకులు అశోక్, రాజేందర్, సత్యం, శ్రీధర్ తదితరులు కలిసి అభినందించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈ పరీక్ష పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో సూపరింటిండెంట్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈ ప్రశ్నాపత్రం లీకేజీతో 3 లక్షల మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నష్టం కాకుండా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కురెపల్లి శంకర్, రమేశ్, వినయ్, వినోద్, నాగరాజు, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వెసులుబాటు కల్పించండి



మాట్లాడుతున్న సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్: రంజాన్ మాసం సందర్భంగా తరావీహ్ నమాజ్ చేసుకునేందుకు, రాత్రి వేళల్లో వ్యాపార వర్గాలకు వెసులుబాటు కల్పించాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీలతో నిర్వహించిన పీస్ కమిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నమాజ్, ఇఫ్తార్ ఉపవాస దీక్ష ముగింపు సమయంలో మసీద్‌లకు ముస్లింలు తొందరగా వెళ్తారు కాబట్టి హెల్మెట్ కోసం ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేయకుండా సహకరించాలని అన్నారు. నగరంలోని కిరాణం షాపులు, చికెన్, మటన్ సెంటర్లు, పండ్ల దుకాణాలు, హోటళ్లు, హరీస్, హలీం స్టాళ్లు రాత్రి వేళల్లో నిర్వహించుకునేందుకు మినహాయింపు ఇవ్వాలన్నారు. తరావీహ్ నమాజ్ వేళల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖీల్ ఫిరోజ్ పాల్గొన్నారు.

నీరు వృథా చేయొద్దు

చొప్పదండి: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో బుధవారం క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ అప్పిడి సౌజన్య, ఎంపీటీసీ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని, వర్షం నీటిని ఇంకుడుగుంతలకు తరలించి, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాజు, అనుకారి సాయిక్రిష్ణ, శ్రవణ్, సంపత్, మధు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు ప్రశ్నించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): వినియోగదారులు కష్టపడి సంపాదించిన డబ్బులతో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు వాటి నాణ్యత, లోపాల విషయంలో ప్రశ్నించాలని కరీంనగర్ వినియోగదారుల మండలి గౌరవ సలహాదారు చంద్ర ప్రభాకర్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంలో జిల్లా, రాష్ట్రస్థాయి వినియోగదారుల కోర్టులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రకాశ్ హల్లా మాట్లాడుతూ వినియోగదారుల సేవలో కరీంనగర్ వినియోగదారుల మండలి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో మండలి అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి రఘురాం, దామోదర్, లక్ష్మణ్‌కుమార్, రామచంద్రారెడ్డి, ముజాఫర్, గంగాధర్, నారాయణ, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు అచ్చేసిన రామోజీని సభకు పిలిచి విచారించాలి

తప్పు కేశవ్‌దో.. రామోజీదో తేలాలి

సభా హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకోవాలి

- గవర్నర్‌ను అవమానించారంటూ ఈనాడు కథనంపై అధికారపక్ష సభ్యుల మండిపాటు
- గవర్నర్‌కు స్వాగతం పలికిన దృశ్యాల వీడియో సభలో ప్రదర్శన
- ఎల్లో మీడియా దుష్ప్రచారంపై సభలో ప్రత్యేక చర్చ జరపాలని విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: చట్ట సభను, రాజ్యాంగ వ్యవస్థను, గవర్నర్‌ను కించపరిచేలా అబద్ధాలను ఈనాడులో అచ్చేసి రామోజీరావు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని, ఆయన్ను సభకు పిలిచి విచారించి, కఠిన చర్యలు తీసుకోవాలని శాసనసభలో అధికారపక్షం డిమాండ్ చేసింది. సీఎం రాకకోసం గవర్నర్ వేచి ఉండాలా అని టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నట్టు ప్రస్తావిస్తూ ఈనాడు రాసిన తప్పుడు కథనంపై బుధవారం శాసనసభ అట్టుడికింది. గవర్నర్‌ను కించపరుస్తూ ఈనాడు అచ్చేసిన కథనంపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ కమిటీ విచారణ చేపట్టి కేశవ్ తప్పు మాట్లాడారా.. రామోజీ తప్పు రాశారా.. అనే విషయం తేల్చాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సభ్యులు పట్టుబట్టారు. ఈనాడు వార్త క్లిప్పింగ్‌లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించిన సభ్యులు.. ఎల్లో మీడియాను ఏకిపారేశారు. అలాంటి వ్యాఖ్యలు తాను చేయలేదని దమ్ముంటే నిరూపించాలని పయ్యావుల కేశవ్ అనడంపై అధికారపక్ష సభ్యులు మండిపడ్డారు. సభకు దమ్ము ధైర్యం అని సవాలు చేయవద్దని, కేశవ్ తప్పు మాట్లాడినా, ఈనాడు తప్పు రాసినా ప్రివిలేజ్ కమిటీ విచారణలో నిర్ధారణ అయితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ చర్చకు అడుగడుగునా టీడీపీ సభ్యులు అడ్డుతగలడంతో సభ దృష్టికి వాస్తవాలు తెచ్చేందుకు తొలిరోజున గవర్నర్‌కు స్వాగతం పలికిన వీడియోను ప్రదర్శించి సభ్యులకు వాస్తవాలు చూపించారు. అయినప్పటికీ పయ్యావుల కేశవ్ పదే పదే వాదనకు దిగడంతో గవర్నర్ విషయంలో ఆయన చేసిన కామెంట్ల వీడియో సైతం సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, అధికారపార్టీ నేతలు మాట్లాడారు.

రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే: మంత్రి బుగ్గన



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలకడంలో ప్రొటోకాల్ పాటించలేదంటూ అబద్ధపు రాతలు రాయడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా వెళ్లి గవర్నర్‌కు ఘనస్వాగతం పలికి సభలోకి తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్ ఉదయం 9.45 గంటలకు అసెంబ్లీకి వచ్చారు. 9.53కు గవర్నర్ వచ్చారు. గవర్నర్‌ను రిసీవ్ చేసుకున్న సీఎం 10.02 గంటలకు స్పీకర్ చాంబర్‌కు తీసుకొచ్చారు. గవర్నర్‌కు గొంతు ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన అభ్యర్థన మేరకు కొంత సేపు ఆగి ఆయన రెడీ అయిన తర్వాత గౌరవ సభలోకి తీసుకొచ్చాం. ప్రభుత్వ పనితీరు, విజన్‌ను గవర్నర్ చదివితే.. ఆ ప్రసంగాన్ని సైతం టీడీపీ సభ్యులు చాలా హేళన చేశారు. తప్పుడు వార్తలతో గౌరవ సభను, గవర్నర్‌ను అవమానిస్తూ కథనాలు రాసిన ఈనాడుపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్పీకర్‌ను కోరుతున్నా.

బీజేపీ.. ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుంది!

- ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లుతున్నారు
- బీజేపీ సమాధులు తవ్వితే బీఆర్‌ఎస్ పునాదులు వేస్తోంది
- మంచిర్యాల జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్‌రావు విమర్శలు



సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో హరీశ్‌రావు, ఇంద్రకరణ్, బాల్క సుమన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/చెన్నూరు: 'బీజేపీ ప్రజలను కాకుండా ఐటీ, ఈడీ, సీబీఐని నమ్ముకుని గెలవాలని చూస్తోంది. ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి, బురద జల్లి, అబద్ధాలను ప్రచారం చేస్తోంది' అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. బుధవారం ఆయన దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలసి మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతూ.. బీజేపీ చేసిన ఒక్క మంచి పని ఉందా? అని ప్రశ్నించారు. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడం, సంస్థలు అమ్మేయడం చేస్తోందని దుయ్యబట్టారు. ఇక్కడి రెండు బొగ్గు బ్లాకులను వేలం వేసి, సింగరేణిని అమ్మాలని చూస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. సమాధులు తవ్వే బీజేపీ కావాలో, పునాదులు వేసే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. అభయహస్తం వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రం నుంచి కరువును తరిమేశారని కొనియాడారు. చెన్నూరు ఎత్తిపోతలతో ఇక్కడి రైతాంగానికి రెండు పంటలకు అవకాశం కలుగుతుందని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు.

ఆ రాతలు గవర్నర్, సీఎంలను అవమానపరిచేవే..

- ఈనాడు రాతలను సీరియస్‌గా పరిగణించాలి
- స్పీకర్ తమ్మినేని సీతారాం రూలింగ్

సాక్షి, అమరావతి: సీఎం కోసం గవర్నర్ ఎదురు చూడాలా? అంటూ ఈనాడు పత్రికలో వచ్చిన కథనాన్ని చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గవర్నర్‌కు స్వయంగా ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికినప్పటికీ, అవాస్తవ అంశాలతో టీడీపీ సభ్యుడు పయ్యావుల కేశవ్ మాట్లాడినట్లుగా ఈనాడు ప్రచురించిన కథనంపై స్పీకర్ తమ్మినేని రూలింగ్ ఇస్తూ.. గవర్నర్, సీఎం పదవుల ఔన్నత్యాన్ని, మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌తో పాటు మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమానపరిచే ఆ రాతలపై స్పష్టమైన, కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం సభలో స్పీకర్ మాట్లాడుతూ.. ''గవర్నర్ కార్యక్రమంలో నేనే ప్రత్యక్ష సాక్షిని. సీఎం, నేను, మండలి చైర్మన్ వెళ్లి ఆయనను సగౌరవంగా రిసీవ్ చేసుకున్నాం. గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన డైరెక్షన్ ప్రకారమే గవర్నర్ స్పీకర్ చాంబర్ వద్ద ఆగి లోపలికి వచ్చి గొంతు సమస్యకు వేడి నీటిని తాగి సభకు బయలుదేరారు (గవర్నర్ కార్యాలయం డైరెక్షన్ వివరాలను స్పీకర్ సభలో చదివి వినిపించారు). వాస్తవం ఇలా ఉంటే, ఈ రోజు ఈనాడులో తప్పుడు కథనం చూశాక, ఇది చాలా సీరియస్‌గా పరిగణించాల్సిన అంశం అని భావిస్తున్నాను. మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను అవమాన పరిచే ఈ రాతలను సభ సీరియస్‌గా తీసుకుంటుంది. గవర్నర్ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కాదు. తప్పు కేశవ్‌దా, పత్రికదా అనే విషయం ప్రివిలేజి కమిటీ సిఫార్సులు సూచిస్తాయి. ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రివిలేజి కమిటీ హియరింగ్స్ తర్వాత తప్పనిసరిగా సభలో ప్రకటన చేస్తాను. ఆ మాటలు మాట్లాడిన సభ్యుడు అన్నీ ప్రివిలేజి కమిటీ ముందు చర్చించవచ్చు'' అని చెప్పారు.

పేపర్ లీక్‌పై ఉద్యమించండి

- రాష్ట్ర బీజేపీకి అధిష్టానం ఆదేశం!
- లీక్‌పై అధ్యయనానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని, కమిషన్ నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టాలని రాష్ట్ర నాయకత్వానికి బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశించినట్టు సమాచారం. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన ఉద్యోగాల భర్తీ విషయంలో కేసీఆర్ సర్కార్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా వివిధ రూపాల్లో ఆందోళన, ఇతర కార్యక్రమాలను చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నది విద్యార్థి లోకం, యువతరమే కాబట్టి, వీరి మద్దతును కూడగట్టే దిశలో ముందుకెళ్లాలని జాతీయ నాయకత్వం ఆదేశించినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా జాతీయ పార్టీ ఆదేశాలతో కదిలిన రాష్ట్ర నాయకత్వం.. లీకేజీ వ్యవహారంపై అధ్యయనానికి వివిధ రంగాల్లో అనుభవమున్న పార్టీ నేతలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సీహెచ్ విఠల్ కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో.. మాజీ ఐఏఎస్ చంద్రవదన్, మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్, లీగల్ కేసుల్లో అనుభవమున్న ఎస్.రామచంద్రరావు, కరుణా గోపాల్, ఎన్‌డీఎంఏ మాజీ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, జర్నలిస్ట్ ఎస్.కుమార్ సభ్యులుగా ఉన్నారు.

నేడు టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ... : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన గురువారం పార్టీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ కానుంది. లీకేజీ అంశంపై ఎలా ముందుకెళ్లాలి? ఏయే విషయాలపై దృష్టి కేంద్రీకరించాలి? సాంకేతిక అంశాలు ఎలా పరిశీలించాలి? తదితర అంశాలపై చర్చించనున్నారు. లీకేజీలో ఎవరెవరి ప్రమేయముందో తేల్చడంతో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన ఆందోళన కార్యక్రమాలు ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

టీఎస్‌పీఎస్సీ ఎదుట ఆందోళన చేసిన బీజేవైఎం కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న వాళ్లను వదిలేసి న్యాయం కోసం పోరాడుతున్న వారిని అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయని, అందుకు కారకులైన వారిని వదిలేసి పోరాడుతున్న వారిపై కేసులు పెట్టడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. లీకేజీ అంశంపై ప్రభుత్వం 'సిట్'ఏర్పాటు చేయడాన్ని సంజయ్ తప్పుపట్టారు. గతంలో నయీం కేసు, డ్రగ్స్ కేసు, డేటా చోరీ సహా సిట్‌కు అప్పగించిన కేసులన్నీ నీరుగారిపోయాయని గుర్తుచేశారు.

ప్రశ్నించే వారి గొంతునొక్కడమేంటి: డీకే అరుణ

పోటీ పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతగాని కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేమిటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఓ ప్రకటనలో నిలదీశారు.

ఏపీని విడగొట్టింది కేసీఆర్ కాదు... కాంగ్రెస్

బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడగొట్టింది కేసీఆర్ కాదని, కాంగ్రెస్ పార్టీ అని బీఆర్‌ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఏపీని కాంగ్రెస్ విడగొడితే బీజేపీ సహకరించిందని, వైసీపీ, టీడీపీ లేఖలు ఇచ్చాయని గుర్తు చేశారు. కర్నూల్, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం తెలంగాణ భవన్‌లో తోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టిన కేసీఆర్ పార్టీలో ఎందుకు చేరారని కొందరు తనను అడుగుతున్నారని, అందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేసీఆర్ గొంతెత్తారని వివరించారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఊహించని విధంగా అభివృద్ధి చెందిందని కొనియాడారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ తరహా అభివృద్ధి ఏపీలో కావాలని అక్క డి ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే పలు వురు నాయకులు తమ పార్టీలో చేరుతున్నార ని చెప్పారు. కార్యక్రమంలో కర్నూల్ కార్పొరేటర్ ముస్తాక్, సాయితేజ్, రామాపురం ప్రకాశం, ఎంఆర్‌పీఎస్ కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలపై ఫిర్యాదు చేసిన షర్మిల



రేఖాశర్మకు వినతి పత్రం ఇస్తున్న షర్మిల తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ : బీఆర్‌ఎస్ నేతలపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో బుధవారం జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మను వైఎస్సార్ టీపీ నాయకులతో పాటు వైఎస్ షర్మిల కలిశారు. ఈ సందర్భంగా తనను బీఆర్‌ఎస్ నేతలు అసభ్యకరంగా దూషించిన వీడియోలను మహిళా కమిషన్‌కు చూపించారు. మహిళలనే గౌరవం బీఆర్‌ఎస్ పార్టీకి లేదని, పాదయాత్ర చేస్తున్న తనపై దాడులకు దిగుతున్నారని, బహిరంగంగా ఎలా బయట తిరుగుతావో చూస్తాం అంటూ బెదిరిస్తున్నార ని రేఖా శర్మ వివరించారు. తెలంగాణలో మహి ళలకు గౌరవం, రక్షణ లేదని...ఆడవాళ్లంటే వ్రతాలు చేసుకోవాలని మంత్రి కేటీఆర్ వ్యా ఖ్యానిస్తున్నారని షర్మిల తెలిపారు. ప్రజా సమస్యలను తను ఎత్తి చూపిస్తే శిఖండి అని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని షర్మిల మండిపడ్డారు. తను ఇచ్చిన ఫిర్యాదుపై రేఖా శర్మ సానుకూలంగా స్పందించారని.. అసభ్యకర పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారని మీడియాకు తెలిపారు.

ఇక వృద్ధులతో సంఘాలు



మహిళా సంఘం సమావేశం(ఫైల్)

- కొనసాగుతున్న సర్వే.. కరీంనగర్ జిల్లాలో 2వేలకు పైగా అవకాశం

ప్రస్తుతం మండలాల వారీగా గుర్తించిన సంఖ్య	
కరీంనగర్ రూరల్	1,300
కొత్తపల్లి	1,240
గంగాధర	1,800
రామడుగు	1,200
గన్నేరువరం	1,200
ఇల్లందకుంట	960
మానకొండూరు	1,000
శంకరపట్నం	1,980
హుజూరాబాద్	1,200
చిగురుమామిడి	1,100
వీణవంక	1,660
సైదాపూర్	1,800
తిమ్మాపూర్	1,000
చొప్పదండి	1,200
జమ్మికుంట	1,800

కరీంనగర్ అర్బన్: మహిళా సంఘాల్లో ఇకపై వృద్ధులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 60ఏళ్లు పైబడిన వారితో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో గ్రామాల్లో సర్వే ప్రారంభమైంది. గ్రామంలో ఎంత మంది ఉన్నారు, ఎన్ని సంఘాలు ఏర్పడే అవకాశాలున్నాయనే కోణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. గ్రామాల్లో పేద మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించేందుకు రూపొందించిన స్వయం సహాయక సంఘాల్లో 60 ఏళ్లు దాటిన వారిని పక్కన పెడుతున్న సంగతి తెలిసిందే. దీంతో రుణాలు సక్రమంగా చెల్లించినా వయస్సు నిబంధన కారణంగా తిరిగి రుణాలు పొందలేకపోతున్నారు. ఇది గుర్తించిన ప్రభుత్వం తాజాగా వృద్ధులకు ప్రత్యేకంగా సంఘాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో వృద్ధ మహిళల గుర్తింపు ప్రక్రియ చేపట్టింది. మహిళా సంఘాలు, వృద్ధ మహిళా సంఘాలు, దివ్యాంగుల మహిళా సంఘాలు ఏర్పాటు చేసేలా సర్వే సాగుతోంది.

సంఘాల ఏర్పాటు ఇలా

- జాతీయ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు ప్రతిపల్లెలో 60 ఏళ్లు నిండిన మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్చుతారు. వారి ద్వారా పొదుపు ప్రక్రియ చేపట్టేలా అవగాహన కల్పిస్తారు.
- స్వయం సహాయక సంఘాలకు చెందిన యాప్‌లో వారి పేర్లు నమోదు చేసి బ్యాంకు ఖాతాలు తెరిపిస్తారు. ఇతర సంఘాల మాదిరిగా గ్రూపు సమావేశాలు నిర్వహిస్తారు. సభ్యుల కోరిక మేరకు పొదుపు చేసే వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటారు.
- ఇప్పటికే మహిళా సంఘాల్లో కొనసాగుతున్న వారిని వయస్సు నిండిన వెంటనే గ్రూపుల నుంచి తొలగించి వృద్ధుల సంఘాల్లో చేరుస్తారు. ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు ఉండేలా చూడటంతో పాటు ఎవరైనా సభ్యులు మరణించినా, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా గ్రూపులో మరో సభ్యురాలిని చేర్చేలా కంప్యూటర్‌కు అనుసంధానిస్తారు.
- మెరుగైన ప్రతిభ చూపుతున్న సంఘాలకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేసేలా యాప్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళల పొదుపు, రుణాలు, హాజరు, నెలవారీ సమావేశాలు, నిర్వహణ రికార్డుల అమలు, రుణాల చెల్లింపులపై నియంత్రణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.
- జిల్లాలో స్వయం సహాయక సంఘాలు 16వేలకు పైగా ఉండగా 1.90 లక్షల మంది వరకు సభ్యులు ఉన్నారు. వీరిలో 60 ఏళ్లు నిండి రుణ అర్హత కోల్పోతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటివరకు 18వేలకు పైగా మందిని గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 2వేలకు పైగా సంఘాలు ఏర్పడనున్నాయి.
- ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నారు. 60ఏళ్లు పైబడిన వారిని గుర్తించి త్వరలో సంఘాల ఏర్పాటు తర్వాత ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆర్థిక పురోభివృద్ధి తోడ్పాటు ఉంటుందని అధికారులు వివరించారు.

'భట్టి' పాదయాత్ర విజయవంతం చేయాలి

- నేడు పిప్రి వద్ద ప్రారంభం
- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు, వేదికపై సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి నుంచి గురువారం ప్రారంభం కానున్న సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కోరారు. ఇచ్చోడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పిప్రిలో గురువారం సాయంత్రం 4 గంటలకు కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పాదయాత్రను పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే ప్రారంభిస్తారని తెలిపారు. ఈ యాత్రలో ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, నదీం జావిద్‌తో పాటు పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఇచ్చోడలో కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. అనంతరం భట్టి ఇచ్చోడలోనే బస చేస్తారని పేర్కొన్నారు. 17న ఉదయం ఇచ్చోడ నుంచి మాదాపూర్ మీదుగా సిరికొండ వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. రాత్రి అక్కడే బసచేసి 18న ఉదయం ఇంద్రవెల్లి నుంచి ఉట్నూర్‌కు చేరుకుంటారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 240 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత, టీపీసీసీ సభ్యులు అశోక్, గజేందర్, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ నర్సయ్య, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పట్టణంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ప్రేంసాగర్‌రావు మాట్లాడారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఖానాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పీసీసీ ప్రధాన కార్యదర్శి రవళిరెడ్డి, జెడ్పీటీసీ చారులత రాథోడ్, గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్ పాల్గొన్నారు.

అటవీ సంపదను పరిరక్షించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానంద్



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న సీసీఎఫ్‌వో శర్వానంద్

ఇంద్రవెల్లి: అటవీ సంపదను పరిరక్షించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానంద్ అన్నారు. మండలకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. హరితహారంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హరితహారంలో భాగంగా అటవీశాఖ ద్వారా ఈ ఏడాది జిల్లాలో 30 లక్షల మొక్కల నాటే లక్ష్యం ఉన్నట్లు తెలిపారు. వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు జిల్లా వ్యాప్తంగా 12 చెక్‌డ్యాంలను నిర్మించినట్లు చెప్పారు. ఆయన వెంట డీఎఫ్‌వో రాజశేఖర్, ఎఫ్‌డీవో బర్నోబా, ఎఫ్‌ఆర్‌వో రత్నాజాడే శీలానంద్, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌ఓఆర్‌పై వర్క్‌షాప్‌కు సింగరేణి ఉద్యోగులు



వర్క్‌షాప్‌కు హాజరైన ఉద్యోగులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిజర్వేషన్ అమల్లో భాగంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్‌ఓఆర్) పాలసీపై ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. న్యూ ఢిల్లీలోని హోటల్ పార్క్ ఇన్ బైరెడీషన్‌లో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌కు సింగరేణి కంపెనీ నుంచి ఆరుగురు ఉద్యోగులు హాజరయ్యారు. వీరిలో ఏ.భీమా(డీవైఎస్ఈ, ఎస్టీపీపీ, ఎస్సార్పీ), బీ.మోహన్(సీనియర్ అండర్ మేనేజర్, భూపాలపల్లి), టీ.వీరన్న(ఈఈ, ఈఅండ్ఎం, కొత్తగూడెం), బందెల చందర్‌రావు (హెచ్‌ఓఎం, ఎంవీటీసీ, భూపాలపల్లి), డేగల ప్రవీణ్‌కుమార్(ఫిట్టర్, ఎస్సార్పీ), ఆరుముల్లా కృష్ణ (టబ్ రిపేర్‌మేస్త్రీ, మందమర్రి) ఉన్నారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఆర్‌ఓఆర్ చట్టం, అమలుపై అవగాహన కల్పిస్తున్నారని డీవైఎస్ఈ భీమా తెలిపారు.

వైభవంగా ఏకాంతోత్సవం

- ముగిసిన ధర్మపురి నృసింహుని బ్రహ్మోత్సవాలు



ఉగ్రనృసింహస్వామికి ఏకాంతోత్సవం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అతిముఖ్యమైన, చివరి ఘట్టం ఏకాంతోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది.ఉగ్రనృసింహస్వామికి ఏకాంతోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసచారి, రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సభ్యులు పాల్గొన్నారు.

నృసింహుని ఆదాయం రూ.అరకోటి

శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 3న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. వేడుకలకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు 13రోజుల పాటు జరిగిన ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.అరకోటికిపైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా దాదాపు 40వేల మంది భక్తులకు దాతలు అన్నదానం చేశారు. చిరువ్యాపారులకూ మంచిఉపాధి లభించింది. కాగా, బుధవారం జరిగిన స్వామి వారి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

అమ్మ కోసం తీర్థయాత్ర



అమ్మవారిని దర్శించుకునేందుకు తల్లితో వచ్చిన కృష్ణకుమార్

భైంసా: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన కృష్ణకుమార్ తన తల్లి కోసం తీర్థయాత్ర చేపట్టారు. తన తండ్రి మరణించడంతో ఒంటరిగా బాధపడుతున్న తల్లికి దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు చూపించాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకుగాను తన తండ్రి ఇచ్చిన స్కూటర్‌పై అమ్మతో కలిసి తీర్థయాత్ర చేపట్టారు. బుధవారం బాసరకు చేరుకుని సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అవివాహితుడైన 44 ఏళ్ల కృష్ణకుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తుండగా, 73 ఏళ్ల తల్లితో కలిసి 2018లో ×మాతృ సేవ సంకల్పయాత్ర¤ పేరిట మైసూర్‌లోని చాముండేశ్వరి ఆలయం నుంచి యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తిరుపతి, కశ్మీర్‌లోని ప్రముఖ క్షేత్రాలు దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. అమ్మ కోసం తీర్థయాత్ర చేపట్టిన కృష్ణకుమార్ గురించి తెలుసుకున్న బాసర ఆలయ అర్చకులు, అధికారులు, స్థానికులు ఆయనను అభినందించారు.


నిక్ జాస్మిన్



ఈశాన్యంలో విరిసిన జాస్మిన్

● ఆకాశ మార్గాన ఔషధ సేవ...

**రోడ్లు బాగుండవు
వాతావరణం సరిగా ఉండదు.
అదీ గాక గంటల కొద్దీ
ప్రయాణించే సమయం ఉండదు.
అలాంటప్పుడు ప్రాణం పోసే
మందులు అందాలంటే?
డ్రోన్లే దారి.
అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన
నిక్ జాస్మిన్ మొత్తం ఈశాన్య రాష్ట్రాలకే
మొదటి మహిళా డ్రోన్ ఆపరేటర్.
గాల్లో మందులు పంపే ఈ సవాలును
ఆమె సమర్థంగా స్వీకరించింది.**


నిక్ జాస్మిన్

ఈ సన్నివేశం ఎప్పుడూ జరిగేదే. రోడ్డు కూడా సరిగా లేని అటవీ ప్రాంతాల్లో విషజ్వరాలు పాకుతాయి. రోగి కదల్లేడు. అంబులెన్స్ రావడానికి సమయం పడుతుంది లేదా రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యి దగ్గరిలోని ఆస్పత్రికి వెళ్లాలన్నా గంటలు గంటలు పడుతుంది. లేదా ఏదో వాగు పొంగి రోడ్డు బ్లాక్ అవుతుంది. కొండ చరియలో, చెట్ల కొమ్మలో విరిగి పడతాయి. సరైన మందు పడితే రోగి ప్రాణాలు దక్కుతాయి. అప్పుడు ఏం చేయాలి?

డ్రోన్ల ద్వారా మందులు చేరవేయడం సరైనదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహనకు వచ్చాయి. ఇందుకు అనేక స్టార్టప్ కంపెనీలు, డ్రోన్ల తయారీ సంస్థలు ప్రతిపాదనలు చేశాయి. సేవారంగంలో ఉన్న సంస్థలు కూడా ప్రభుత్వంతో భాగస్వామ్యం అవుతున్నాయి. దాంతో డ్రోన్ల ద్వారా మందుల పంపిణీ రెండేళ్ల క్రితం నుంచి ఉత్సాహంగా జరుగుతోంది. తెలంగాణలోని వికారాబాద్‌లో 'మెడిసిన్ ఫ్రమ్ ది స్కై' కార్యక్రమం మొదలెట్టడం అందరికీ గుర్తే.

ఈశాన్య రాష్ట్రాలలో డ్రోన్లు

ఈశాన్య రాష్ట్రాలలో కొండ ప్రాంతాలకు, మారుమూల ప్రాంతాలకు ప్రాణాధార మందులు సకాలంలో చేరవేయడం ఎప్పుడూ సవాలే. కొండ దారుల్లో ప్రయాణం ఆలస్యం అవుతుంది. అదీ గాక వాహనాలు వెళ్లలేని చోట్ల కూడా ఆదివాసీలు నివాసాలు ఉంటారు. వీళ్లను కాపాడాలంటే సరైన సమయంలో మందులు చేరవేయడం చాలా అవసరం. అందుకే 'సస్టెయినబుల్ యాక్సెస్ టు మార్కెట్ అండ్ రిసోర్సెస్ ఫర్ ఇన్నోవేటివ్ డెలివరీ ఆఫ్ హెల్త్ కేర్' (సమృధ్) సంస్థ ఐపిఇ గ్లోబల్, నీతి అయోగ్‌లతో కలిసి మరికొన్ని దాతృత్వ సంస్థల భాగస్వామ్యంతో 'మెడిసిన్ ఫ్రమ్ ది స్కై' ప్రాజెక్ట్‌లో భాగంగా అక్కడ డ్రోన్ల ద్వారా మందుల పంపిణీ మొదలెట్టింది. అరుణాచలప్రదేశ్‌లో సాగుతున్న ఈ కార్యక్రమంలో డ్రోన్ ఆపరేట్ చేస్తున్న తొలి మహిళ నిక్ జాస్మిన్ సేవలు అందిస్తోంది.

ఆమె మొదట పారాగ్లైడర్

అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు కమెంగ్ జిల్లా నుంచి నిక్ జాస్మిన్ డ్రోన్ల ద్వారా మందులు సరఫరా చేస్తుంది. ఇందుకోసం అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద మందులు నిల్వ చేసే మందులు నిల్వ చేసే ఫ్రీజర్లు, ఫ్రిజ్‌లు ఉన్న మినీ హెలిపాడ్ వంటి స్టేషన్ వద్ద ఆమె విధులు నిర్వర్తించాలి. యాప్ ద్వారా ఫలానా చోటుకు మందులు పంపాలి అనే సందేశం రాగానే స్పందించాలి. 'డ్రోన్లు 400 అడుగుల ఎత్తు నుంచి ప్రయాణం చేస్తాయి. 20 నుంచి 40 కిలోమీటర్ల దూరం వరకూ కచ్చితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకుంటాయి. రోజుకు పది ట్రిప్పులు వేయగలవు. మందుల ఉష్ణోగ్రతను మెయిన్‌టెయిన్ చేస్తూ ప్రయాణిస్తాయి. తమ సామర్థ్యాన్ని బట్టి బరువును మోస్తాయి' అని తెలిపింది నిక్.

'నేను ఎయిర్‌లైన్స్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. పారాగ్లైడింగ్ చేసేదాన్ని. మెడిసిన్ ఫ్రమ్ ది స్కై కోసం డ్రోన్ ఆపరేటర్ల ఉద్యోగం ఉందని తెలిసి అప్లై చేశాను. నా పారాగ్లైడింగ్ అనుభవం దృష్ట్యా ఉద్యోగం వచ్చింది' అని తెలిపింది నిక్.

ఊరు కదిలి వచ్చింది

ఈ ఉద్యోగం కోసం నిక్‌కు శిక్షణ ఇచ్చారు. 'డ్రోన్‌లోని అన్ని భాగాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. అవసరమైన మందులు జాగ్రత్తగా ప్యాక్ చేయడం, ప్రీ ఫ్లైట్ పరీక్షలు, గాలి స్థితి, ఆడియో పైలట్ సిస్టమ్, జీపీఎస్ ట్రాక్ ఇవన్నీ సక్రమంగా ఉన్నాయనుకున్నాక డ్రోన్‌ను బయలు దేరదీయాలి' అని తెలిపింది నిక్. ఆమె ఉద్యోగం మొదలెట్టిన రోజు ఆమెను చూడటానికి ఊరు ఊరంతా వచ్చింది. 'విమానాలు దగ్గరి నుంచి ఎగరడం మా ఊరి వాళ్లు చూడలేదు. ఒక బుల్లి విమానం లాంటిది పైగా ఒక అమ్మాయి ఎగుర వేయడం వారికి వింత. అందుకని ఊరంతా కదిలి వచ్చి చూసింది' అని నవ్వింది నిక్.

'ఇది సరదా ఉద్యోగం కాదు. చాలా బాధ్యత. నాకు ఈ ఉద్యోగం ఎంతో నచ్చింది' అని చెప్పిందామె.

●

**రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్
మొదలైన ప్రాంతాల్లో రాజులకు సంబంధించి
ఎన్నో విషయాలు వినిపిస్తుంటాయి.
ఆ ముచ్చట్లు 'రాజ కుటుంబాలు ఆకాశం దిగి
నేలకు రావు' అన్నట్లుగా ఉండేవి.
అదేమీ కాదని నిరూపించింది ఉదయ్‌పూర్
రాకుమారి పద్మజ కుమారి మేవార్.
ఆమెకు పల్లె గుండె తెలుసు.
పక్షులను, పచ్చదనాన్ని
ఎలా కాపాడుకోవాలో తెలుసు...**

సామాన్యుల రాకుమారి


రాకుమారి పద్మజ కుమారి మేవార్

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ రాజకుటుంబంలో పుట్టింది పద్మజ కుమారి మేవార్. అమ్మ, నాన్నమ్మల నుంచి ఎన్నో జానపద కథలు విన్నది. ఆ కథల్లో ఎన్నో అందమైన అడవులు, అపురూపమైన జంతుజాలం ఉండేవి. కాల్పనిక ప్రపంచం దాటి బయటికి వస్తే పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది.

అడవులు కన్నీళ్లు పెట్టుకుంటున్న దృశ్యాల గురించి నాన్న మాటల్లో ఎన్నోసార్లు విన్నది.

హైస్కూల్ చదువు నుంచి డిగ్రీ వరకు అమెరికాలో చదువుకున్న పద్మజ కుమారి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది.

చదువు పూర్తయిందో లేదో ఆమె 'భగీర' క్యాంపులోకి అడుగుపెట్టింది.

సామాజిక సేవా కార్యక్రమాల కోసం తల్లిదండ్రులు రాణి దుర్గేష్ నందిని, మహారాజా రాజేంద్రసింగ్ ఈ క్యాంపుకు శ్రీకారం చుట్టారు. ఈ క్యాంప్‌లోని గదులను స్థానికులే, స్థానికంగా దొరికే వనరులతో నిర్మించారు. గోద్వారీ ప్రాంతంలో ఉన్న ఈ క్యాంపు కేంద్రంగా వనసంరక్షణ, స్త్రీ సాధికారత, ఆరోగ్యం, జలసంరక్షణ... మొదలైన కార్యక్రమాలు చేపట్టారు.

పద్మజ కుమారి ఈ క్యాంప్‌లోకి అడుగు పెట్టిన తరువాత క్యాంపుకు కొత్త శక్తి వచ్చి చేరింది. ఆమెకు ఆ ప్రాంతంలో ప్రతి ఊరూ కొట్టిన పిండే.

గోద్వారీ ప్రాంతం 235 రకాల పక్షులకు, 35 రకాల ఔషధ మొక్కలకు నిలయం.

'మన దగ్గర అపూర్వమైన సంపద ఉంది. వాటిని పరిరక్షించుకోవాలి' అంటూ ఊరువాడా తిరిగింది. గిరిజన ప్రాంతాల్లో స్కూల్స్ మొదలుపెట్టడం ద్వారా పిల్లల్లో చైతన్యం తీసుకువచ్చింది.

సామాజిక చైతన్యానికి సంబంధించిన కార్యక్రమాలే కాదు స్థానికులకు ఉపాధి కల్పించే పనులకు శ్రీకారం చుట్టింది.

'ఈ క్యాంపులోకి అడుగు పెడితే ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. ఎంతో ధైర్యం వస్తుంది' అంటారు స్థానికులు.

ఇప్పుడు వారికి రకరకాల పక్షుల పేర్లు, వాటి పుట్టు పూర్వోత్తరాలు, ఔషధ మొక్కల పేర్లు, వాటి ఉపయోగాలు తెలియడం మాత్రమే కాదు వాటిని ఎలా కాపాడుకోవాలో కూడా బాగా తెలుసు.

'పెద్ద చదువులు చదువుకున్నావు. ఇక్కడికి ఎందుకు తల్లీ' అని తల్లిదండ్రులు అనలేదు. అదే తనకు మహాబలం అయింది.

ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలు తిరిగిన పద్మజ కుమారికి, సామాజికసేవలో కొత్త ప్రపంచం కనిపించింది. ఎన్నో లక్ష్యాలు ఏర్పడ్డాయి. అందులో ఒకటి వైల్డ్‌లైఫ్ టూరిజం కేంద్రంగా గోద్వారీ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని.


స్థానికుల స్పందన, చైతన్యం పద్మజ కుమారి సంకల్పబలం చూస్తుంటే అదేమీ కష్టం కాదు అనిపిస్తుంది.

●

మల్టీ టాలెంట్

**కళలకు సాంకేతిక విషయాలు చాలా దూరం అని
కొద్దిమంది నమ్ముతారు.
'అదేమీ కాదు' అనే ఎంతోమంది నిరూపిస్తుంటారు.
అలాంటి వారిలో ఒకరు వైశాలిని పాలివాల్.
కథక్ నృత్యం, గానం, పెయింటింగ్‌లలో ప్రతిభ ఉన్న
వైశాలిని ఎంటర్‌ప్రెన్యూర్‌గా అంతర్జాతీయ స్థాయిలో
పేరు తెచ్చుకుంటోంది...**




వైశాలిని పాలివాల్

జెట్‌స్పీడ్ ట్రబుల్ షూటర్

చిన్న వయసు నుంచే కథక్ నృత్యం, పెయింటింగ్, గానంలో ప్రతిభ చూపుతున్న వైశాలిని పాలివాల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవుతుందని ఎవరూ అనుకోలేదు. వైశాలినికి కళల పట్ల ఉండే అమితమైన ఆసక్తి దీనికి కారణం.

పుణెకు చెందిన వైశాలి ఐఐటీ–రూర్కీ(ఉత్తరాఖండ్)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేసింది. చదువులో ఎంత ప్రతిభ ప్రదర్శించేదో ఆటపాటల్లో కూడా అంతే!

చదువు పూర్తయిన తరువాత డెవలపర్‌గా తన సాఫ్ట్‌వేర్ కెరీర్‌ను ప్రారంభించింది. మోటరోలాలాంటి ఎన్నో ప్రసిద్ధ కంపెనీలలో పనిచేసింది. ఆ సమయంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లు ఎదుర్కొనే సమస్యలపై లోతైన అవగాహన వచ్చింది.

ఒకానొక రోజు తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాలని నిర్ణయిం తీసుకుంది. వేరే సమయంలో అయితే ఇది పెద్ద విషయం కాకపోవచ్చు... కాని అది కరోనా కాలం. పెద్ద పెద్ద కంపెనీలే కుప్పకూలుతున్న కాలం.

'బంగారంలాంటి ఉద్యోగాన్ని వదులుకొని రిస్క్ చేయడం ఎందుకు?' అన్నవాళ్లే ఎక్కువ.


వైశాలిని పాలివాల్ వేసిన పెయింటింగ్స్

'ఏ రిస్క్ చేయకపోవడమే అతి పెద్ద రిస్క్' అనేమాట ఆమెకు తెలియనిదేమీ కాదు కదా!

రంగంలోకి దిగింది.

పుణె, సిలికాన్‌వ్యాలీ కేంద్రంగా 'జీపీ.ఏఐ' పేరుతో డిజిటల్ ఎక్స్‌పీరియెన్స్ అండ్ అబ్జర్వబుల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది. 'ఫిక్స్ వాట్ మ్యాటర్ విత్ జీపీ' అనేది కంపెనీ నినాదం.

'ఏ ధైర్యంతో ముందుకు వెళ్లావు?' అనే ప్రశ్న వచ్చినప్పుడు–

'ఆత్మస్థైర్యం' అని సమాధానం వినిపిస్తే ఇక తిరుగులేదనే. వైశాలిని నోటి నుంచి కూడా ఈ జవాబే వినిపించింది.

ఒక ఇ–కామర్స్ కంపెనీ, పేమెంట్ యాప్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యను మెరుపు వేగంతో పరిష్కరించి తనదైన గుర్తింపు తెచ్చుకుంది జీపీ.ఏఐ

'జీపీ' అనే పదానికి వేగం, తాజాదనం, ప్రకాశవంతం, శక్తిమంతం అనే అర్థాలు ఉన్నాయి. కంపెనీ పనితీరులో ఈ అర్థాలు ప్రతిఫలించి వేగంగా దూసుకుపోయేలా చేశాయి.

పాపులర్ ప్రాడక్ట్స్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ 'ప్రాడక్ట్ హంట్' నిర్వహించిన సర్వేలో 'జీపీ.ఏఐ' నెంబర్‌వన్‌గా నిలిచింది. ప్రాడక్ట్ వాల్యూ రావడంతో అమెరికా నుంచి ఐరోపా వరకు ఎన్నో ప్రాంతాలలో కంపెనీ దూసుకుపోయింది.

'ఒక సమస్య పరిష్కారం విషయానికి వస్తే ఎలా పరిష్కరించాం అనే విషయంతో పాటు ఎంత వేగంగా పరిష్కరించాం అనేదాన్ని పరిగణలోకి తీసుకుంటాను. పెద్ద బృందం మాత్రమే కాదు సింగిల్ డెవలపర్ కూడా పరిష్కరించాలనుకుంటాను' అంటుంది వైశాలిని.

కోడింగ్ ప్రపంచంలోకి వెళ్లి లాజికల్ ఎర్రర్, నెట్‌వర్క్ ఎర్రర్... మొదలైన వాటి గురించి అధ్యయనం చేసే వైశాలిని ప్రతి యూజర్ అనుభవాన్ని తన కేస్‌స్టడీగా చేసుకుంటుంది.

కోడ్స్‌ను కనెక్ట్ చేసుకోవడం అనేది తన విధానం. 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అనే కోణంలో డాట్స్‌ను కనెక్ట్ చేసుకొని సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. పరిష్కారాన్ని కనుగొంటుంది.

'ఆర్థిక మాంద్యం దూసుకువచ్చే ప్రమాదం ఉంది అంటున్నారు కదా...' అనే ప్రశ్న పూర్తికాకుండానే ఇలా జవాబు ఇస్తుంది వైశాలిని...

'సానుకూల కోణంలో చూస్తే ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన గురించి తాను తెలుసుకునే విలువైన అవకాశం లభిస్తుంది. ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఎలా ముందుకు వెళ్లాలి? అనే దాని గురించి అవగాహన ఏర్పర్చుకోవడానికి ఉపకరిస్తుంది'

ఇది సరే, కథక్ నృత్యం, చిత్రకళ, గానం మాటేమిటి?!

'ఎంత బిజీగా ఉన్నా వాటికి దూరంగా జరిగేదే లేదు. వీటి ద్వారా నేను రిలాక్స్ అవుతాను. జటిలమైన సాంకేతిక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు వెదకడానికి ఆ శక్తులు ఉపయోగపడతాయి' అంటుంది వైశాలిని పాలివాల్.

●

బ్యూటిప్స్



చర్మం మృదువుగా, ముడతలు పడకుండా, మచ్చలు ఏర్పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్‌ను ఉపయోగించాలి. దీనిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

ఒక కప్పు పెరుగు, టేబుల్‌స్పూన్ ఆరెంజ్ జ్యూస్, టేబుల్‌స్పూన్ నిమ్మరసం ఒక గిన్నెలోకి తీసుకుని, బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. తర్వాత సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రంగా కడిగేయాలి.

ఇంటిప్

కడగండి కానీ పారబోయకండి



అన్నం వండేముందు మనం బియ్యాన్ని రెండు మూడుసార్లు కడుగుతాం కదా... మొదటిసారి కడిగిన నీళ్లను పారబోయాలి. రెండోసారి కడిగిన నీళ్లను పారబోయకూడదు. వీటినే బియ్యం కడుగు నీళ్ల అంటాం. ఇది ఎన్నో పోషకాలున్న ద్రవపదార్థం. ఈ బియ్యం కడుగు నీళ్లను తాగుతుంటే.. మూత్రం సులభంగా విడుదల అవుతుంది. మూత్రకోశ వ్యాధులూ రావు. అంతేకాదు, బీ 12 సమృద్ధిగా లభిస్తుంది.

సైబర్ టాక్

మెసేజ్ లింక్స్‌తో జాగ్రత్త..!


ప్రతీకాత్మక చిత్రం

ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే పూర్ణిమ(పేరుమార్చడమైనది) ప్రతి పైసా జాగ్రత్తగా ఖర్చుపెడుతుంది. రాత్రి పడుకునే ముందు సోషల్‌మీడియా అకౌంట్స్‌తో పాటు, మెయిల్‌కి వచ్చిన నోటిఫికేషన్స్ చూడటం అలవాటు. వాటిలో తన ఆఫీసు నుంచి, స్నేహితుల నుంచి వచ్చిన మెసేజ్‌లకు రిప్లై చేసింది. అదే సమయంలో మరో మెసేజ్ వచ్చింది. గోల్డ్‌స్కీమ్‌కి సంబంధించిన సమాచారం అది. ఆసక్తిగా అనిపించడంతో దానిని ఓపెన్ చేసింది. ఆ స్కీమ్‌లో చేరితే తక్కువ ధరలో బంగారం కొనుగోలు చేయవచ్చు. అది, పేరున్న కంపెనీ వెబ్‌సైట్ నుంచి వచ్చింది. లిమిటెడ్ టైమ్‌లో వచ్చిన ఆఫర్ అది. మంచి అవకాశాన్ని ఎందుకు వదులుకోవడం అని, అప్లికేషన్‌లో తన వివరాలను పొందుపరిచి, సెండ్ చేసింది. మిగతావి ఏమైనా ఉంటే రేపు చూసుకుందాం అని ఫోన్ పక్కన పెట్టేసి పడుకుంది. ఉదయం పనిచేసుకుంటూనే ఫోన్ చేతిలోకి తీసుకుంది. వచ్చిన బ్యాంక్ మెసేజ్‌లు చూసి షాక్ అయ్యింది. యాభై వేల రూపాయలు డెబిట్ అయినట్టుగా బ్యాంక్ మెసేజ్ అది. నిన్నరాత్రి ఆ డబ్బు ట్రాన్స్‌ఫర్ అయింది. స్కీమ్‌లో చేరినట్టుగా వివరాలు ఇచ్చింది కానీ, బ్యాంక్ అకౌంట్స్‌కి సంబంధించిన సమాచారం ఏమీ ఇవ్వలేదు తను. తన డబ్బు మరెలా పోయినట్టు? మెయిల్ ఐడీలో ఉన్న కస్టమర్ కేర్‌కి మెసేజ్ చేసింది. ఫోన్ చేసింది. కానీ, ఎలాంటి సమాచారమూ లేదు.

●●●

పూర్ణిమ మాదిరే చాలామంది మెసేజ్‌లు లేదా మెయిల్స్‌కు వచ్చిన ఆకర్షణీయమైన పథకాలతో ఉన్న లింక్స్‌ను ఓపెన్ చేయడం, వాటి ద్వారా మోసాలకు గురికావడం అతి సాధారణంగా జరుగుతున్నాయి. దీనికి కారణం అధికారిక కంపెనీల నుంచి వచ్చినట్టుగా మెసేజ్ లింక్స్ ఉండటం ప్రధాన కారణం.

●●●

ఈ రోజుల్లో స్పూఫింగ్ అనేది మన భద్రత, గోప్యతకు తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తుంది. ఈ రకమైన దాడుల గురించి తెలుసుకోవడం, వాటి నుండి తమను తాము రక్షించుకోవడానికి అందరం సిద్ధపడాల్సిన సమయం ఇది. పేరున్న కంపెనీల పేరుతో అధికారిక వెబ్‌సైట్లనుంచి వచ్చినట్టు మెసేజ్‌లు మెయిల్స్‌కు వస్తుంటాయి. అయితే, వాటిలో ఏవి కరెక్ట్ అనేది పెద్ద సంశయం.

ఇలాగే, క్రెడిట్ కార్డ్ నంబర్లు, ఓటీపీ, లాగిన్ ద్వారా మోసగాళ్లు మన సమాచారాన్ని బయటపెట్టేలా చూస్తుంటారు. లాటరీ వచ్చింది, డబ్బు డిపాజిట్ చేయడానికి బ్యాంక్ వివరాలు ఇవ్వమని అడగడం, ఓటీపీ చెప్పమని కోరడం, బ్యాంక్ లేదా ఏదైనా ఇతర సంస్థ నుండి ఫోన్ కాల్స్ చేస్తుంటారు. ఈ కాల్స్ ద్వారా బ్యాంకుకు సంబంధించిన సమాచారాన్ని మనం బయటపెట్టేలా మోసం చేసే అవకాశం ఉంది. మనలో నమ్మకాన్ని కలిగించడానికి సులువైన, ఆకర్షణీయమైన పద్ధతులను మోసగాళ్లు ఎంచుకుంటారు కాబట్టి, మనమే జాగ్రత్త వహించాలి.

ఇ-మెయిల్ ద్వారా..

ఫేక్ మెయిల్ ఐడీతో మన ఇన్‌బాక్స్‌లో ఓ మెసేజ్ వస్తుంది. అది వేరొకరి నుండి వచ్చినట్లు కనిపిస్తుంది. ఇది సాధారణంగా ఫిషింగ్ దాడులలో ఉపయోగించబడుతుంది, ఇక్కడ దాడి చేసే వ్యక్తి సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేయడానికి లేదా హానికరమైన సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేయడానికి, మోసగించడానికి ప్రయత్నిస్తాడు.

- పంపినవారి ఇ–మెయిల్ చిరునామా అనుమానాస్పదంగా ఉండచ్చు. ఉదాహరణకు.. మనకు వచ్చిన ఫేక్ మెయిల్ ఐడీలో లెక్కకు మించి, అక్షర దోషాలు లేదా వింత భాష ఉండచ్చు. గమనించాలి.
- మోసపూరిత ఇ–మెయిల్‌లు ఎలా ఉంటాయంటే.. తరచుగా క్రెడిట్ కార్డ్ నంబర్లు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు లేదా పాస్‌వర్డ్‌ల వంటి వ్యక్తిగత సమాచారం కోసం రిక్వెస్ట్‌లు కోరుతుంటాయి.
- ఇ–మెయిల్‌లోని అనుమానాస్పద లింక్‌లు చట్టబద్ధమైన వెబ్‌సైట్‌లా కనిపించే నకిలీ వెబ్‌సైట్‌కి దారితీయవచ్చు. లేదా అవి అసాధారణమైన అక్షరాలను కలిగి ఉండవచ్చు. లేదా వేరే వెబ్‌సైట్‌కి దారి మళ్లించవచ్చు.

ఫోన్ ద్వారా దాడులు

- ఫోన్ ద్వారా దాడులకు పాల్పడే వ్యక్తులు ఉంటారు. వీరు వినియోగదారుడిని రకరకాల ఆకర్షణీయ పథకాల ద్వారా అతని వ్యక్తిగత, బ్యాంకు వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- మీ ఫోన్‌కి బయటి దేశాల నుంచి కూడా ఫోన్‌లు వస్తుంటాయి.
- మీకు తక్కువ సమయంలో ఎక్కువ కాల్స్ వచ్చినా, పగలు లేదా రాత్రి అసాధారణ సమయాల్లో మీకు కాల్స్ వచ్చినా, అది కాలర్ ఐడీ స్పూఫింగ్‌కు సంకేతం కావచ్చు.
- మీరు గుర్తించని కంపెనీలు లేదా వ్యక్తుల నుండి అయాచిత కాల్స్‌ను స్వీకరిస్తే, అది కాలర్ ఐడీ స్పూఫింగ్‌కు సంకేతం కావచ్చు.
- కాలర్ ఐడీ స్పూఫింగ్ తరచూ క్రెడిట్ కార్డ్ నంబర్లు లేదా సామాజిక భద్రతా నంబర్ల వంటి వ్యక్తిగత సమాచారం కోసం రిక్వెస్ట్‌లు ఉంటాయి.
- ఫోన్ కాల్‌లో అవతలి వారి మాటల్లో ఏ మాత్రం క్వాలిటీ లేకపోయినా, కాల్ సమయంలో అసాధారణ శబ్దాలు లేదా అంతరాయాలు ఉంటే, అది కాలర్ ఐడీ స్పూఫింగ్‌కు సంకేతం కావచ్చు.

●

ఇలా సురక్షితం...

- అపరిచిత ఇ–మెయిల్‌లు, మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి.
- బ్రౌజర్ అడ్రస్ బార్‌లో లాక్ గుర్తు ఉండదు. అడ్రస్ బార్‌పై అక్షరాల్లో చిన్న చిన్న తేడాలు ఉంటాయి. ఈ చిన్న అక్షరాలను కూడా గమనించాలి.
- యుఆర్‌ఎల్ అక్షరాలు సరిగా ఉన్నా డిజైన్‌లలో కూడా తేడాలు ఉంటాయి. గమనించాలి.
- బ్యాంక్, డిజిటల్ రెండు రకాల కార్యకలాపాలకు రెండు కారకాల ఫోన్ ప్రమాణీకరణను ప్రారంభించడం శ్రేయస్కరం.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) పురుషుల టోర్నీలో బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ-నిక్కీ పునాచా (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ రిత్విక్-నిక్కీ పునాచా ద్వయం 6-1, 6-3తో జేకబ్ బ్రాడ్‌షా (ఆస్ట్రేలియా)-బోరిస్ బుతుల్యా (సెర్బియా) జోడీని ఓడించింది. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిక్కీ గత ఏడాది ఐటీఎఫ్ సర్క్యూట్‌లో విశేషంగా రాణించి ఏడు డబుల్స్ టైటిల్స్, ఈ ఏడాది ఒక డబుల్స్ టైటిల్‌ను సాధించారు.

'టాప్' ర్యాంక్‌లో అశ్విన్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన టాప్ ర్యాంక్‌ను పటిష్టం చేసుకున్నాడు. అహ్మదాబాద్‌లో ఆసీస్‌తో 'డ్రా'గా ముగిసిన నాలుగో టెస్ట్‌లో అశ్విన్ 91 పరుగులిచ్చి ఆరు వికెట్లు తీసుకున్నాడు. గతవారం జేమ్స్ అండర్సన్ (ఇంగ్లండ్)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచిన అశ్విన్ తాజా ప్రదర్శనతో అండర్సన్‌ను రెండో ర్యాంక్‌కు నెట్టేసి ఒంటరిగా టాప్ ర్యాంక్‌లో నిలిచాడు.

నిఖత్‌పైనే దృష్టి

నేటి నుంచి ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్



నిఖత్ లవ్లీనా

న్యూఢిల్లీ: సొంతగడ్డపై 'పసిడి పంచ్' కొట్టాలనే లక్ష్యంతో భారత స్టార్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనుంది. బుధవారం ప్రారంభోత్సవ వేడుకలు జరగ్గా... నేటి నుంచి బౌట్‌లు మొదలవుతాయి. 50 కేజీల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ తొలి రౌండ్‌లో అనాఖానిమ్ ఇస్మెయిలోవా (అజర్‌బైజాన్)తో తలపడుతుంది. నిఖత్‌తోపాటు సాక్షి చౌదరీ (52 కేజీలు), ప్రీతి (54 కేజీలు), నుపుర్ (ప్లస్ 81 కేజీలు) తొలి రోజు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. గాయం కారణంగా భారత జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. 70 కేజీల విభాగంలో సనామాచ చాను స్థానంలో శ్రుతి యాదవ్ జట్టులోకి వచ్చింది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు)కు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. 65 దేశాల నుంచి 324 మంది బాక్సర్లు ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

గాయత్రి-ట్రెసా జోడీ సంచలనం

- ఎనిమిదో ర్యాంక్ ద్వయంపై విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి
- తొలి రౌండ్‌లోనే సింధు పరాజయం
- ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీ



ట్రెసా జాలీ
పుల్లెల గాయత్రి

బర్మింగ్‌హామ్: కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంక్ జోడీ గాయత్రి-ట్రెసా జాలీ 21-18, 21-14తో ఎనిమిదో ర్యాంక్ జోంగ్‌కోల్ఫాన్ కితితారాకుల్-రవీంద ప్రజోంగ్‌జై (థాయ్‌లాండ్) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 46 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో గాయత్రి, ట్రెసా పూర్తి సమన్వయంతో ఆడి ఆద్యంతం తమ ఆధిపత్యం చాటుకున్నారు. గతంలో ఈ థాయ్‌లాండ్ జోడీతో ఆడిన నాలుగు సార్లూ ఓటమి పాలైన గాయత్రి-ట్రెసా ఐదో ప్రయత్నంలో మాత్రం విజయఢంకా మోగించారు. గత ఏడాది ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్ చేరి సంచలనం సృష్టించిన గాయత్రి-ట్రెసా ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ ఫకుషిమా-సయాకా హిరోటా (జపాన్)లతో తలపడతారు.

మళ్లీ తొలి రౌండ్‌లోనే...



సింధు

ఈ ఏడాది భారత స్టార్ షట్లర్ పీవీ సింధు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. వరుసగా మూడో టోర్నమెంట్‌లోనూ ఆమె తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 9వ ర్యాంకర్ సింధు 17-21, 11-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ జాంగ్ యి మాన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. 39 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు పలుమార్లు అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. తొలి గేమ్‌లో ఒకదశలో సింధు 16-13తో ఆధిక్యంలోకి నిలిచింది. ఈ దశలో జాంగ్ యి మాన్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు గెలిచింది. 13-16 నుంచి జాంగ్ యి మాన్ 20-16తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం సింధు ఒక పాయింట్ గెలిచినా, ఆ వెంటనే జాంగ్ మరో పాయింట్ నెగ్గి తొలి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలో ఇద్దరు 5-5తో సమంగా ఉన్నారు. ఆ తర్వాత సింధు మళ్లీ తడబడి వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయింది. ఆ తర్వాత సింధు తేరుకోలేకపోయింది. ఇటీవల దక్షిణ కొరియాకు చెందిన తన వ్యక్తిగత కోచ్ పార్క్ తే సాంగ్‌తో విడిపోయిన సింధు ఈ ఏడాది మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్ టోర్నీల్లోనూ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ప్రస్తుతం తనకు ఎవరూ వ్యక్తిగత కోచ్ లేరని, త్వరలోనే కొత్త కోచ్‌ను నియమించుకుంటానని మ్యాచ్ అనంతరం సింధు వ్యాఖ్యానించింది.

శ్రమించిన శ్రీకాంత్

పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోవడానికి కష్టపడ్డాడు. టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 19-21, 21-14, 21-5తో గెలుపొందాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 21-13, 21-13తో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ (భారత్) ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

బెంగళూరు బోణీ...

- ఆరో మ్యాచ్‌లో తొలి విజయం
- రాణించిన పెరీ, కనిక, రిచా



కనిక అహూజా

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ టి20 టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఎట్టకేలకు ఆరో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది. యూపీ వారియర్స్‌తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ 19.3 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. గ్రేస్ హారిస్ (32 బంతుల్లో 46; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలువగా... బెంగళూరు బౌలర్లు ఎలీస్ పెరీ (3/16), సోఫీ డివైన్ (2/23), శోభన ఆశ (2/27) యూపీ వారియర్స్‌ను కట్టడి చేశారు. అనంతరం బెంగళూరు జట్టు 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసి గెలిచింది. స్మృతి మంధాన (0) డకౌట్‌కాగా... కనిక అహూజా (30 బంతుల్లో 46; 8 ఫోర్లు, 1 సిక్స్), రిచా ఘోష్ (32 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించి బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించారు. బెంగళూరు విజయానికి 16 పరుగుల దూరంలో కనిక అవుటైనప్పటికీ రిచా అజేయంగా నిలిచి తమ జట్టును గెలుపు తీరానికి చేర్చింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ X గుజరాత్
రాత్రి గం. 7:30 నుంచి
స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి) ఆశ (బి) సోఫీ డివైన్ 1; దేవిక (ఎల్బీడబ్ల్యూ) (బి) సోఫీ డివైన్ 0; నవ్‌గిరే (సి) రిచా (బి) ఆశ 22; తాలియా (సి) రిచా (బి) షుట్ 2; గ్రేస్ హారిస్ (సి) రిచా (బి) ఎలీస్ పెరీ 46; సిమ్రన్ (సి) కనిక (బి) ఆశ 2; దీప్తి శర్మ (సి) శ్రేయాంక (బి) ఎలీస్ పెరీ 22; శ్వేత (బి) ఎలీస్ పెరీ 6; సోఫీ ఎకిల్‌స్టోన్ (రనౌట్) 12; అంజలి శర్వాణి (సి) కనిక (బి) శ్రేయాంక 8; రాజేశ్వరి (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 135. వికెట్ల పతనం: 1-1, 2-2, 3-5, 4-29, 5-31, 6-100, 7-101, 8-112, 9-133, 10-135. బౌలింగ్: సోఫీ డివైన్ 4-0-23-2, మేగన్ షుట్ 4-0-21-1, రేణుక 2-0-20-0, శోభన ఆశ 4-0-27-2, పెరీ 4-0-16-3, శ్రేయాంక 1.3-0-21-1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సోఫీ డివైన్ (సి) తాలియా (బి) గ్రేస్ హారిస్ 14; స్మృతి (బి) దీప్తి శర్మ 0; పెరీ (సి) ఎకిల్‌స్టోన్ (బి) దేవిక 10; హీథెర్ నైట్ (సి) కిరణ్ నవ్‌గిరే (బి) దీప్తి శర్మ 24; కనిక (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 46; రిచా (నాటౌట్) 31; శ్రేయాంక (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (18 ఓవర్లలో 5 వికెట్లకు) 136. వికెట్ల పతనం: 1-14, 2-14, 3-43, 4-60, 5-120. బౌలింగ్: గ్రేస్ హారిస్ 3-0-28-1, దీప్తి శర్మ 4-0-26-2, రాజేశ్వరి 4-0-35-0, సోఫీ ఎకిల్‌స్టోన్ 4-0-20-1, అంజలి శర్వాణి 1-0-4-0, దేవిక 2-0-19-1.

'షూటౌట్'లో భారత్ గెలుపు

ఆస్ట్రేలియాకు మరో ఓటమి



రూర్కెలా: సొంతగడ్డపై ప్రొ హాకీ లీగ్ దశను భారత పురుషుల జట్టు విజయంతో ముగించింది. ఆస్ట్రేలియా జట్టుతో బుధవారం జరిగిన రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 'షూటౌట్'లో 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. అంతకుముందు నిర్ణీత సమయం పూర్తయ్యాక రెండు జట్లు 2-2తో సమఉజ్జీగా నిలిచాయి. రెగ్యులర్ టైమ్‌లో భారత్ తరఫున వివేక్ సాగర్ ప్రసాద్ (2వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (47వ ని.లో)... ఆస్ట్రేలియా తరఫున నాథన్ ఎఫ్రామ్స్ (37వ ని.లో), టిమ్ హోవర్డ్ (52వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 'షూటౌట్'లో తొలి ఐదు షాట్‌లలో భారత్ నుంచి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్ సఫలమవ్వగా... హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్ విఫలమయ్యారు. ఆస్ట్రేలియా తరఫున జేక్ హార్వీ, క్రెయిగ్ మర్రైస్, జాక్ వెల్చ్ గోల్స్ చేయగా... జేక్ వెటన్, నాథన్ ఎఫ్రామ్స్ గురి తప్పారు. దాంతో 'షూటౌట్'లో రెండు జట్లు 3-3తో సమంగా నిలిచాయి. 'సడెన్‌డెత్'లో తొలి షాట్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచగా... ఆస్ట్రేలియా ప్లేయర్ జాక్ వెల్చ్ షాట్‌ను భారత గోల్‌కీపర్ శ్రీజేశ్ నిలువరించడంతో టీమిండియా విజయం ఖాయమైంది.

సినిమా

వెయ్యిన్నొక్క జిల్లాల వరకు...



● రవితేజ

'వెయ్యిన్నొక్క జిల్లాల వరకు వింటున్నాము నీ కీర్తినే.. ముల్లోకాల ఏ మూల ఉన్నా నీ అందాల సంకీర్తనే' అని పాడుతున్నారు రావణాసుర. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'రావణాసుర'. సుశాంత్ కీ రోల్ చేసిన ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లు. రవితేజ, అభిషేక్ నామా నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఈ చిత్రంలోని 'వెయ్యిన్నొక్క జిల్లాల..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. వెంకటేశ్ 'సూర్య ఐపీఎస్' చిత్రంలోని 'వెయిన్నొక్క జిల్లాలకు..' పాటకు ఇది రీమిక్స్ వెర్షన్. అప్పట్లో ఈ పాటకు 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి లిరిక్స్ అందించారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో అనురాగ్ కులకర్ణి ఈ లేటెస్ట్ వెర్షన్‌ను పాడారు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.

ఓ భారతీయుడిగా గర్వపడుతున్నాను



- ఎన్టీఆర్

''ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషం ఇచ్చింది. అదొక అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్. మాటల్లో వర్ణించలేని అనుభూతి. ప్రేక్షకుల అభిమానం, ప్రేమ, ఆశీర్వచనాల మూలంగానే ఆస్కార్ అవార్డు సాధించడం సాధ్యమైంది. ఇండస్ట్రీ సహకారం కూడా తోడుగా నిలిచింది. 'రౌద్రం..రణం ..రుధిరం' (ఆర్ఆర్ఆర్) మూవీని ప్రోత్సహించిన ప్రతి భారతీయుడికి ధన్యవాదాలు'' అని ఎన్టీఆర్ అన్నారు. ఈ నెల 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13)న లాస్ ఏంజిల్స్‌లో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. సంగీత దర్శకుడు కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్ ఈ అవార్డును అందుకున్నారు. అవార్డ్ ప్రదానోత్సంలో పాల్గొన్న ఎన్టీఆర్ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ – ''మనకు అవార్డు వచ్చినందుకు ఓ భారతీయుడిగా, ఓ తెలుగువాడిగా గర్వపడుతున్నాను. వేదికపై కీరవాణిగారు, చంద్రబోస్‌గారు అవార్డును అందుకున్న క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. ఆస్కార్ వచ్చిన విషయాన్ని నేను తొలిసారిగా నా భార్య (లక్ష్మీప్రణతి)తో పంచుకున్నాను. అలాగే నేను ఆస్కార్ అవార్డును పట్టుకున్నప్పుడు ఈ దేశం ఎంత బరువుందో అవార్డు కూడా అంత బరువున్నట్లుగా అనిపించింది'' అని అన్నారు. ఈ పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాట్లాడుతూ– ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు'పాటకు స్టాండింగ్ ఒవేషన్ దక్కగానే నాకు కన్నీళ్లు వచ్చాయి. ఆస్కార్ అవార్డు దక్కిన తర్వాత కీరవాణిగారు నన్ను ఆలింగనం చేసుకున్నారు. నేను ఆస్కార్ ప్రదానోత్సవంలో పాల్గొనడం అనేది 'ఆర్ఆర్ఆర్' సపోర్ట్ వల్లే సాధ్యమైంది'' అన్నారు. మరోవైపు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఈ పాట కోసం జరిగిన గూగుల్ సెర్చ్ వెయ్యి శాతానికిపైగా పెరిగిందని జపాన్‌కు చెందిన ఓ సంస్థ పేర్కొంది. కాగా ప్రస్తుతం జపాన్‌లో 'ఆర్ఆర్ఆర్' ఇంకా ప్రదర్శితమవుతున్న సంగతి తెలిసిందే.

రంగమార్తాండ వచ్చేస్తున్నాడు



● ప్రకాశ్ రాజ్

థియేటర్స్‌కు రావడానికి రెడీ అయ్యాడు రంగ మార్తాండ. ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రంగ మార్తాండ'. కృష్ణవంశీ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ''ఈ మార్చి 22న రంగమార్తాండుడి జీవన నాటకం..' అని పేర్కొన్నారు దర్శకుడు కృష్ణవంశీ. రాహుల్ సిప్లిగంజ్, అనసూయ భరద్వాజ్, ఆదర్శ్ బాలకృష్ణ, శివాత్మిక రాజశేఖర్ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం అందించారు. మరాఠీ ఫిల్మ్ 'నటసామ్రాట్'కు తెలుగు రీమేక్‌గా 'రంగమార్తాండ' రూపొందింది.

మీటర్ అలాంటి ప్రయత్నమే - కిరణ్




● రమేష్, కిరణ్

''ఏ కథానాయకుడైనా పెద్ద కమర్షియల్ హీరో అవ్వాలంటే అన్ని రకాల సినిమాలు చేయాలి. నేను కూడా అలా ఒకటి ప్రయత్నించాను.. అదే 'మీటర్' అని కిరణ్ అబ్బవరం అన్నారు. రమేష్ కాదూరి దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదలకానుంది. సాయి కార్తీక్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చమక్ చమక్ పోరి..' అనే పాటని అభిమానుల మధ్య థియేటర్‌లో విడుదల చేశారు. ''అందరూ ఏప్రిల్ 7న మా సినిమా చూసి పెద్ద విజయం అందించాలి'' అన్నారు చిరంజీవి (చెర్రీ). ''సమ్మర్‌కి కూల్‌గా ఉండే సినిమా 'మీటర్'' అన్నారు రమేష్ కాదూరి. ఈ వేడుకలో సంగీత దర్శకుడు సాయి కార్తీక్, ఆర్ట్ డైరెక్టర్ జేవీ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలు తీయబడును

చైతన్యరావు, లావణ్య హీరో హీరోయిన్లుగా చెందు ముద్దు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. 'ఇచ్చట అందమైన ఫోటోలు తీయబడును' అనేది ఉపశీర్షిక. బిగ్‌బెన్ సినిమాస్‌పై యశ్ రంగినేని నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేసి, సినిమా హిట్ సాధించాలని ఆకాంక్షించారు. చైతన్యరావు మాట్లాడుతూ –''ఇప్పుడున్న



● సురేష్ బాబు, చైతన్య

ఫాస్ట్‌లైఫ్ నుంచి దూరంగా ప్రేక్షకులను 1980 నేపథ్యంలోకి తీసుకువెళ్లే సినిమా ఇది'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథే ఈ చిత్రం. కథలో ఉన్న ట్విస్ట్‌లు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను అలరిస్తాయి'' అన్నారు చందు. ''ఫన్, థ్రిల్లింగ్, క్రైమ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిర్మాత యశ్ రంగినేని.

ఇతనే చెంగారెడ్డి



● జోజు జార్జ్

వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నూతన దర్శకుడు ఎన్.శ్రీకాంత్ రెడ్డి ఓ సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఎస్.నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని చెంగారెడ్డి పాత్రలో మలయాళ నటుడు జోజు జార్జ్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేసింది చిత్రయూనిట్. ''పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో వైష్ణవ్ తేజ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. 'జోసెఫ్, నాయట్టు, ఇరాట్ట' వంటి మలయాళ హిట్ ఫిల్మ్స్‌లో నటించిన జోజు జార్జ్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

పల్లెటూరుని సహజంగా సృష్టించాం

- అవినాష్ కొల్ల



''దసరా' కథకు తగ్గట్టు భారీ విలేజ్ సెట్ వేశాం. ఇల్లు, స్కూల్, మైదానం, బార్.. ఇలా ఐదు వందల మంది నివసించే పల్లెటూరుని సహజంగా సృష్టించాం. 98 శాతం షూటింగ్ ఈ సెట్‌లోనే జరిగింది'' అని ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల అన్నారు. నాని హీరోగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కీర్తీ సురేశ్ హీరోయిన్. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ అవుతోంది. ఈ మూవీ ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల మాట్లాడుతూ– ''నానీ గారితో 'కృష్ణగాడి వీర ప్రేమగాథ, జెర్సీ, శ్యామ్ సింగరాయ్' సినిమాలు చేశాను. నాకు పేరు వచ్చే కంటెంట్ ఉన్న సినిమాలు నానీగారి వల్లే వచ్చాయి. ఆయన గత సినిమాలతో పోల్చితే 'దసరా' చాలా డిఫరెంట్ మూవీ. సంస్కృతి పరంగా 25 ఏళ్ల క్రితం నాటి ఊరు ఇందులో కనిపిస్తుంది. ఈ సెట్ కోసం గోదావరిఖని రిఫరెన్స్ తీసుకున్నా. దాదాపు 22 ఎకరాల్లో రెండున్నర నెలలు 800మందికిపైగా పనిచేసి సెట్ వేశాం. శ్రీకాంత్ ఓదెలకి తొలి సినిమా అయినా అన్ని విషయాలపై చాలా క్లారిటీ ఉంది. ప్రస్తుతం శంకర్– రామ్ చరణ్‌గారి మూవీ, నానీగారి 30వ చిత్రం, అఖిల్ 'ఏజెంట్' సినిమాలు చేస్తున్నాను'' అన్నారు.

గౌరవిస్తుంటే భయంగా ఉంది

- వేణు ఎల్డండి



''బలగం' సినిమా తర్వాత నా క్లోజ్ ఫ్రెండ్స్ కూడా నన్ను అరేయ్ అని పిలవటం లేదు. సరదాగా జోకులు వేసుకుని తిరిగే బ్యాచ్ సడెన్‌గా గౌరవం ఇస్తుంటే చాలా కొత్తగా, భయంగా ఉంది. దాన్ని జీర్ణించుకోవటానికి కాస్త సమయం పడుతుంది'' అని డైరెక్టర్ వేణు ఎల్డండి అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు వేణు ఎల్డండి మాట్లాడుతూ– ''నేను 20 ఏళ్లుగా నటిస్తున్నాను. రెండు వందల సినిమాలు చేసినా మంచి కమర్షియల్ సక్సెస్ రాలేదు. నన్ను నేను ప్రమోట్ చేసుకుందామని కథలు రాయడం మొదలుపెట్టాను. రొటీన్‌కి భిన్నంగా వెళ్లాలనిపించి 'బలగం' కథను తయారు చేసుకున్నాను. మా నాన్నగారు చనిపోయినప్పుడు జరిగిన కొన్ని ఘటనలు, నా లైఫ్‌లో నేను చూసిన సంఘటనలతో 'బలగం' రాసుకున్నాను. చిరంజీవిగారు మా సినిమా గురించి మాట్లాడటం ఆనందంగా అనిపించింది. ఇకపై నన్ను డైరెక్టర్‌గా, యాక్టర్‌గానూ చూస్తారు'' అన్నారు.

మిథునం నిర్మాత ఇక లేరు



● ఆనందరావు

'మిథునం' వంటి మంచి చిత్రాన్ని నిర్మించిన ముయిద ఆనందరావు (57) ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. విజయనగరం జిల్లా రేగిడి మండలం వావిలవలస గ్రామానికి చెందిన ఆనందరావు ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి, వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. సంఘ సేవకుడిగానూ మంచి గుర్తింపు పొందారాయన. సాహిత్యమంటే ఆయనకు మక్కువ. పర్యావరణ హిత పద్యాలను రాసి కోటిగాడు పేరుతో ప్రచురణ చేసేవారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మి కీలక పాత్రల్లో తనికెళ్ల భరణి దర్శకత్వంలో ఆనందరావు నిర్మించిన చిత్రం 'మిథునం'. 2012లో విడుదలైన ఈ సినిమా 2017లో నంది అవార్డును సొంతం చేసుకుంది. ఆనందరావు మృతితో వావిలవలస గ్రామంలో విషాదం అలముకుంది. ఆయనకు భార్య పద్మినితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆనందరావు మృతిపై విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. నేడు ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	344	57,556
నిఫ్టీ ▽	71	16,972

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్‌	11,351	▽	77
డోజోన్స్‌	31,632	▽	524
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,345	▽	293
డాక్స్‌	14,735	▽	496
షాంఘై	3,263	△	18
నికాయ్‌	27,229	△	7

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

హోండా 100 సీసీ షైన్‌



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్‌ సైకిల్, స్కూటర్‌ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) తాజాగా 100 సీసీ షైన్‌ 100 బైక్‌ను ఆవిష్కరించింది. మహారాష్ట్ర ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్‌ ధర రూ.64,900 ఉంది. డెలివరీలు మే నుంచి మొదలు కానున్నాయి. ఏడాదిలో 3 లక్షల యూనిట్ల విక్రయం లక్ష్యంగా చేసుకున్నట్టు కంపెనీ తెలిపింది. వచ్చే మూడు ఏళ్లలో దీనిని 6 లక్షల యూనిట్లకు తీసుకువెళతామని వివరించింది. దేశంలో టూవీలర్ల మార్కెట్లో 100 సీసీ విభాగం మూడింట ఒక వంతు కైవసం చేసుకుంది. ద్విచక్ర వాహనాలకు డిమాండ్‌ తిరిగి పుంజుకోవడంతో గుజరాత్‌ ప్లాంటులో కొత్త తయారీ లైన్‌ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు హోండా మోటార్‌సైకిల్, స్కూటర్‌ ఇండియా ఎండీ, ప్రెసిడెంట్, సీఈవో అట్సుషి ఒగటా తెలిపారు. షైన్‌ 100 రాకతో కంపెనీ చరిత్రలో తొలిసారిగా వచ్చే ఏడాది పూర్తి తయారీ సామర్థ్యంతో ప్లాంట్లు నడిచే అవకాశం ఉందన్నారు. దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో హెచ్‌ఎంఎస్‌ఐకి 35 శాతం వాటా ఉంది. 2024 మార్చినాటికి భారత్‌లో హోండా ఎలక్ట్రిక్‌ స్కూటర్‌ రంగ ప్రవేశం చేయనుంది.

యూపీఐలో కెనరా బ్యాంక్‌ రూపే క్రెడిట్‌ కార్డ్‌



హైదరాబాద్‌: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్‌ తన రూపే క్రెడిట్‌ కార్డులను యూనిఫైడ్‌ పేమెంట్‌ ఇంటర్‌ఫేస్‌ (యూపీఐ) పరిధిలోకి తీసుకొచ్చింది. బ్యాంక్‌ కస్టమర్లందరూ తమ యాక్టివ్‌ రూపే క్రెడిట్‌ కార్డ్‌ను యూపీఐకి అనుసంధానం చేసుకోవచ్చు. ఖాతా ఆధారిత యూపీఐ లావాదేవీల తరహాలోనే కార్డ్‌ని భౌతికంగా వినియోగించకుండానే చెల్లింపులు జరపవచ్చు. పీఓఎస్‌ మెషీన్‌లు లేని వ్యాపారులు యూపీఐతో అనుసంధానమైన రూపే క్రెడిట్‌ కార్డు కలిగి ఉన్న కస్టమర్ల నుంచి చెల్లింపులు పొందవచ్చు. దీనివల్ల చిన్న వ్యాపారులు తక్కువ ఖర్చుతో విక్రయాల టర్నోవర్‌ను, వ్యాపారాన్ని పెంచుకోవచ్చు.


బులియన్‌ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,902	▲	297
బంగారం (99.5 స్వచ్ఛత)	57,671	▲	297
వెండి (కిలో)	66,861	▲	685

శక్తికాంత్‌కు '2023 సెంట్రల్‌ బ్యాంకర్‌' అవార్డు

కీలక సవాళ్లను అధిగమించినట్లు ఇంటర్నేషనల్‌ పబ్లికేషన్‌ ప్రశంసలు



ముంబై: రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్‌ శక్తికాంతదాస్‌కు 'గవర్నర్‌ ఆఫ్‌ ది ఇయర్‌ 2023 అవార్డు' లభించింది. మహమ్మారి కరోనా సంక్షోభం, ఉక్రెయిన్‌పై రష్యా దాడి, భౌగోళిక ఉద్రిక్తతల వంటి అనిశ్చిత ఆర్థిక పరిస్థితుల్లో ఫైనాన్షియల్‌ మార్కెట్లను సమర్థవంతంగా నడిపిస్తున్నందుకుగాను ఇంటర్నేషనల్‌ పబ్లికేషన్‌ సెంట్రల్‌ బ్యాంకింగ్‌ శక్తికాంతదాస్‌ను ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికచేసింది. భారత దేశం నుంచి 2015లో మొట్టమొదటిసారి అప్పటి సెంట్రల్‌ బ్యాంక్‌ గవర్నర్‌ రఘురామ్‌ రాజన్‌కు ఈ అవార్డు దక్కింది. కీలక సమయాల్లో గవర్నర్‌ శక్తికాంత దాస్‌ పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని ఇంటర్నేషనల్‌ పబ్లికేషన్‌ తాజాగా పేర్కొంది. పేమెంట్‌ వ్యవస్థసహా పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన శ్రీకారం చుట్టారని తెలిపింది. కరోనా మహమ్మారిని ప్రస్తావిస్తూ, కీలక సవాలును భారత్‌ ఎదుర్కొనగలిగినట్లు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్‌ బ్యాంక్‌ గవర్నర్లు అందరూ భిన్నమైన ప్రాధాన్యతలను కలిగి ఉన్న ప్రభుత్వాలతో కలిసి పనిచేయడంలో సాధారణంగా కష్టాలు ఎదుర్కొంటుంటారని పేర్కొన్న పబ్లికేషన్, ఆయా సమన్వయ చర్యల్లో దాస్‌ చక్కటి ప్రగతి సాధించగలిగారని వివరించింది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో దాస్‌ మాట్లాడుతూ, వైరస్‌ను ఎదుర్కొనడానికి నిరంతర పోరాటం అవసరం అన్నారు. ఇటు సాంప్రదాయ పద్ధతుల్లో అటు అసాధారణమైన రీతిలో ఈ పోరాట చర్యలు ఉండాలన్నారు.

ఎగుమతులు.. మూడో నెలా మైనస్‌

- ఫిబ్రవరిలో 8.8 శాతం క్షీణత
- విలువలో 33.88 బిలియన్‌ డాలర్లు
- దిగుమతుల బిల్లు 51.31 బిలియన్‌ డాలర్లు
- వెరసి వాణిజ్య లోటు 17.43 బిలియన్‌ డాలర్లు



న్యూఢిల్లీ: ప్రపంచ, దేశీయ తాజా ఆర్థిక అనిశ్చితి పరిస్థితులకు భారత్‌ వస్తు ఎగుమతి, దిగుమతి గణాంకాలు అద్దం పడుతున్నాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే.. ఎగుమతులు వరుసగా మూడవ నెల ఫిబ్రవరిలోనూ వృద్ధిలేకపోగా క్షీణతనే నమోదుచేశాయి. 2022 ఇదే నెలతో పోల్చితే ఎగుమతుల విలువ 8.8 శాతం పడిపోయి, 33.88 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యింది. ఇక దిగుమతుల్లోనూ 8.21 శాతం క్షీణత నమోదుకావడం గమనార్హం. 2022 ఇదే నెలతో పోల్చితే ఈ విలువ 55.9 బిలియన్‌ డాలర్ల నుంచి 51.31 బిలియన్‌ డాలర్లకు పడిపోయింది. వెరసి అధికారిక గణాంకాల ప్రకారం ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు 17.43 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యింది.

ఏప్రిల్‌–ఫిబ్రవరి మధ్య...

2022–23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌–ఫిబ్రవరి మధ్య 11 నెలల్లో వస్తు ఎగుమతులు 7.5% పెరిగి, 406 బిలియన్‌ డాలర్లుగా నమోదయ్యింది. ఇదే కాలంలో దిగుమతులు 18.82% పెరిగి 653 బిలియన్‌ డాలర్లుగా నమోదైంది. వెరసి వాణిజ్యలోటు 247 బిలియన్‌ డాలర్లుగా ఉంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో భారత్‌ ఎగుమతుల విలువ 422 బిలియన్‌ డాలర్లు తాకాయి. 2022–23లో ఈ విలువను అధిగమిస్తున్నామన్న హర్షాతిరేకాలు భారత్‌ ఎగుమతి సంఘాల సమాఖ్య (ఎఫ్‌ఐఈఓ)సహా సంబంధిత వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

- 11 నెలల్లో పెట్రోలియం ప్రొడక్టులు, రసాయనాలు, ఫార్మా, ఎలక్ట్రానిక్‌ గూడ్స్, బియ్యం, రెడీమేడ్‌ దుస్తుల ఎగుమతులు పెరగ్గా, ఇంజనీరింగ్‌ గూడ్స్, రత్నాభరణాలు, కాటన్‌ యార్న్, ఫ్యాబ్రిక్స్, ప్లాస్టిక్, లినోలియం ఎగుమతులు క్షీణించాయి.
- పసిడి దిగుమతులు ఇదే కాలంలో భారీగా పడిపోయి, 45.12 బిలియన్‌ డాలర్ల నుంచి 31.72 బిలియన్‌ డాలర్లకు చేరాయి.
- ఇక క్రూడ్‌ ఆయిల్‌ దిగుమతుల బిల్లు 11 నెలల్లో 140.67 బిలియన్‌ డాలర్ల నుంచి 193.47 బిలియన్‌ డాలర్లకు ఎగసింది.

అంతర్జాతీయ బ్యాంకింగ్‌ సంక్షోభం!

- వారం రోజుల్లో మూతబడిన రెండు అమెరికన్‌ బ్యాంకులు
- తాజాగా క్రెడిట్‌ సూసీపైనా నీలినీడలు
- షేరు 27 శాతం పతనం



సాక్షి, బిజినెస్‌ డెస్క్‌: దాదాపు పదిహేనేళ్ల క్రితం తరహాలో అంతర్జాతీయంగా మరో బ్యాంకింగ్‌ సంక్షోభం ముప్పు ముంచుకు రాబోతోందా? అమెరికా, యూరప్‌వ్యాప్తంగా బ్యాంకుల పరిస్థితి చూస్తే అలాగే కనిపిస్తోందంటున్నారు విశ్లేషకులు. ఇప్పటికే వారం రోజుల వ్యవధిలో అమెరికాలో రెండు బ్యాంకులు మూతబడగా తాజాగా స్విట్జర్లాండ్‌కి చెందిన క్రెడిట్‌ సూసీ భవిష్యత్తుపై కూడా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. బ్యాంకులో మరింతగా ఇన్వెస్ట్‌ చేసేది లేదంటూ కీలక ఇన్వెస్టరు ప్రకటించడంతో క్రెడిట్‌ సూసీ షేర్లు బుధవారం 27 శాతం పతనమయ్యాయి. గత రెండేళ్లలో బ్యాంకు షేరు సుమారు 85 శాతం క్షీణించింది. డిఫాల్ట్‌ అయ్యే అవకాశాలు 40 శాతం మేర ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ కూడా అంతర్జాతీయ బ్యాంకింగ్‌ రంగం పరిస్థితులపై ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి.

సమస్యలతో సతమతం..

వాస్తవానికి క్రెడిట్‌ సూసీ గత కొన్నాళ్లుగా సమస్యలతో సతమతమవుతూనే ఉంది. 2019లో సంస్థ సీవోవో పియరీ ఆలివర్‌ కొందరు ఉన్నత స్థాయి ఉద్యోగులపై నిఘా పెట్టేందుకు ప్రైవేట్‌ డిటెక్టివ్‌ను నియమించుకున్నారు. అయితే సదరు డిటెక్టివ్‌ అనుమానాస్పద రీతిలో మరణించిన తర్వాత ఆలివర్‌ను క్రెడిట్‌ సూసీ తొలగించింది. ఇదంతా బ్యాంకు వ్యవహారంపై సందేహాలు రేకెత్తించింది. అటుపైన 2021లో ఆర్చిగోస్‌ క్యాపిటల్‌ అనే అమెరికన్‌ హెడ్జ్‌ ఫండ్‌ సంస్థ మూతబడటంతో దాదాపు 5 బిలియన్‌ డాలర్ల భారీ నష్టం మూటకట్టుకుంది. ఆ కంపెనీకి క్రెడిట్‌ సూసీ బ్రోకరేజి సర్వీసులు అందించేది. అటు పైన గ్రీన్‌సిల్‌ క్యాపిటల్‌ అనే మరో సంస్థ మూతబడటంతో.. దాని ప్రభావాల కారణంగా ఇన్వెస్టర్లు 3 బిలియన్‌ డాలర్ల దాకా నష్టపోయారు. గతేడాది ఫిబ్రవరిలో దాదాపు 100 బిలియన్‌ డాలర్ల పైగా డిపాజిట్లు ఉన్న 30,000 మంది పైచిలుకు ఖాతాదారులపై మనీలాండరింగ్, అవినీతి తదితర ఆరోపణలు రావడంతో సంస్థ ప్రతిష్ట మరింత మసకబారింది. దీంతో క్రమంగా డిపాజిట్ల విత్‌డ్రాయల్స్‌ మొదలయ్యాయి. 2019 నుంచి టాప్‌ లీడర్‌షిప్‌ ఇప్పటికి అనేక సార్లు మారింది. గతేడాది క్రెడిట్‌ సూసీ పెట్టుబడుల కోసం అన్వేషిస్తుండగా.. సౌదీ నేషనల్‌ బ్యాంక్‌ 1.5 బిలియన్‌ డాలర్లు ఇన్వెస్ట్‌ చేసింది. సంస్థలో మరింతగా ఇన్వెస్ట్‌ చేసే యోచన లేదని సౌదీ నేషనల్‌ బ్యాంక్‌ చైర్మన్‌ అమ్మార్‌ అల్‌ ఖుదైరీ ప్రకటించడం తాజాగా క్రెడిట్‌ సూజీ షేర్ల పతనానికి దారి తీసింది. 2018లో 16 స్విస్‌ ఫ్రాంకులుగా ఉన్న షేరు ప్రస్తుతం 1.70 ఫ్రాంకులకు (ఒక స్విస్‌ ఫ్రాంక్‌ విలువ సుమారు రూ. 89). పడిపోయింది.

మార్కెట్లలో ప్రకంపనలు..

ఇప్పటికే అమెరికాలో సిలికాన్‌ వ్యాలీ బ్యాంక్‌ (ఎస్‌వీబీ) మూతబడటం, తాజాగా క్రెడిట్‌ సూసీ పరిణామాలతో ఇతరత్రా బ్యాంకులపైనా ప్రభావం పడింది. బుధవారం పలు యూరోపియన్‌ బ్యాంకుల షేర్లు రెండంకెల స్థాయిలో క్షీణించాయి. ఫ్రాన్స్‌కు చెందిన సొసైటీ జనరల్‌ 12 శాతం, బీఎన్‌పీ పారిబా 10 శాతం, జర్మనీకి చెందిన డాయిష్‌ బ్యాంక్‌.. బ్రిటన్‌ సంస్థ బార్‌క్లేస్‌ బ్యాంక్‌ మొదలైనవి సుమారు 8 శాతం పడిపోయాయి. రెండు ఫ్రెంచ్‌ బ్యాంకుల్లోనూ కొంత సమయం పాటు ట్రేడింగ్‌ను నిలిపివేశారు. అటు అమెరికాలో బ్యాంకులూ అదే బాటలో పయనించాయి. ప్రధానంగా డిపాజిటర్లు ఎకాయెకిన డిపాజిట్లను వెనక్కి తీసుకునే రిస్కులు ఉన్న చిన్న, మధ్య రకం బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫస్ట్‌ రిపబ్లిక్‌ బ్యాంక్‌ 17 శాతం, ఫిఫ్త్‌ థర్డ్‌ బ్యాంకార్ప్‌ 6 శాతం, జేపీమోర్గాన్‌ చేజ్‌ 4 శాతం పతనమయ్యాయి.

17 వేల దిగువకు నిఫ్టీ

సెన్సెక్స్‌ నష్టం 344 పాయింట్లు



ముంబై: ఆరంభ లాభాలను కోల్పోయిన స్టాక్‌ సూచీలు వరుసగా అయిదోరోజూ నష్టపోయాయి. వడ్డీరేట్ల పెంపు భయాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, బ్యాంకుల ఆర్థిక స్థితిగతులపై ఆందోళనలు, అధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు మార్కెట్‌ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, టెలికాం షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్‌ 344 పాయింట్లు నష్టపోయి 57,556 వద్ద స్థిరపడింది. నిఫ్టీ గతేడాది(2022) అక్టోబర్‌ 11 తర్వాత తొలిసారి 17వేల స్థాయి దిగువన ముగిసింది. మొత్తంగా 71 పాయింట్లను కోల్పోయి 16,972 వద్ద నిలిచింది. మెటల్, ఫార్మా, వినిమయ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. డాలర్‌తో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. కాగా, ఐపీఓ ముగింపు నాటికి గ్లోబల్‌ సర్ఫేసెస్‌ 12.21 రెట్లు సబ్‌స్క్రైబ్‌ అయ్యింది. 77.49 లక్షల షేర్లను జారీ చేయగా, మొత్తం 9.46 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి.

డాక్టర్‌ అంజిరెడ్డి తొలి స్మారకోపన్యాసం..



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఫార్మా దిగ్గజం డాక్టర్‌ రెడ్డీస్‌ ల్యాబొరేటరీస్‌ (డీఆర్‌ఎల్‌) తమ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్‌ కె. అంజిరెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా తొలి స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహించింది. ఇందులో నోబెల్‌ బహుమతి గ్రహీత .. ఇజ్రాయెల్‌కు చెందిన ప్రొఫెసర్‌ అడా ఇ. యోనత్, భారత ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్‌ సైంటిఫిక్‌ సలహాదారు కె. విజయ రాఘవన్, ఇగ్నైట్‌ లైఫ్‌ సైన్స్‌ ఫౌండేషన్‌ సీఈవో స్వామి సుబ్రమణియన్, కాంటినెంటల్‌ హాస్పిటల్స్‌ సీఎండీ గురు ఎన్‌ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఔషధాలను చౌకగా అందుబాటులోకి తేవాలన్నది అంజి రెడ్డి విజన్‌ అని డాక్టర్‌ రెడ్డీస్‌ సహ చైర్మన్‌ జి.వి. ప్రసాద్‌ తెలిపారు. శాస్త్రీయ, సామాజిక అంశాలపై పెద్ద స్థాయిలో చర్చలు జరగడం అంజి రెడ్డికి నిజమైన నివాళి కాగలదని కంపెనీ చైర్మన్‌ సతీష్‌ రెడ్డి తెలిపారు. తదుపరి తరం యాంటీబయోటిక్స్‌ రూపకల్పనలో తన పరిశోధనలు ఏ విధంగా తోడ్పడగలవన్నది యోనత్‌ ఈ సందర్భంగా వివరించారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సీఆర్‌పీఎఫ్‌లో 9212 కానిస్టేబుల్‌ పోస్టులు

కేంద్ర హోంశాఖ పరిధిలోని సెంట్రల్‌ రిజర్వ్‌ పోలీస్‌ ఫోర్స్‌ (సీఆర్‌పీఎఫ్‌).. దేశవ్యాప్తంగా మొత్తం 9212 కానిస్టేబుల్‌(టెక్నికల్, ట్రేడ్స్‌మ్యాన్‌) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసింది. పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన పురుషులు, మహిళలు దరఖాస్తుకు అర్హులు.

» **అర్హతలు** : పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతోపాటు హెవీ ట్రాన్స్‌పోర్ట్‌ వెహికల్‌ డ్రైవింగ్‌ లైసెన్స్‌ కలిగి ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

» **వయసు**: కానిస్టేబుల్‌ పోస్టులకు 01.08.2023 నాటికి 21–27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎలక్ట్రిషియన్‌ పోస్టులకు 01.08.2023 నాటికి 18–23 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక ప్రక్రియ**: కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్, స్కిల్‌ టెస్ట్, ఫిజికల్‌ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్‌ స్టాండర్డ్‌ టెస్ట్, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు**: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
» **దరఖాస్తులు ప్రారంభం**: 27.03.2023
» **దరఖాస్తులకు చివరి తేదీ**: 25.04.2023
» **కంప్యూటర్‌ బేస్డ్‌ పరీక్ష తేదీలు** : 01.07.2023 నుంచి 13.07.2023
» **వెబ్‌సైట్‌**: https://crpf.gov.in/

ఐఐటీటీఎంలో బీబీఏలో ప్రవేశాలు

గ్వాలియర్‌(మధ్యప్రదేశ్‌)లోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజం అండ్‌ ట్రావెల్‌ మేనేజ్‌మెంట్‌(ఐఐటీటీఎం).. 2023–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీబీఏ(టూరిజం అండ్‌ ట్రావెల్‌) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య**: 375

» **అర్హత**: 50శాతం మార్కులతో గుర్తింపు పొందిన వర్సిటీ/బోర్డు నుంచి ఏదైనా సబ్జెక్టులో 10+2 ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 45శాతం మార్కులు తప్పనిసరి.

» **వయసు**: 01.07.2023 నాటికి 22 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు లభిస్తుంది. » **ఎంపిక విధానం**: రాతపరీక్ష, గ్రూప్‌ డిస్కషన్, పర్సనల్‌ ఇంటర్వ్యూ ఆధారంగా సీటు కేటాయిస్తారు. » **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది**: 31.05.2023.

» **ప్రవేశ పరీక్ష తేదీలు**: 04, 11, 18, 25 జూన్‌ 2023. » **వెబ్‌సైట్‌**: www.iittm.ac.in

స్టాక్‌ మార్కెట్‌ కోర్సులు.. సత్వరమే కొలువు

» ఫైనాన్షియల్, స్టాక్‌ మార్కెట్‌లలో.. నిపుణులకు డిమాండ్‌
» భారీగా నియామకాలు చేపడుతున్న సంస్థలు
» అకడమిక్‌ నైపుణ్యాలకు ఎన్‌ఎస్‌ఈ, సెబి, బీఎస్‌ఈ కోర్సులు



స్టాక్‌ మార్కెట్, ట్రేడింగ్‌! ఇటీవల కాలంలో ఎక్కువ మంది తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు స్టాక్‌ మార్కెట్, షేర్ల క్రయవిక్రయాల వైపు అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే!! మ్యూచువల్‌ ఫండ్స్‌లోనూ పెట్టుబడులు పెడుతున్నారు. ఇందుకోసం స్టాక్‌ బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌ సంస్థలను సంప్రదిస్తున్నారు! మరోవైపు డిజిటలైజేషన్‌ నేపథ్యంలో.. స్టాక్‌ ట్రేడింగ్, అనుబంధ విభాగాలు ఆన్‌లైన్‌లో సేవలందిస్తున్నాయి. ఇందుకోసం నిపుణులైన అభ్యర్థుల కోసం అన్వేషణ సాగిస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. స్టాక్‌ మార్కెట్‌ నైపుణ్యాలను అందించే కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌లు, కెరీర్‌ అవకాశాలపై ప్రత్యేక కథనం..

దేశంలో స్టాక్‌ మార్కెట్‌ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థలు విస్తరణ బాట పట్టాయి. మరోవైపు వినియోగదారులకు సేవలందించేందుకు బ్రోకింగ్, ఈక్విటీ సంస్థలు ఏర్పాటవుతున్నాయి. ఇవన్నీ కూడా నిపుణులైన మానవ వనరుల ద్వారా తమ సేవలందిస్తున్నాయి. అందుకోసం కామర్స్, ఫైనాన్స్, స్టాటిస్టిక్స్‌ నేపథ్యంతోపాటు స్టాక్‌ మార్కెట్‌ సంబంధిత కోర్సులు పూర్తి చేసుకున్న వారి కోసం అన్వేషిస్తున్నాయి.

భారీగా కొలువులు

స్టాక్‌ మార్కెట్‌లో ట్రేడింగ్, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు, మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థలు, వెల్త్‌ మేనేజ్‌మెంట్‌ కంపెనీల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. 2030 నాటికి అన్ని విభాగాల్లో కలిపి లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. కాబట్టి అకౌంటింగ్‌ నైపుణ్యాలు, విశ్లేషణ సామర్థ్యం, దూర దృష్టి, మార్కెట్‌ పరిస్థితులను అంచనా వేయగలిగే నైపుణ్యముంటే.. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చు.

అకడమిక్‌ మార్గాలు

దేశంలో స్టాక్‌ మార్కెట్‌లో కెరీర్‌ అవకాశాలు కోరుకునే వారికోసం ప్రత్యేక కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా స్టాక్‌ మార్కెట్‌ అనగానే గుర్తొచ్చే సెబీ, నేషనల్‌ స్టాక్‌ ఎక్స్ఛేంజ్, ముంబై స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌లు ప్రత్యేకంగా శిక్షణ విభాగాలను ఏర్పాటు చేసి.. సర్టిఫికెట్‌ స్థాయి నుంచి పీజీ డిప్లొమా వరకు పలు కోర్సులను అందిస్తున్నాయి. బ్యాచిలర్‌ డిగ్రీ అర్హతతోనే వీటిలో చేరే అవకాశం ఉంది. స్టాక్‌ బ్రోకింగ్‌కు సంబంధించిన కోర్సులను ఇంటర్మీడియెట్‌ అర్హతతోనే అభ్యసించే వీలుంది.

ఎన్‌ఎస్‌ఈ అకాడమీ

నేషనల్‌ స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌ (ఎన్‌ఎస్‌ఈ)ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటైన ఎన్‌ఎస్‌ఈ అకాడమీలో ప్రస్తుతం.. పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ సర్టిఫికెట్‌ ఇన్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ బ్యాంకింగ్, పీజీ సర్టిఫికెట్‌ ప్రోగ్రామ్‌ ఇన్‌ ఫైనాన్షియల్‌ టెక్నాలజీస్, ఎగ్జిక్యూటివ్‌ ప్రోగ్రామ్‌ ఇన్‌ డిజిటల్‌ ఫైనాన్స్‌ అండ్‌ బ్యాంకింగ్, పీజీ సర్టిఫికెట్‌ ఇన్‌ ఫైనాన్షియల్‌ మార్కెట్స్, ఎంబీఏ–ఫైనాన్షియల్‌ టెక్నాలజీస్‌ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో చేరేందుకు అర్హత బ్యాచిలర్‌ డిగ్రీ. ఐఐఎం–జమ్ముతో ఒప్పందం చేసుకొని.. ఎగ్జిక్యూటివ్‌ ప్రోగ్రామ్‌ ఇన్‌ ఫైనాన్షియల్‌ అనలిటిక్స్‌ను కోర్సును ఎన్‌ఎస్‌ఈ అకాడమీ అందిస్తోంది.

బీఎస్‌ఈ ఇన్‌స్టిట్యూట్‌

స్టాక్‌ మార్కెట్‌ అనగానే గుర్తొచ్చే ముంబై స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌ కూడా బీఎస్‌ఈ ఇన్‌స్టిట్యూట్‌ పేరుతో ప్రత్యేక సంస్థను నెలకొల్పి.. పలు కోర్సులను అందిస్తోంది.పీజీ డిప్లొమా ఇన్‌ ఫైనాన్షియల్‌ మార్కెట్స్, పీజీ డిప్లొమా ఇన్‌ సైబర్‌ సెక్యూరిటీ, పీజీ డిప్లొమా ఇన్‌ ప్రెడిక్టివ్‌ అనలిటిక్స్, పీజీ డిప్లొమా ఇన్‌ ఫైనాన్షియల్‌ టెక్నాలజీ, పీజీ ప్రోగ్రామ్‌ ఇన్‌ బ్యాంకింగ్‌ అండ్‌ ఫైనాన్స్, పీజీ డిప్లొమా ఇన్‌ రెగ్యులేటరీ కంప్లయన్స్‌ మేనేజ్‌మెంట్‌ వంటి కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తోంది. అదే విధంగా ఐఐటీ–పాట్నాతో కలిసి ఏడాది వ్యవధి గల పీజీ సర్టిఫికెట్‌ ఇన్‌ డేటా అనలిటిక్స్‌ అండ్‌ బిజినెస్‌ ఇంటెలిజెన్స్‌ కోర్సును పార్ట్‌ టైమ్‌ విధానంలో అందిస్తోంది. అలాగే వెల్త్‌ మేనేజ్‌మెంట్, బిజినెస్‌ లాలో ఎగ్జిక్యూటివ్‌ ప్రోగ్రామ్స్‌ను కూడా ఇక్కడ అభ్యసించే వీలుంది. వీటితోపాటు సర్టిఫైడ్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ అండ్‌ స్టాక్‌ మార్కెట్‌ ఎక్స్‌పర్ట్, అడ్వాన్స్‌డ్‌ మేనేజ్‌మెంట్‌ ప్రోగ్రామ్‌ ఫర్‌ మేనేజీరియల్‌ ఎక్స్‌పీరియన్స్‌ కోర్సుల్లో కూడా ప్రవేశం కల్పిస్తోంది.

సెబీ ఆధ్వర్యంలో ఎన్‌ఐఎస్‌ఎం

దేశంలో స్టాక్‌ మార్కెట్‌ కార్యకలాపాలను పర్యవేక్షించే.. సెక్యూరిటీస్‌ ఎక్స్ఛేంజ్‌ బోర్డ్‌ ఆఫ్‌ ఇండియా(సెబీ) కూడా నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సెక్యూరిటీస్‌ మార్కెట్‌ పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి పలు కోర్సులను అందిస్తోంది. ఫుల్‌ టైమ్‌ విధానంలో.. పీజీ డిప్లొమా ఇన్‌ సెక్యూరిటీస్‌ మార్కెట్, పీజీ డిప్లొమా ఇన్‌ క్వాంటిటేటివ్‌ ఫైనాన్స్‌ ప్రోగ్రామ్‌లను, పార్ట్‌ టైమ్‌ విధానంలో పీజీ డిప్లొమా ఇన్‌ డేటాసైన్స్, పీజీ డిప్లొమా ఇన్‌ ఫైనాన్షియల్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ రిస్క్‌ మేనేజ్‌మెంట్, సర్టిఫికెట్‌ ఇన్‌ సెక్యూరిటీస్‌ 'లా'స్, సర్టిఫికెట్‌ ఇన్‌ ట్రెజరీ మేనేజ్‌మెంట్‌ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తోంది. ముంబై యూనివర్సిటీ భాగస్వామ్యంతో ఈ కోర్సులకు రూపకల్పన చేసింది.

సర్టిఫికేషన్‌ కోర్సులు

- ఎన్‌ఎస్‌ఈ అకాడమీ, బీఎస్‌ఈ ఇన్‌స్టిట్యూట్‌ లిమిటెడ్, ఎన్‌ఐఎస్‌ఎంలు పలు సర్టిఫికేషన్‌ కోర్సులు సైతం అందిస్తున్నాయి.
- ఎన్‌ఎస్‌ఈ అధ్వర్యంలో.. ప్రొఫెషనల్‌ ఫైనాన్షియల్‌ లిటరసీ కోర్స్, సర్టిఫైడ్‌ మార్కెట్‌ ప్రొఫెషనల్, ఎన్‌ఎస్‌సీ ప్రొఫిషియన్సీ సర్టిఫికెట్, ఎన్‌ఎస్‌ఈ అకాడమీ ర్యాపిడ్‌ సిరీస్, ఎన్‌ఎస్‌ఈ ఫైనాన్షియల్‌ బేసిక్స్‌ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్‌ఈ.. కరెన్సీ డెరివేటివ్స్, రిజిస్ట్రార్స్‌ అండ్‌ ట్రాన్స్‌ఫర్‌ ఏజెంట్స్, సెక్యూరిటీస్‌ ఇంటర్మీడియరీస్‌ కంప్లయన్స్, ఇంట్రెస్ట్‌ రేట్స్‌ డెరివేటివ్స్, సెక్యూరిటీస్‌ ఆపరేషన్స్‌ అండ్‌ రిస్క్‌ మేనేజ్‌మెంట్, ఈక్విటీ డెరివేటివ్స్, ఇన్వెస్ట్‌మెంట్‌ అడ్వయిజర్, కామన్‌ డెరివేటివ్స్, రీసెర్చ్‌ అనలిస్ట్‌ తదితర సర్టిఫికెట్‌ కోర్సులు అందిస్తోంది.
- ఎన్‌ఐఎస్‌ఎం.. వెల్త్‌ మేనేజ్‌మెంట్‌ సర్టిఫికేషన్, చార్టర్డ్‌ వెల్త్‌ మేనేజర్, చార్టర్డ్‌ ఫైనాన్షియల్‌ ప్లానర్, సర్టిఫైడ్‌ ఇంటర్నేషనల్‌ వెల్త్‌ మేనేజర్‌ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశాలు కల్పిస్తోంది.
- సర్టిఫికేషన్‌ కోర్సులు మూడు నెలల నుంచి ఆరు నెలల వ్యవధిలో ఉంటాయి. ఈ సర్టిఫికెట్‌ చేతిలో ఉంటే స్టాక్‌ మార్కెట్‌లో కెరీర్‌ అవకాశాలు అందుకోవడంలో ముందంజలో నిలవొచ్చు.
- వీటితోపాటు యుడెమీ, కోర్సెరా, ఎడెక్స్‌ వంటి సంస్థలు ఆన్‌లైన్‌ విధానంలో ఇన్వెస్ట్‌మెంట్, ఫైనాన్షియల్‌ మార్కెట్స్, ట్రేడింగ్, మనీ మార్కెట్, డెరివేటివ్స్‌ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌ బ్యాంకింగ్‌ అండ్‌ ఫైనాన్స్, రిస్క్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ క్రెడిట్‌ ప్రిన్సిపుల్స్‌ తదితర స్టాక్‌ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన కోర్సులను అందిస్తున్నాయి.

నేర్చుకునే అంశాలివే

సెక్యూరిటీస్‌ మార్కెట్‌ కార్యకలాపాల నిర్వహణ నైపుణ్యాలను అందిస్తున్న కోర్సుల ద్వారా.. సదరు అభ్యర్థులకు స్టాక్‌ మార్కెట్‌ బేసిక్స్‌ నుంచి ఫిన్‌టెక్‌ వరకు పలు అంశాలను నేర్పిస్తారు. ప్రధానంగా పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్‌ అడ్వయిజరీ, రీసెర్చ్‌ అనాలిసిస్‌ వంటి కోర్‌ అంశాలతో పాటు ఇటీవల కాలంలో ఫిన్‌టెక్‌లో కీలకంగా నిలుస్తున్న ఏఐ–ఎంఎల్, వాటి ద్వారా కార్యకలాపాల నిర్వహణపై అవగాహన కల్పిస్తారు.

రెడ్‌ కార్పెట్‌ స్వాగతం

స్టాక్‌ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌ బ్యాంకింగ్‌కు సంబంధించి స్పెషలైజ్డ్‌ నైపుణ్యాలున్న వారికి ఈక్విటీ మేనేజ్‌మెంట్, స్టాక్‌ బ్రోకింగ్‌ సంస్థలు, మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థలు రెడ్‌ కార్పెట్‌ స్వాగతం పలుకుతున్నాయి. సగటున రూ.4 లక్షల వార్షిక వేతనంతో కొలువులు ఖరారు చేస్తున్నాయి.

జాబ్‌ ప్రొఫైల్స్‌

స్టాక్‌ మార్కెట్, స్టాక్‌ ట్రేడింగ్‌ సంబంధిత కోర్సులు, నైపుణ్యాలు సొంతం చేసుకున్న వారికి లభిస్తున్న జాబ్‌ ప్రొఫైల్స్‌ వివరాలు..

రీసెర్చ్‌ అనలిస్ట్‌

స్టాక్‌ మార్కెట్, ఫైనాన్షియల్‌ అడ్వయిజరీ విభాగాల్లో కీలకమైన హోదా.. రీసెర్చ్‌ అనలిస్ట్‌. షేర్లు, ఈక్విటీలకు సంబంధించి క్రయ–విక్రయాల అధ్యయనం వంటివి ఈక్విటీ రీసెర్చ్‌ అనలిస్ట్‌ ప్రధాన విధులు. వీరు పలు స్టాక్స్‌కు సంబంధించి రీసెర్చ్‌ చేయడం, వాటిని ఫండ్‌ మేనేజర్లకు వివరించడం వంటివి చేయాల్సి ఉంటుంది.

ఇన్వెస్ట్‌మెంట్‌ మేనేజర్‌

ఇన్వెస్టర్ల తరఫున పలు సెక్యూరిటీ పోర్ట్‌ఫోలియోస్‌లో ఇన్వెస్ట్‌ చేయడం ఇన్వెస్ట్‌మెంట్‌ మేనేజర్ల ప్రధాన బాధ్యతగా ఉంటుంది. వీరు నిత్యం సెక్యూరిటీస్‌ క్రయ విక్రయాలు, పోర్ట్‌ఫోలియో సమీక్ష, లావాదేవీల పరిష్కారం, సంబంధిత స్టాక్స్, పనితీరు మదింపు, నియంత్రణ, క్లయింట్లకు (ఇన్వెస్టర్లు)కు నివేదించడం వంటివి చేస్తారు. కామర్స్, ఫైనాన్స్, ఎకనామిక్స్‌ నేపథ్యం ఉన్న బ్యాచిలర్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులను ఈ జాబ్‌ ప్రొఫైల్‌లోకి నియమించుకుంటున్నాయి.

ఫైనాన్షియల్‌ అడ్వైజర్‌

క్లయింట్లను గుర్తించడం, వారి పెట్టుబడి లక్ష్యాన్ని తెలుసుకోవడం, దానికి అనుగుణంగా అందుబాటులో ఉన్న ప్రొడక్ట్‌ల గురించి వివరించడం వీరి విధులు.క్లయింట్ల లక్ష్యాలు తెలుసుకోవడమే కాకుండా..క్యాపిటల్‌ మార్కెట్‌లో ఆయా సంస్థల పనితీరు గురించి అవగాహన కూడా వీరికి అవసరం. బ్రోకరేజ్‌ సంస్థలు బ్యాచిలర్‌ డిగ్రీ అర్హత ఉన్న వారిని ఈ జాబ్‌ ప్రొఫైల్‌లో నియమించుకుంటున్నాయి. క్షేత్ర స్థాయిలో పని చేసేందుకు ఇంటర్మీడియెట్‌ అర్హత ఉన్న వారిని రిక్రూట్‌ చేసుకుంటున్నాయి.

స్టాక్‌ బ్రోకర్‌

షేర్‌ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారి తరఫున ట్రేడింగ్‌ కార్యకలాపాలు నిర్వహించే వారే.. స్టాక్‌ బ్రోకర్. ప్రస్తుతం అన్ని బ్రోకింగ్‌ సంస్థలు వీరిని డీలర్లు, ఏజెంట్లుగా పిలుస్తున్నాయి. బ్యాచిలర్, ఇంటర్మీడియెట్‌ అర్హతతో ఈ కొలువులో చేరొచ్చు.

స్టాక్‌ ట్రేడర్‌

క్షేత్ర స్థాయిలోని స్టాక్‌ బ్రోకర్స్‌తో సంప్రదిస్తూ వారు పేర్కొన్న ప్రకారం.. ఆన్‌లైన్‌ క్రయ విక్రయాలు నిర్వహించడం, వాటికి సంబంధించిన నివేదికలు రూపొందించడం స్టాక్‌ ట్రేడర్స్‌ విధులుగా ఉంటున్నాయి.

వెల్త్‌ మేనేజర్‌

నిర్దిష్టంగా ఒక సంస్థ అందించే పలు ప్రొడక్ట్‌ల గురించి రిటైల్‌ కస్టమర్లకు తెలియజేయడం వెల్త్‌ మేనేజర్‌ ప్రధాన విధులు. సంస్థలకు కొత్త క్లయింట్లు (ఇన్వెస్టర్లు) తీసుకురావడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారు.

కస్టోడియన్‌

స్టాక్‌ ట్రేడింగ్, ఫైనాన్షియల్‌ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి మ్యూచువల్‌ ఫండ్‌ సంస్థల్లో లభిస్తున్న ప్రధాన జాబ్‌ ప్రొఫైల్.. కస్టోడియన్‌/రిజిస్ట్రార్. ఇన్వెస్టర్ల నుంచి నగదును సమీకరించి ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టే సంస్థలు.. సదరు నగదును,ఫండ్‌ నిర్వహణను దుర్వినియోగం చేయకుండా చూడడం కస్టోడియన్‌ లేదా రిజిస్ట్రార్స్‌ ప్రధాన విధులు. ఫండ్స్‌ను ఆఫర్‌ చేసే బ్యాంకులు, ఫైనాన్షియల్‌ ఇన్‌స్టిట్యూట్స్, బ్రోకరేజ్‌ సంస్థలు వీరిని నియమించుకుంటున్నాయి.

ఫండ్‌ మేనేజర్‌

మ్యూచువల్‌ ఫండ్స్‌ విభాగంలో కీలకమైన జాబ్‌ ప్రొఫైల్.. ఫండ్‌ మేనేజర్. వీరు ఆయా సంస్థల ప్రస్తుత పనితీరు, ఆర్థిక ఫలితాలు, లాభ నష్టాలు, డివిడెండ్స్‌ వంటి అంశాలను పరిశీలించి.. ఇన్వెస్టర్లకు సరైన సలహా ఇవ్వాల్సి ఉంటుంది. వీరికి క్యాపిటల్‌ మార్కెట్‌ పరిస్థితులపై సంపూర్ణ అవగాహన, విశ్లేషణ నైపుణ్యాలు అవసరం. కామర్స్, ఎకనామిక్స్, ఎంబీఏ, సీఏ, ఫైనాన్షియల్‌ ప్లానింగ్, స్టాటిస్టిక్స్‌ విభాగంలో పీజీ స్థాయి అర్హతలు ఉన్న వారిని నియమిస్తున్నాయి.

క్లుప్తంగా...

సంగీత నాటక అకాడమీకి పదెకరాలు కేటాయించండి

సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయనున్న సంగీత నాటక అకాడమీ ప్రాంతీయ కేంద్రానికి అవసరమైన భూమిని కేటాయించాలని పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన లేఖ రాశారు. విభిన్న సాంస్కృతిక వారసత్వానికి తెలంగాణ ప్రతీక అనీ, కాకతీయుల కాలంలో ఎంతో ప్రాభవాన్ని పొందిన పేరిణి శివతాండవం, గొల్ల సుద్దులు, ఒగ్గు కథలు, గోత్రాలు, చిందు భాగవతం వంటి సాంప్రదాయ కథా ప్రదర్శనలు ఎంతో ప్రసిద్ధిగాంచినవని లేఖలో వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఉత్తర, దక్షిణ భారతదేశాలకు అనుసంధానంగా, సాంస్కృతిక వారసత్వ నిలయంగా కూడా ఉందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంగీత నాటక అకాడమీ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని తెలిపారు. ఈ సంస్థ దేశంలోని విభిన్నమైన, అసంపూర్ణ సాంస్కృతిక వారసత్వాన్ని సంగీతం, నాట్యం, నాటకం వంటి రూపాలలో ప్రదర్శనలు ఇచ్చి వాటికి సరైన ప్రచారం కల్పించటం ద్వారా ఆయా సంస్కృతుల వారసత్వాన్ని పరిరక్షించటానికి కృషి చేస్తోందని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం హైదరాబాద్ నడిబొడ్డున రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న 10 ఎకరాల భూమిని గుర్తించి, కేటాయించాలని కోరారు.

సాంకేతిక లోపంతో నిలిచిన గోదావరి ఎక్స్‌ప్రెస్

మల్కాజిగిరి: సాంకేతిక లోపంతో గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును మౌలాలి రైల్వే స్టేషన్‌లో బుధవారం నిలిపివేశారు. సికింద్రాబాద్ నుంచి బయల్దేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోని ఓ బోగీ వద్ద పొగలు రావడంతో మౌలాలి రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సమస్యను పరిశీలించిన పది నిమిషాల అనంతరం రైలు వెళ్లిపోయింది.

తోక లేని పిట్ట 90 ఆమడలు తిరిగిందట ..ఏంటది..?

అంటూ..ఒకప్పుడు పోస్టు కార్డు గురించిన పొడుపు కథ విప్పమని అడిగేవారు. ఇప్పటితరానికి పోస్టు కార్డు తెలియదు.. పొడుపు కథ అంతకన్నా తెలియదు. కొందరికి తపాలా కార్యాలయం (పోస్టాఫీసు) గురించి కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు. ప్రైవేటు కొరియర్ సంస్థలు, బ్యాంకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన తర్వాత తపాలా శాఖ ఒకప్పటి వైభవం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఇక జనం తపాలా సేవలను మరిచిపోతున్నారా? అన్నట్టుగా పరిస్థితి తయారయ్యింది. దీంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తానే జనం బాట పట్టి మంచి ఫలితాలు సాధిస్తోంది.

ఇంటింటికీ తిరుగుతున్నారు.. అకౌంట్లు తెరిపిస్తున్నారు

జనం బాట పట్టిన తపాలా శాఖ • బ్యానర్లు, కరపత్రాలతో సేవలపై ముమ్మర ప్రచారం

- పలు పోస్టల్ పథకాలపై మేళాల నిర్వహణ
- వారం రోజుల్లోనే లక్షన్నర కొత్త పొదుపు ఖాతాలు ఓపెన్
- జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో నిలిచిన తెలంగాణ సర్కిల్
- సుకన్య సమృద్ధి యోజన ఖాతాలకూ డిమాండ్

సాక్షి, హైదరాబాద్


పూర్వ వైభవాన్ని సాధించే క్రమంలో తపాలా శాఖ ఎప్పటికప్పుడు కొత్త పథకాలను, సేవలను ప్రవేశపెట్టడం ప్రారంభించింది. అయితే వీటి గురించిన ప్రచారం పెద్దగా లేకపోవడంతో, రెగ్యులర్‌గా పోస్టాఫీసులకు వెళ్లేవారికి తప్ప మిగతా వారికి అవగాహన ఉండటం లేదు. ఈ నేపథ్యంలోనే శాఖ సిబ్బంది ప్రజలకు చేరువగా వెళుతున్నారు. బ్యానర్లు, కరపత్రాలు పట్టుకుని ఊరూరా, ఇంటింటా తిరుగుతున్నారు. పోస్టాఫీసును, వాటి ద్వారా అందుబాటులో ఉన్న సేవలను గుర్తు చేస్తున్నారు. తపాలాఫీసును ఉత్తరాల బట్వాడా కార్యాలయంగానే చూడకుండా.. వివిధ ప్రజోపయోగ సేవలకు కేంద్రంగా గుర్తించాలంటూ కరపత్రాల ద్వారా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారం మంచి ఫలితాన్ని ఇవ్వడం, ప్రజల నుంచి అనూహ్య స్పందన వ్యక్తం కావడం విశేషం.

గ్రామీణ ప్రాంతాలపై దృష్టి

వివిధ పథకాలకు సంబంధించిన ప్రత్యేక మేళాలు నిర్వహించడంతో పాటు కరపత్రాలు, బ్యానర్లతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. బ్యాంకులు, ఏటీఎంలు అంతగా అందుబాటులో ఉండనందున, గ్రామాల్లో ప్రచారం చేస్తూ మైక్రో ఏటీఎంల ద్వారా తమ సిబ్బందే ఫోన్ చేస్తే ఇంటికి డబ్బు తెచ్చి అందిస్తారని, పోస్టాఫీసులకు వెళ్లినా డబ్బు చెల్లిస్తారని, రైతు బంధు లాంటివి కూడా ఇంటికే వచ్చి ఇస్తారంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ విధంగా ఇటీవల వారం రోజుల్లోనే 1,52,833 పొదుపు ఖాతాలను తెరిపించిన తెలంగాణ సర్కిల్ జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో నిలిచింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలోని పొదుపు ఖాతాల సంఖ్య 42,55,352కు చేరుకుంది. వీటిల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 6,76,975 ఖాతాలు తెరవడం గమనార్హం.

వృద్ధుల పేరుతో ఖాతాలు తెరిస్తే గరిష్టంగా 8 శాతం వడ్డీ చెల్లిస్తుండటం జనం తపాలా ఖాతాల వైపు మళ్లేందుకు కారణమవుతోంది. ఆడపిల్లల పేరుతో చేసే పొదుపు మొత్తంపై 7.6 వడ్డీ చెల్లిస్తున్న కారణంగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలకు డిమాండ్ పెరిగింది. ఇటీవల మేళాలు ఏర్పాటు చేసి ప్రచారం చేసిన కేవలం మూడు రోజుల్లోనే కొత్తగా 34,384 ఖాతాలు తెరుచుకున్నాయి. దీంతో మొత్తం ఖాతాల సంఖ్య 5,71,659కి చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ తరహాలో 92,509 ఖాతాలు తెరుచుకోవడం విశేషం.

ఆకర్షిస్తున్న వడ్డీ శాతాలు





ఇంటికే వచ్చి దరఖాస్తు నింపించి ఖాతా తెరిపిస్తున్న పోస్టల్ సిబ్బంది

- ‘సుకన్య సమృద్ధి యోజన పథకం కింద బాలికల పేరిట పొదుపు ఖాతా తెరిస్తే 7.6 శాతం వడ్డీతో ఆ మొత్తం చూస్తుండగానే పెరుగుతూ పోతుంది. వారి చదువులకు, పెళ్లిళ్లకు ఎంతో ఉపయోగపడుతుంది..’ అంటూ తపాలా శాఖ ప్రజల్లోకి వెళ్లింది. సిబ్బంది చేసిన కృషి ఫలించింది. తల్లిదండ్రులు కేవలం 3 రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 34 వేల ఖాతాలు తెరిచారు.
- ‘తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతాలు తెరిస్తే మంచి వడ్డీతో పాటు మైక్రో ఏటీఎం ద్వారా పోస్ట్‌మాన్ ఇంటికి డబ్బు పట్టుకొస్తారు. ఏటీఎంకు దూరంగా ఉన్నామన్న బెంగ అవసరం లేదు..’ అంటూ తపాలా శాఖ సిబ్బంది మహా మేళాల ద్వారా చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. కేవలం వారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.53 లక్షల కొత్త పొదుపు ఖాతాలు తెరుచుకున్నాయి.



తపాలా శాఖ ద్వారా 150 రకాల సేవలు అందిస్తున్నాం. వీటిల్లో చాలావరకు పోస్టాఫీసు వరకు రాకుండా పోస్ట్‌మాన్ ద్వారానే పొందవచ్చు. జనవరి నుంచి ఖాతాలపై వడ్డీని కూడా పెంచాం. కానీ ప్రజల్లో వీటిపై పెద్దగా అవగాహన లేదు. అందుకే మేమే వారి వద్దకు వెళ్తున్నాం. మా ప్రయత్నం మంచి ఫలితాన్నిస్తోంది. –పీవీఎస్ రెడ్డి, పోస్ట్‌మాస్టర్ జనరల్

బాల వికాస, క్రిస్టియన్ మిషనరీల్లో ఐటీ సోదాలు

- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 బృందాలతో తనిఖీలు
- విదేశాల నుంచి సేకరించిన విరాళాలపై ఆరా
- పలుచోట్ల సొమ్మును దారి మళ్లించినట్టు ఆరోపణలు



బాలవికాస సంస్థ వద్ద కేంద్ర బలగాలు

సాక్షి, హైదరాబాద్/ సాక్షిప్రతినిధి, వరంగల్/ కాజీపేట రూరల్/ కీసర: రాష్ట్రంలో మరోసారి ఆదాయ పన్ను శాఖ భారీ స్థాయిలో సోదాలు నిర్వహించింది. అయితే ఈసారి రియల్ ఎస్టేట్ సంస్థలు, రాజకీయ నాయకులకు సంబంధం లేని బాల వికాస ఫౌండేషన్, క్రిస్టియన్ మిషనరీలలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు కేంద్ర బలగాల బందోబస్తు మధ్య ఈ తనిఖీలు జరిగాయి. ల్యాప్‌టాప్, కంప్యూటర్లు సీజ్ చేసి హార్డ్‌డిస్కులు, సెల్‌ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్, వరంగల్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా సంస్థల్లో ఏకకాలంలో సుమారు 40 బృందాలతో సోదాలు చేశారు. గురువారం కూడా ఈ సోదాలు కొనసాగే అవకాశం ఉందని చెప్తున్నారు.

కార్యాలయాలు, నివాసాల్లోనూ..

మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లి దాయరలోని బాల వికాస స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు హైదరాబాద్‌లోని అల్వాల్, బొల్లారం, జీడిమెట్ల, పటాన్‌చెరు, తార్నాక, అల్వాల్, సోమాజిగూడల్లోని కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాల్లో అధికారులు తనిఖీలు చేశారు.

విరాళాలను దారిమళ్లించిన ఆధారాలతో..

బాల వికాస సోషల్ సర్వీసెస్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరెడ్డి, ఫౌండర్ బాలథెరిస్సా సింగారెడ్డిలు రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం బహుళజాతి కంపెనీలు, జాతీయ బ్యాంకుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ సంస్థ ‘ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్‌ఏ)’కింద విదేశాల నుంచి 50 మిలియన్ డాలర్లు (సుమారు రూ.412 కోట్లు) విరాళంగా సేకరించిందని.. ఆ విరాళాలతో కార్యక్రమాలను నిర్వహిస్తోందని అధికారులు గుర్తించినట్టు తెలిసింది. అయితే సంస్థ పేరుతో సేకరించిన విరాళాలను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆయన భార్య, వ్యవస్థాపక డైరెక్టర్ దారి మళ్లించినట్టుగా ఐటీకి ఆధారాలు లభించినట్టు తెలిసింది. ఐదేళ్లుగా బాల వికాసకు చెందిన ఆర్థిక లావాదేవీలు.. విదేశీ విరాళాలు, రాష్ట్రంలోని కంపెనీలు, రాజకీయ ప్రముఖుల నుంచి వస్తున్న విరాళాల సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది.

పన్ను మినహాయింపులు లేని లావాదేవీలపై..

ఇక క్రిస్టియన్ మిషనరీలకు వస్తున్న నిధులు, వాటి వినియోగానికి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆదాయ పన్ను మినహాయింపులు లేని ఆర్థిక లావాదేవీలపై దృష్టి కేంద్రీకరించినట్టు తెలిసింది. విరాళాలుగా సేకరించిన నిధులను నిర్వాహకులు పలు సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టారన్న ఆధారాలు ఐటీ అధికారులకు లభించినట్టు సమాచారం.

ఐటీ దాడులు అమానుషం: ఎర్రబెల్లి

పేదలకు సేవలందిస్తున్న బాల వికాస వంటి స్వచ్ఛంద సంస్థలపై ఐటీ దాడులు అమానుషమని మంత్రి ఎర్రబెల్లి మండిపడ్డారు. దేశ విదేశాల నుంచి సేకరిస్తున్న విరాళాలతో సుమారు 30 ఏళ్లుగా ప్రజాసేవ చేస్తోందన్నారు.

భద్రాచల రామకల్యాణ తలంబ్రాలు మీ ఇంటికే..

రూ.116 చెల్లిస్తే అందించనున్న ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను కోరుకున్న భక్తులకు ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం ద్వారా అందించాలని ఆర్టీసీ నిర్ణయించింది. దేవాదాయ శాఖ సహకారంతో గతేడాది లాగే ఈ సేవను నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. తలంబ్రాలు కావాలనుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ కార్గో పార్సిల్ కేంద్రాల్లో రూ.116 చెల్లించి వివరాలను నమోదు చేసుకుంటే వారి ఇళ్లకే తలంబ్రాలను తెచ్చి అందించనున్నట్లు చెప్పారు. బస్ భవన్‌లో బుధవారం భద్రాచల సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను సజ్జనార్ ఆవిష్కరించారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం బిజినెస్ హెడ్ సంతోష్‌కుమార్‌కు రూ.116 చెల్లించి ఎండీ తొలి బుకింగ్ నమోదు చేసుకున్నారు. బుక్ చేసుకోవాలనుకునే వారు 9177683134, 7382924900, 9154680020 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సికింద్రాబాద్ టు ప్రయాగ్‌రాజ్

- పూరీ–కోణార్క్–కాశీ–గయ–అయోధ్య మీదుగా భారత్ గౌరవ్ రైలు
- 8 రాత్రుళ్లు, 9 పగళ్లు.. పుణ్య క్షేత్రాల పర్యటనకు సిద్ధం
- ఈనెల 18న ప్రారంభం
- దక్షిణ మధ్య రైల్వేలో తొలి సర్వీసు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని విశిష్ట ప్రదేశాలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు ఉద్దేశించిన ‘భారత్ గౌరవ్’ సర్వీసు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తొలిసారిగా ఈనెల 18న ప్రారంభం కానుంది. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సర్వీస్ ప్రొవైడర్‌గా ఈ రైలు సేవలు కొనసాగనున్నాయి. దీనికి ‘పుణ్యక్షేత్ర యాత్ర– పూరీ–కాశీ–అయోధ్య యాత్ర’గా నామకరణం చేశారు. ఈనెల 18 నుంచి 26 వరకు 8 రాత్రులు, 9 పగళ్లు ఈ యాత్ర కొనసాగనుంది. పూరీ, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ లాంటి పుణ్య క్షేత్రాలను చుట్టిరానుంది. ఈ రైలు 18న మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌లో బయలుదేరి రెండు తెలుగు రాష్ట్రాల్లోని నిర్ధారిత ముఖ్య స్టేషన్‌లలో ఆగుతుంది. కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం స్టేషన్‌లలో దీనికి హాల్టులుంటాయి.

హోటళ్లలో బస ఏర్పాటు

ఎకానమీ కేటగిరీలో టికెట్ బుక్ చేసుకునేవారికి హోటళ్లలో రాత్రి బసకు నాన్ ఏసీ గదులను కేటాయిస్తారు, స్టాండర్డ్, కంఫర్ట్ కేటగిరీ ప్రయాణికులకు ఏసీ గదులుంటాయి. ఆయా ప్రాంతాల్లో వాహనాల్లో వెళ్లాల్సిన చోట ఎకానమీ, స్టాండర్డ్ కేటగిరీ వారికి నాన్ ఏసీ వాహనాలు, కంఫర్ట్ వారికి ఏసీ వాహనాలు ఏర్పాటు చేస్తారు. భోజనంలో కేవలం శాఖాహారాన్నే అందిస్తారు. టీ, అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాలకు విడిగా చార్జి చేయరు. ప్రయాణికులకు ప్రయాణ బీమా చేయిస్తారు.

దర్శించే ప్రాంతాలు..

పూరీ: జగన్నాథస్వామి ఆలయం
కోణార్క్: సూర్య దేవాలయం, బీచ్
గయా: విష్ణుపాద ఆలయం
వారణాసి (కాశీ): విశ్వనాథ ఆలయం, కారిడార్, విశాలాక్షి–అన్నపూర్ణ దేవీ ఆలయాలు
అయోధ్య: రామజన్మ భూమి, హనుమాన్ గర్హి
ప్రయాగ్‌రాజ్: త్రివేణీ సంగమం, హనుమాన్ మందిరం, శంకర్ విమాన మండపం
రైలులో మొత్తం సీట్ల సంఖ్య : 700



చార్జీలు ఇలా

	పెద్దలకు	పిల్లలకు (5–11 సం.)
ఎకానమీ	రూ.15,300	రూ.13,060
స్టాండర్డ్	రూ.24,085	రూ.21,460
కంఫర్ట్	రూ.31,510	రూ.28,360

తీర్థయాత్రికులకు గొప్ప అవకాశం: అరుణ్‌కుమార్ జైన్

తీర్థయాత్రలు చేయాలనుకునేవారికి భారత్ గౌరవ్ రైలు రూపంలో గొప్ప అవకాశాన్ని రైల్వే అందుబాటులోకి తెచ్చిందని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. బుధవారం ఆయన రైల్ నిలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ రైలు వివరాలు వెల్లడించారు. ఈ రైలులో ప్రయాణం వైవిధ్యంగా, పూర్తి సౌకర్యంగా ఉంటుందని, యాత్రికులకు మధురానుభూతిని పంచుతుందని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో తిరిగేందుకు వాహనాలు మాట్లాడుకోవటం, భోజనం, బస కోసం హోటళ్ల వెంట పరుగెత్తాల్సిన పనిలేకుండా అన్నీ తామే ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో ఆందోళన లేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా పర్యాటకులు యాత్ర చేసే వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఉదయ్‌కుమార్ రెడ్డి, సికింద్రాబాద్ డీఆర్ఎం అభయ్‌కుమార్ గుప్తా, ఐఆర్‌సీటీసీ గ్రూప్ జీఎం రాజా కుమార్, సీపీఆర్ఓ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నానక్‌రామ్‌గూడకు అమెరికా కాన్సులేట్



అవనతం చేసిన జాతీయ పతాకాన్ని అందుకుంటున్న కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో బుధవారం అమెరికా జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. బేగంపేట సమీపంలోని పైగా ప్యాలెస్‌లో 14 ఏళ్లుగా పనిచేస్తున్న అమెరికా కాన్సులేట్ ఈనెల 20న నానక్‌రామ్‌గూడలో సువిశాల కార్యాలయంలోకి మారనుంది. అధునాతన సౌకర్యాలతో అమెరికన్ కాన్సులేట్ జనరల్ శాశ్వత భవనంలోకి మారనుంది. తాత్కాలిక భవనమైన పైగా ప్యాలెస్ నుంచి పని చేసే చివరి రోజు కావడంతో బుధవారం జాతీయ పతాకాన్ని అవనతం చేశామని, కొత్త భవనంలోకి వెళ్లిన వెంటనే మళ్లీ అక్కడ ఎగరేస్తామని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ ఒక ట్వీట్‌లో తెలిపారు. 2007లో దివంగత మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అమెరికన్ కాన్సులేట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. తాత్కాలిక ఏర్పాటుగా పైగా ప్యాలెస్‌లో కార్యకలాపాలు మొదలైనా.. శాశ్వత భవనానికి వైఎస్ హయాంలోనే నానక్‌రామ్‌గూడలో 13 ఎకరాల స్థలం కేటాయించారు. కొత్త కార్యాలయంలో ఈనెల 23 నుంచి సాధారణ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.